


www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★


దక్షిణ అమెరికాలో మరో గాజాను సృష్టిస్తారా?

దాడులతో ఉక్రేన్ అతలాకుతలం

02

సంపుటి 08, సంచిక: 345 | ఆదివారం | 16-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను రాహుల్ గాంధీకి సిఎం పరిచయం చేశారు. రాహుల్‌ను కలిసిన వారిలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి ఉన్నారు.

## రేపు కేబినేట్ భేటీ

### స్థానిక సంస్థలు, బిసి కోటాపై చర్చ?

ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాల సూచనలు, తదితర న్యాయపరమైన చిక్కులను కూడా సమీక్షించనుంది. స్థానిక ఎన్నికలపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే గిగ్ వర్కర్లకు సంబంధించిన బిల్లు, నీటి పారుదల ప్రాజెక్ట్ పనులు, వాటికి సంబంధించిన నిధులు, ఇందిరమ్మ ఇండ్లు, కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపైన కూడా మంత్రివర్గంలో చర్చించనున్నారు.






గద్వాల్‌లో పల్లా వెంకటరెడ్డి, జోడేఘాట్‌లో కూనంనేని సాంబశివరావు ప్రచార జాతాలను ప్రారంభించిన దృశ్యాలు

## సిపిఐ శతాబ్ది ఉత్సవ జాతాలు షురూ



బాసరలో ప్రచార జాతా ప్రారంభించిన దృశ్యం

సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని జోడేఘాట్, బాసర, గద్వాల్ నుంచి శనివారం ప్రచార జాతాలు ప్రారంభమయ్యాయి. ఈ జాతాలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే ముగింపు సభలో విరివిగా పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గద్వాల్‌లో జాతాను సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, జోడేఘాట్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బాసరలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ జెండా ఊపి ప్రారంభించారు. కాగా గద్వాల్ జాతాలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్ నర్సింహ్మా, జోడేఘాట్‌లో సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, కలవేణ శంకర్, బాసరలో మాజీ రాజ్యసభ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర నాయకుడు కంజర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజల హక్కుల పరిరక్షణలో సిపిఐదే కీలక పాత్ర 03

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ


## పోరాటంతోనే పాలకుల అరాచకాలు తిప్పికొట్టడం సాధ్యం

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి**

ప్రజాపక్షం/ గద్వాల

కమ్యూనిస్టు పార్టీల పోరాటంతోనే రాష్ట్రంలో, కేంద్రంలో పాలకుల అరాచకాన్ని తిప్పికొట్టడం సాధ్యమవుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ వందేళ్ల సందర్భంగా నిర్వహించే రాష్ట్ర బస్సు జాతాను గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం పల్లా వెంకట్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో సిపిఐ బహిరంగ సభను సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్ నర్సింహ్మా ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిచారు. గద్వాల పోరాటాల నడిగడ్డ అని, వీరయోధులను కన్న గడ్డ అని, అందుకే ఇక్కడ నుంచి బస్సు జాతాను ప్రారంభించామన్నారు. ప్రతి ఒక్కరూ సిపిఐ జెండా పట్టి నడిగడ్డ సమస్యల పైన పోరాడాలని పిలుపునిచ్చారు. వందేళ్ళలో దేశంలోని పేద ప్రజలు, కార్మికులు, రైతులు, ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన ఘనత సిపిఐదేన్నారు. దేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తలను చేసిందని, తెలంగాణ నైజాం విముక్తికి పోరాడి రాచరిక పాలన నుంచి విముక్తి చేసిందన్నారు. నేటికీ ప్రజా సమస్యల కోసం అనేక పోరాటాలు చేస్తుందని చెప్పారు. నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదారులతో చేతులు కలిపి మన దేశ భవిష్యత్తును అంధకారంలోకి తరువాయి 12లో





ప్రజల ఆశాజ్యోతి సిపిఐ

కీ.శే. కామ్రేడ్ నల్లమల గిరిప్రసాద్

ప్రత్యేక వ్యాసం 6వ పేజీలో


## కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

ప్రజాపక్షం / కేరిమేరి

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా శనివారం జోడేఘాట్ నుండి ప్రచార జాతాను కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ముందుగా కొమురం భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మ్యూజియంలో ఆయన కొమురం భీం అనుచరుల ప్రతిమలు, ఆదివాసి గిరిజనులు ఉపయోగించే సాంప్రదాయ పనిముట్లు, అభరణాలు, వ్యవసాయ పనిముట్లను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తున్నదని, ముఖ్యంగా పేదలు, నిరుపేదల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నదని అన్నారు. ఎర్రజెండా పోరాటాలతో పేదలకు భూములు దక్కుతాయని, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కమ్యూనిస్టు భావజాలంతోనే కొమురం భీం పోరాటం కొనసాగించారని తెలిపారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని, వామపక్ష ప్రజాతంత్ర పురోగామి శక్తులు కమ్యూనిస్టుల ఐక్యతను కోరుకుంటున్నాయని తరువాయి 12లో

## ‘ఏరో, డిఫెన్స్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- 2030 నాటికి దేశ ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ
- ‘ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్’లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణను 2030 నాటికి దేశ ‘ఏరో ఇంజిన్ రాజధాని‘గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో ‘ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్’ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కాంప్రెహెన్సివ్ రోడ్డు మ్యాప్‌ను రూపొందిస్తున్నామన్నారు. ‘ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం’ కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్‌గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్‌బి, ముంజాల్ ఇన్సిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో నిర్వహించిన ‘ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్: ఇండియాస్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్’కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం(కీ నోట్ అడ్రస్) చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఏఅండ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా ‘భారత్’ లాంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి తరువాయి 12లో

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు

- లెక్కల్లో చూపని రూ.2,51,990లు స్వాధీనం
- 289 అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సీజ్
- 79 మంది అనధికార వ్యక్తుల గుర్తింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి దాడులు జరిపింది. గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల, పెదపల్లి, భూపాలపల్లి, వైరాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తనిఖీలో, లెక్కల్లో చూపని రూ. 2,51,990 నగదును కార్యాలయాల నుండి స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 289 అక్రమ తరువాయి 2లో

## అమెరికాలో వెల్లువెత్తిన ప్రజావ్యతిరేకత దిగొచ్చిన ట్రంప్

- ఆహార వస్తువులపై సుంకాల తగ్గింపు
- ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడి సంతకం

**వాషింగ్టన్:** ప్రజా వ్యతిరేకత తట్టుకోలేక అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిగి వచ్చారు. కాఫీ, టమోటా, గొడ్డు మాంసం, సీజనల్ ఫ్రూట్స్ సహా అనేక ఆహార వస్తువులపై సుంకాలలో కోత విధించారు. టీ, పండ్ల రసాలు, కోకో, సుంగంధాలు, అరటి పళ్ళు, బత్తాయిలు సహా కొన్ని ఎరువులపై కూడా టారిఫ్‌లను తొలగిస్తూ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. రిటైలర్లు, ఉత్పత్తిదారులకు ప్రాతినిధ్యం వహించే ఆహార పరిశ్రమ సంఘం టారిఫ్‌ల ఉపశమన తరువాయి 12లో

## నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు



- 9 మంది మృతి, 32 మందికి గాయాలు
- ‘వైట్-కాలర్’ టెర్రర్ మాడ్యూల్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నమూనాలను సేకరిస్తుండగా ఘటన
- ఉగ్రదాడి కాదని డిజిపి ప్రకటన



**శ్రీనగర్ /న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా, 32 మంది గాయపడ్డారు. పేలుడు వెనుక ఉగ్ర కుట్ర ఉందంటూ వస్తున్న ప్రచారాలను జమ్ముకశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ త్రోసిపుచ్చారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటననేనని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి 11:20 గంటల ప్రాంతంలో ప్రత్యేక బృందం ‘వైట్‌కాలర్’ టెర్రర్ మాడ్యూల్ దర్యాప్తుకు సంబంధించి స్వాధీనం చేసుకున్న భారీ, అస్థిర పేలుడు పదార్థాల నిల్వల నుండి నమూనాలను తీస్తున్నప్పుడు పేలుడు సంభవించింది. ఘటనపై శ్రీగర్, ఢిల్లీలో మీడియా వస్తున్న కథనాలను జమ్ముకశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ , హోంమంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ఉగ్రవాద దాడి ఊహాగానాలను తోసిపుచ్చారు. ఈ ఘటన దురదృష్టకర ప్రమాదం అని పేర్కొన్నారు. పేలుడులో ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) బృందంలోని ముగ్గురు సిబ్బంది, ఇద్దరు క్రైమ్ ఫోటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు (మేజిస్ట్రేట్ బృందంలో భాగం), రాష్ట్ర దర్యాప్తు సంస్థకు చెందిన తరువాయి 2లో

## పెన్షనర్ల ఆందోళన బాట

- 20 నెలలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛన్లు రాకపోవడంతో తీవ్ర నిరసన
- రేపు ఇందిరా పార్కు వద్ద మహా ధర్నా

ప్రజాపక్షం/ ఖమ్మం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై పెన్షనర్ల పోరాట ప్రక్రియ వివిధ దశలు దాటి మహా ధర్నాకు చేరుకుంది. 20 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ బకాయిలు రాకపోవడంతో ఇప్పటికే వివిధ రూపాలలో పెన్షనర్ సంఘాలు ఆందోళన నిర్వహించాయి. వినతి పత్రాలు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక వినతులు, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. అయినా ఫలితం రాకపోవడంతో అనేక మంది పెన్షనర్లు దిగులుతో అనారోగ్యం పాలవుతుండటం ఇప్పటికే కొందరు ప్రాణాలు కోల్పోవడం ఉద్యోగ విరమణ అనంతరం తాము అనుకున్న ప్రణాళికలకు సంబంధించి అమలు చేయలేకపోవడంతో ఆవేదనతో మరి కొంత మంది ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసినా, చర్చలు జరపడం సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛన్ బకాయిలు విడుదల కాలేదు. దాదాపు 30 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా విభిన్న రంగాల్లో సేవలు అందించిన వారికి ఉద్యోగ విరమణ అనంతరం పింఛన్ రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది వేల మంది ఉద్యోగులు పింఛన్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు పింఛన్ బకాయిలు రాకపోవడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లయింది. ఉద్యోగ విరమణ తర్వాత పిల్లల పెళ్లిళ్లు, స్థిర నివాసాల ఏర్పాటుతో తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## బిబిసిపై 500 కోట్ల డాలర్లు పరువునష్టం దావా

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌బిబిసిపై పరువునష్టందావా వేసేందుకు సిద్ధమయ్యారు. తన ప్రసంగాన్ని ఎడిట్ చేసి పరువునష్టం కలిగించినందుకు బిబిసిపై 500 కోట్ల డాలర్లు (ఐదు బిలియన్ డాలర్లు) మేరకు వచ్చేవారం నాటికి దావా వేస్తానని చెప్పారు.100కోట్ల డాలర్లు పరిహారం చెల్లించాలని ట్రంప్ న్యాయబృందం తొలుత బిబిసిని లిఖితపూర్వకంగా కోరింది.అందుకు సంస్థ నిరాకరించడంతో ట్రంప్ దిగ్భ్రాంతి కలిగించేలా నిర్ణయం తీసుకున్నారు. వాషింగ్టన్‌లోని యు.ఎస్ క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ అనుచరులు వందలమంది దాదాపు ఐదేళ్ళక్రితందాడి చేశారు. దాడికి ముందుగా 2021 జనవరి 6న ఆనాటికి అధ్యక్ష పదవిలో ఉన్న ట్రంప్ తన అనుచరులను, అభిమానులు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, శాంతియుతంగా నిరసన తెలియజేయాలని కోరారు. ఈ భాగాన్ని ప్రసంగం నుండి బిబిసి తొలగించిందన్నదిప్రధాన అభియోగం. బిబిసి డైరెక్టర్ జనరల్ టిమ్, వార్తల విభాగం అధిపతి ,న్యూస్ సిఇఓ డెబోరాటర్నెస్‌లుట్రంప్‌ప్రసంగాన్ని ఎడిట్‌చేశారు. దశాబ్దాలుగా వీరిద్దరూ సంస్థలో పనిచేస్తున్నారు.

# దక్షిణ అమెరికాలో మరో గాజాను సృష్టిస్తారా?

## అంతులేని యుద్ధాలను ఆపాలని అమెరికన్లకు మదురో పిలుపు





**కారకస్:**దక్షిణ అమెరికాలో మరోగాజాను సృష్టించాలని కోరుకుంటున్నారా? అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురో నిలదీశారు. వెనిజులా సరిహద్దుల్లో కరీబియన్ సముద్రంలో "ఆపరేషన్ సదరన్ స్పియర్" పేరుతో సైనికచర్యలకు సన్నద్ధమై, యుద్ధ వాతావరణం కల్పించి, కయ్యానికి కాలుదువ్వేందుకు ట్రంప్ సిద్ధపడ్డారు. దీంతో శనివారం ఉదయం నికొలస్ మదురో దేశరాజధాని కారకస్‌లో మీడియాతో మాట్లాడుతూ, దక్షిణ అమెరికాను మరో వియత్నాంలా తయారు చేయాలనుకుంటున్నారా? అధి సాధ్యపడదు అన్నారు. "వాస్తవానికి ట్రంప్ మాదక ద్రవ్యాలపేరుతో వెనిజులాలో కమ్యూనిస్టుల అధికారాన్ని కుప్పకూల్చి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నారని విమర్శించారు. వి రామం లేని మరో యుద్ధానికి ట్రంప్ సన్నద్ధం అవుతున్నారన్నారు. ఇక ఇలాంటి అంతం లేని యుద్ధాలకు వ్యతిరేకంగా అమెరికన్లు ఐక్యం కావాలని పిలుపు ఇచ్చారు. "మన అమెరికా ఖండాన్ని విషాదంలో ముంచేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో అమెరికా ప్రజలు వీరోచిత పాత్ర పోషించాలి" అని మదురో కోరారు. వెనిజులాలో కమ్యూనిస్టు నేత హ్యూగో ఛావెజ్ 1999నుండి2013లో మరణించేవరకూ దేశాధ్యక్షుడుగా కొనసాగారు. ఆయన హయాంలో శిక్షణ పొందిన నికొలస్ మదురో 2013 నుండి అధికారంలో కొనసాగుతున్నారు. యుద్ధ వాతావరణం సృష్టించకుండా వెనక్కు మ ళ్ళాలని, శాంతిని పాటించాలనీ కూడా ట్రంప్‌కు మదురో హితవు చెప్పారు. ట్రంప్ శాంతిని వదిలేసి ముందుకే రావాలనుకుంటేతమ దేశాన్ని కాపాడుకునేందుకు సర్వశక్తులనూ ఒడ్డుతామన్నారు. స్థిరత్వాన్ని సాధించి ఉనికిని నిలబెట్టుకుని, తమ సార్వభౌమాధికారాన్ని ఎలా కాపాడుకోవాలోవెనిజులా ప్రజలకు తెలుసునని, ఈ పరిణామాల ద్వారా వారు అన్నీ అర్థం చేసుకున్నారన్నారు. కరీబియన్ ప్రాంతంలో, వెనిజులాలో ఎన్ని ప్రయత్నాలు చేసినా చిట్ట చివరకు శాంతి, అంతర్జాతీయ చట్టాలే గెలుస్తాయన్నారు. ట్రంప్ గడచిన 80 రోజులుగా కరీబియన్ జలాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తున్నారు. అత్యంత శక్తిమంతమైనవిమానవాహకనౌకలను కరీబియన్ జలాలలో ట్రంప్ మోహరించి సైనిక విన్యాసాలకు సన్నద్ధమతువున్న తరుణంలో మదురో తీవ్రస్థాయిలో స్పందించారు. ట్రంప్‌కు అటు హెచ్చరికలతోపాటు విజ్ఞప్తులు, హితవులు కూడా చెప్పారు. "గాజాలో దారుణమైన మారణహోమం జరిగింది,ఆమారణహోమం చూసి మా నవత్వంకృంగికృశించిపోతోంది, ప్రపంచ ప్రజలు ఆవేదన చెందుతున్నా రు, మళ్ళీ దక్షిణ అమెరికాలో కూడా మీరు మరో గాజాను సృష్టించాలనుకుంటున్నారా?" అని ట్రంప్‌ను మదురో ప్రశ్నించారు.

### వెనిజులాపై సైనిక చర్య..
### కానీ ఏం చేస్తానో చెప్పను : ట్రంప్

కరీబియన్ జలాల్లో నావికాదళాన్ని, సైన్యాన్ని మోహరించి సైనిక విన్యాసాలు చేసేందుకు సన్నద్ధమతుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, వెనిజులాపై సైనిక చర్యకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విమానంలో వెళుతూ మీడియాతో మాట్లాడిన సందర్భంగా,"బలమైన చర్యలు తీసుకోవడానికి నిర్ణయం తీసుకుంటున్నారా?" అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు, "వెనిజులాలో సైనిక చర్య తీసుకునే అవకాశం ఉంది,ఐతేనేనుఏం చేస్తానో చెప్పను,చెప్పలేను"అన్నారు. అమెరికాలోకి మాదక ద్రవ్యాలను రాశు లు రాశులుగా రవాణా చేయకుండా ఇప్పటికే చాలా చర్యలు తీసుకుని ఎంతో పురోగతి సాధించామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు అమెరికా తీసుకుంటున్న చర్యలు ఫలితాలు చూపిస్తున్నాయన్నారు. ఐతే ఈ ఫలితాలు పొరుగు దేశాలలో ఉన్న సమస్యలతో తమ సవాళ్ళు ముడిపడి ఉన్నాయన్నారు. "ఈ విషయంలో మాకు మెక్సికోతో సమస్య ఉంది, కొలంబియాతో సమస్య ఉంది, కానీ మేం బాగా పనిచేస్తున్నాం, అమెరికాలోకి మాదక ద్రవ్యాల రవాణా బాగా తగ్గుముఖం పట్టింది" అన్నారు. ఐతే మదురో కూడా మొదటినుండీ ఇదే విషయం చెబుతూ వస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ ముఠాలను అణచివేశామని, చాలా వరకూ వారి కార్యకలాపాలను నియంత్రించామని మదు రో చెబుతున్నప్పటికీ ట్రంప్ కరీబియన్ జలాల్లో అక్రమంగా వెనిజులా పడవలపై దాడులు చేస్తూ అనేకమందిని గడచిన రెండున్నెలలుగాచంపుతున్నారు. పెంటగాన్‌లోని సైనిక కేంద్రం ఆధ్వర్యంలో ఈ దాడులు జరుగుతున్నాయి. గడచిన రెండునెలలుపైగాట్రంప్ కరీబియన్ జలాల్లో లాటిన్ అమెరికా దేశాలపై అణచివేత చర్యలకు పూనుకున్నారు. దాదాపు 21పైగా పడవలపై అమెరికా సైనికులు ప్రాణాంతకమైన దాడులు చేశారు. అనేకమంది దాడుల్లో మరణించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వెనిజులా కూడా సైన్యాన్ని సిద్ధం చేసింది. అటు కొలంబియా అధ్యక్షుడి కుటుంబంపైనకూడానిషేధంవిధించారు.కమ్యూనిస్టు ప్రభుత్వాలనుఅణచివేసేదృష్టితోఆయనహయాంలో మాదక ద్రవ్యాలా రవాణా ఉద్ధృతంగా జరుగుతోందంటూ ట్రంప్ ఆరోపణలు చేశారు.

## దాడులతో ఉక్రేన్ అతలాకుతలం

### కాల్పుల విరమణకు ఐక్యరాజ్యసమితి పిలుపు

**కీవ్:**రష్యా చేస్తున్న దాడులతో ఉక్రేన్ దేశం అతలాకుతలం అవుతోంది.శీతాకాలంలో భారీగా మంచు పేరకుపోయి గడ్డకట్టేపరిస్థితులు సమీపించడంతో రష్యా తన దాడులను మరింత ఉద్ధృతం చేసింది. తాజా దాడుల్లో ఎనిమిది మంది పౌరులు మరణించారు. ఒక్క కీవ్ నగరంలోనే ఆరుగురు మరణించారు. అనేక నివాసిత ప్రాంతాలు, ఇంధన వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. అనేకమంది గాయపడ్డారు. దీంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంథోనీ గుటెరెస్ దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ఎక్కడ జరిగినా సమ్మతింపసాధ్యం కాదన్నారు. తక్షణం బేషరతుగా పూర్తిస్థాయి కాల్పుల విరమణ పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉక్రేన్‌లోని అనేక ప్రాంతాలలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. యుద్ధం మొదలైన తర్వాత తొలుత దాడిని వ్యతిరేకిస్తూ యూరోపియన్ యూనియన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2022 మార్చి రెండో తేదీన భారీ మెజారిటీతో ఆమోదించింది. గడచిన కొద్ది రోజులుగా రష్యాను రెచ్చగొట్టే రీతిలో ఆంక్షలు విధించడంతోపాటు ఉక్రేన్‌కు భారీ ఎత్తున ఆర్థిక సహాయం ప్రకటిస్తూ యూరప్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూ ఉండగలో ఉక్రేన్‌పై విరామం లేకుండావందల డ్రోన్లతో రష్యా దాడులు కొనసాగిస్తున్నది.తాజాగా శనివారం తెల్లారకముందే చేసిన దాడుల్లో ఉక్రేన్‌కు అపారనష్టం వాటిల్లింది. మరో ఆరుగురు పౌరులు మరణించారు. ఉక్రేన్ ఇంధన వనరులకు నష్టం వాటిల్లింది. 430 డ్రోన్లు, 18 క్షిపణులతో రష్యా దాడి చేసిందని, ఇప్పటివరకూ రష్యా చేసిన అతిపెద్ద దాడి ఇదేనని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు. జెపోరిఝియా రీజినల్ గవర్నర్ ఇవాన్ ఫెడోరోవ్ మాట్లాడుతూ, 20 నివాసిత ప్రాంతాలపై 731 దాడులు జరిగాయని, నలుగురు పౌరులు మరణించారని చెప్పారు. మరోవైపు రష్యా కూడా ఒక ప్రకటన చేస్తూ అనేక రష్యా ప్రాంతాలపై ఉక్రేన్ ప్రయోగించిన 216 డ్రోన్లను కూల్చివేశామని, మరికొన్ని డ్రోన్లను నల్లసముద్రంలో కూల్చివేసినట్లు పేర్కొంది. అదేవిధంగా రెండు రోజుల క్రితం ఉక్రేన్‌కు నాలుగువైపులా జరిగిన పోరాటంలో ఒక్కరోజులో 1,150 మంది సైనికులను ఆ దేశం కోల్పోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఉక్రేన్ శత్రువుకు సంబంధించిన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ స్టేషన్‌ను ధ్వంసం చేశామని తెలిపింది.ఇదిలా ఉండగా శీతాకాలం సమీపిస్తూ ఉండటంతో ధ్వంసమైన ఇంధన మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికపై మరమ్మతులు చేసే పనులను ఉక్రేన్ ప్రారంభించింది.

## క్లింటన్ సహా ప్రముఖ డెమోక్రాట్లతో
## జెఫ్రీ ఎప్సీన్స్ సంబంధాలపై న్యాయశాఖ దర్యాప్తు

**వాషింగ్టన్:**మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ సహా పలువురు ప్రముఖ డెమోక్రాట్లతో, ప్రధాన బ్యాంకులతో లైంగిక కార్యకలాపాల నేరస్థుడు, పెడోఫైల్‌ఫైనాన్సియర్‌జెఫ్రీఎప్సీన్(1953–2019)కు ఉన్న సంబంధాలపై దర్యాప్తుకు ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. "ఎప్సీన్‌ఒక డెమోక్రాట్, అందువల్ల ఇది డెమోక్రాట్స్‌సమస్య, రిపబ్లికన్ల సమస్య కాదు" అన్నారు. క్లింటన్‌తోపాటుమాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్, లింక్డ్‌ఇన్‌వ్యవస్థాపకుడురీడ్‌హాఫ్మన్,జె.పి. మోర్గాన్, ఛేజ్ బ్యాంకులు సహాఅనేకమంది వ్యక్తులు, సంస్థలతో ఎప్సీన్‌కు ఉన్న సంబంధాలను బహిర్గతం చేయాలని అటార్నీ జనరల్ పామ్ బాంని, ఎఫ్‌బిఐని ట్రంప్‌కోరారు.తన సోషల్ మీడియా కంపెనీ ట్రూత్‌సోషల్‌వేదికగాశనివారం పోస్టింగ్ పెట్టారు. అమెరికా న్యాయశాఖ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది.పామ్‌బాండీ స్పందిస్తూ, దర్యాప్తు ప్రారంభించాల్సిందిగా న్యాయవాది జె. క్లాటన్‌ను ఆదేశించినట్లు మరో పోస్టింగ్‌లో పేర్కొన్నారు. డెమోక్రాట్లు తమ వైఫల్యాలను, ఎప్సీన్ మోసాన్ని కప్పిపుచ్చుకోవడంకోసం తనపై ఆరోపణలను మళ్ళీ ముందుకు తెస్తున్నారని విమర్శించారు.ఈవారారంభంలో షట్‌డౌన్ ముగిసిపోయిందని, డెమోక్రాట్లు పొడిగించేందుకు ప్రయత్నం చేసి విఫలం కావడంతో ఇప్పుడు తిరిగి జెఫ్రీ ఎప్సీన్ పేరుతో తనపై ఆరోపణలను ముందుకు తెస్తున్నారని విమర్శించారు.ట్రంప్‌ఎన్నికలోరష్యాజోక్యం ఉందంటూ గతంలో వచ్చిన విమర్శలను గుర్తుచేస్తూ, ఈ అధికారులు, వ్యక్తులు ఎక్కువకాలం ఎప్సీన్‌తోనే గడిపారని రికార్డులు రుజువు చేస్తున్నాయన్నారు. ఎప్సీన్ చేసిన నేరాలన్నీ ట్రంప్‌కు తెలుసునని, ఇ–మెయిల్స్‌లో ఆయన పేరు కూడా ఉం దని డెమోక్రాట్లుతప్పుపట్టారు. జెఫ్రీ ఎప్సీన్ ఎస్టేట్ నుండి దాదాపు 20,000పేజీలను, ఇ–మెయిల్స్ ను డెమోక్రాట్ల ఒత్తిడితో అమెరికా ఓవర్‌సైట్ కమిటీ విడుదల చేసింది. వీటిల్లోని 16 00 పత్రాలు లేదా 2,324 ఇ–మెయిల్ థ్రెడ్స్‌లో ట్రంప్ పేరు ఉందని 'వాల్‌స్ట్రీట్‌జర్నల్' వివరించింది.ఎ ప్సీన్‌కార్యకలాపాలన్నీట్రంప్‌కుతెలుసుననిడెమోక్రాట్లు విమర్శలు చేయడంతోట్రంప్ శనివారం ఎదురుదాడి చేశారు.



న్యూఢిల్లీలో శనివారం సిఎం రేవంత్‌రెడ్డిని విన్ గ్రూప్ ఆసియా సిఇఒ ఫామ్ సాన్ చౌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఫ్యూచర్ సిటీలో ప్రధాన పెట్టుబడులపై వారిద్దరు చర్చించారు. రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను స్థాపించడానికి ఫామ్ సాన్ చౌ ఆసక్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) తయారీ యూనిట్లు, బ్యాటరీ నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే విన్‌గ్రూప్ యొక్క ఆసక్తిని ఫామ్ సాన్ చౌ సిఎంకు తెలియజేశారు.

## పెన్షనర్ల ఆందోళన బాట

(మొదటి పేజీ తరువాయి)

పాటు చాలా మంది ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దాదాపుగా రూ.15వేల కోట్లు బకాయిలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61కు పెంచింది. దీనితో 2024 మార్చి నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రిటైర య్యారు. వీటితో పాటు ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత చికిత్స కోసం కూడా పెన్షనర్లు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఈహెచ్‌ఎస్ కార్డులు అమలు కాకపోవడంతో సరైన వైద్యం సరైన సమయంలో పొందలేకపోతున్నామన్న ఆవేదన పెన్షనర్లలో వ్యక్తమవుతుంది. పెన్షనర్ల బెనిఫిట్స్ విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్న ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం లేని పరిస్థితి. మేము దాచుకున్న డబ్బులు కూడా మాకు ఇవ్వరా అంటూ పెన్షనర్లు ప్రశ్నిస్తున్నారు. పెన్షనర్లకు సంబంధించి జిపిఎఫ్ పొదుపుకు సర్వీసులో ఉన్నప్పుడు మాత్రమే వడ్డీ వర్తిస్తుంది. ఉద్యోగ విరమణ చేసి 20 మాసాలు కావస్తున్నా బెనిఫిట్స్ అందకపోవడంతో వడ్డీ కోల్పోతున్నామన్న ఆవేదన కూడా మరో పక్క వ్యక్తమవుతుంది. ముఖ్యంగా ఖజానా ఖాళీ మేము ఏమి చేయలేమన్న ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ నవంబర్ 17న ఇందిరా పార్కులో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చారు. అన్ని జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు మహా ధర్నాకు హాజరు కానున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల బకాయిలను విడుదల చేయడంతో పాటు హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

**అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాం : లక్ష్మి సుజాత**

41 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా సేవలందించాను. ప్రధానోపాధ్యాయురాలిగా 2024 సెప్టెంబర్‌లో ఉద్యోగ విరమణ పొందాను. నా చేతిలో రూపాయి లేదు. నేను నిర్వర్తించాల్సిన బాధ్యతలు చాలా ఉన్నాయి. పింఛన్ బకాయిలతో కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకుందామనుకున్నాం. 14 మాసాలు గడిచినా రూపాయి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పెన్షనర్ల బకాయిలను చెల్లించాలని కోరుతున్నాను.

**ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదు : మేరీ ఏసుపాదం**

పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం తెలిపారు. తాను 34 ఏళ్ల పాటు విద్యా రంగంలో వివిధ హోదాలలో సేవలందించానని పలుమార్లు ఉత్తమ అవార్డులు అందుకున్నానని కానీ ఉద్యోగ విరమణ అనంతరం పెన్ష న్ బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ బకాయిలు రాక పింఛన్‌దారుల కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింపజేసే రీతిలో పెన్షనర్లు ఆందోళనకు సిద్ధం కావాలని ఆమె తెలిపారు.

**ధర్నాను జయప్రదం చేయండి : పరిశ పుల్లయ్య**

రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం (ఎస్‌జిపిఏటి) ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు. 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. అనేక ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వారి పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరైనది కాదని పెన్షనర్ల ఇబ్బందులను చూసైనా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఆందోళనలతోనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందని పుల్లయ్య కోరారు.

## 'ఐ బొమ్మ' రవి అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పైరసీ సినిమాలను విచ్చలవిడిగా తన వెబ్‌సైట్‌లో పెడుతూ సినీ పరిశ్రమను అతలాకుతలం చేసి పోలీసులకే సవాలు విసిరి సంచలనం రేపిన 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం ఎట్టకేలకు అరెస్టు చేశారు. నిందితుడు రవిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించింది. దీంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. విదేశాల్లో ఉంటూ కొత్త సినిమాలను పైరసీ చేసి తన వెబ్‌సైట్‌లో బహిరంగంగా అందరికి చూపిస్తు సినీ రంగాన్ని ఆర్థికంగా దివాలా తీయిస్తున్న రవిపై సినీ నిర్మాతలు గతంలో అనేక ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకున్న సైబరాబాద్, హైదరాబాద్ పోలీసులు అతని కోసం ఆరా తీశారు. 2019 నుండి ఐ బొమ్మ వెబ్‌సైట్‌కు పైరసీ చేసి వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. ఆరు సంవత్సరాల కాలంలో వేలాది పైరసీ సినిమాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. థియేటర్లో విడుదలైన సినిమాలను గంటల వ్యవధిలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో సినీ పరిశ్రమ నిర్మాతలు తలలు పట్టుకున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్‌కి వేలాది కోట్లు సినీ నిర్మాతలకు నష్టం కలిగింది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు ఐ బొమ్మతోపాటు, 65 పైరసీ వెబ్‌సైట్‌లపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఈ కేసులో గతంలో ఐదుగురు కీలక నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎట్టకేలకు రవిని అరెస్టు చేయడంతో పాటు పోలీసులు రవి ఏజెంట్ల నెట్వర్క్ తో పాటు హ్యాండ్లర్ల నెట్‌వర్క్‌పై కూపీ లాగుతున్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్‌లోని ఏ కార్యకర్తకు ఏం జరిగినా, కంటికి రెప్పలాగా కాపాడుకునే బాధ్యత తనదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు భరోసానిచ్చారు. రెహమత్‌నగర్ డివిజన్‌లోని బిఆర్‌ఎస్ కార్యకర్త రాకేష్ క్రిస్టోఫర్ నివాసానికి వెళ్లిఆయనను కెటిఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన 24 గంటలు కాకముందే కాంగ్రెస్ పార్టీ గూండాయిజానికి, రౌడీయిజానికి పాల్పడుతోందని ఆరోపించారు.'పదేళ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నారని, తాము ఎప్పుడైనా తమ కార్యకర్తలు హద్దులు దాటి ప్రవర్తించారా? అని ప్రశ్నించారు. ఒక ఉప ఎన్నికల్లో గెలిచిన వెంటనే, తమ పార్టీ గుర్తు అయిన కారును ఊరేగింపు తీస్తూ, అవహేళనగా చిల్లరగా ప్రవర్తించారని మండిపడ్డారు. పరామర్శించిన వారిలో బిఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మాగంటి సునీత, ఎంఎల్‌ఏలు కౌశిక్ రెడ్డి, కృష్ణారావు తదితరులు ఉన్నారు.

## 20 నుంచి 'ఇండియన్ ఫోటో ఫెస్టివల్ '

**ప్రజాపక్షం/హైదరాబాద్:**భారతదేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ ఫోటో ఫెస్టివల్ (ఐపిఎఫ్) 11వ ఎడిషన్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. ఈ ఐపిఎఫ్ ఫెస్టివల్ ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగనున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఫోటో జర్నలిజం నుండి లలిత కళ వరకు, డాక్యుమెంటరీ నుండి ల్యాండ్‌స్కేప్ వరకు కేవలం ఒక్క భారతదేశం నుండే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అద్భుత ఫోటో, డాక్యుమెంటరీ, దృశ్యాలను ఈ ఇండియన్ ఫోటో ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఐపిఎఫ్ ఎడిషన్‌లో సోలో ఎగ్జిబిషన్‌లు, గ్రూప్ షోకేస్‌లు, ఆర్టిస్ట్ టాక్స్, వర్క్‌షాప్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ స్క్రీనింగ్‌లు ఉంటాయని, ఫోటో ఫెస్టివల్ ఎడిషన్ కోసం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుండి 820 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిని నిష్ణాతులైన జ్యూరీ సభ్యులు ఫైనలిస్టులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జెన్నిఫర్ ఆల్ఫోన్స్ దర్శకత్వం వహించిన నాగోబా జాతరతో పాటు అనేక అంశాలపై డాక్యుమెంటరీలు ప్రదర్శన ఉంటుందని, ఇండియన్ ఫోటో ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు వెబ్ సైట్ www.indian photo fest.comను సందర్శించాలని జయేష్ రంజన్ పేర్కొన్నారు.

## ఎసిబి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ పత్రాలను సీజ్ చేశారు. ఈ కార్యాలయాల్లో దాదాపు 19 మంది ప్రైవేట్ వ్యక్తులతో పాటు 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కూడా ఎటువంటి అనుమతి లేకుండా ఎస్‌ఆర్‌ఒ కార్యాలయాల్లో రిజిస్టర్ పత్రాలు తరలిస్తున్నట్లు గుర్తించారు. కార్యాలయాల్లో సిసిటివి కెమెరాలు పనిచేయడం లేదు. సంబంధిత అధికారులపై ఎసిబి అధికారులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. కార్యాలయాలతో పాటు సబ్‌రిజిస్ట్రార్ అధికారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించి వారి ఇండ్ల నుండి నగదు, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి రమేశ్ ఆధ్వర్యంలో సిఐ శేఖర్ డాక్యుమెంట్ రైటర్ల గదులను పరిశీలించి పలువురి సెల్‌ఫోన్లను, అనుమానాస్పద నగదును స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కరీంనగర్ ఎసిబి డిఎస్‌పి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు, రికార్డులను పరిశీలించారు. డాక్యుమెంట్ రైటర్లను సైతం విచారించారు. వనపర్తిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు సోదాలు చేశారు. జడ్చర్లలో వనపర్తి సబ్‌రిజిస్ట్రార్ చంద్రశేఖర్ ఇంట్లో సిఐ జిలానీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రెండుచోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి జగదీశ్‌చంద్ర ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ బలరాంయాదవ్ ఇంట్లో నూ సోదాలు నిర్వహించారు. రికార్డులు, దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. అనధికారిక అసిస్టెంట్ వద్ద గల రూ.60,160 నగదును సీజ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోని రంజోల్ గ్రామ సమీపంలో సబ్ రిజిస్టార్ కార్యాలయంపై మెదక్ జిల్లా డిఎస్‌పి సుదర్శన్ ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆఫీసులోని 10 మంది డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.42,300లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి శేఖర్‌గౌడ్ అధ్వర్యంలోని అధికారులు గేట్లు మూసివేసి తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ల దస్త్రాలు పరిశీలించారు. కాంప్లెక్స్‌లోని డాక్యుమెంట్ రైటర్స్ తమ షాపులకు తాళాలు వేసి పరుగులు పెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఎస్‌పి సాంబయ్య ఆధ్వర్యంలో సిఐలు ఎస్ రాజు, ఎల్ రాజు, సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లు ఆఫీస్‌లోనే తిష్ట వేయడాన్ని గుర్తించారు. 42 డాక్యుమెంట్లను దస్తావేజు రైటర్లు సంతకం లేకుండానే నేరుగా తీసుకున్నట్టు తెలిపారు.

## భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ఒక అధికారి, బృందంతో సంబంధం ఉన్న ఒక దర్జీ దురదృష్టకర పేలుడులో మరణించారని ప్రభాత్ చెప్పారు. 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ప్రక్కనే ఉన్న ప్రాంతాల నుండి వచ్చిన ముగ్గురు పౌరులు గాయపడ్డారని, వారిని వెంటనే చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించామని ఆయన అన్నారు. ఎఫ్‌ఎస్‌ఎల్ బృందాలు స్వాధీనం చేసుకున్న భారీ పేలుడు పదార్థాల నుండి ఫోరెన్సిక్, రసాయన పరీక్షల కోసం నమూనాలను తీసుకునే నిర్దేశిత విధానాన్ని నిర్వహిస్తున్నప్పుడు పేలుడు సంభవించిందని ప్రభాత్, లోఖండే స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలు అస్థిరంగా, సున్నితమైన స్వభావం కలిగి ఉన్నందున ఎఫ్‌ఎస్‌ఎల్ బృంద అత్యంత జాగ్రత్తగా నామూనా సేకరిస్తుందని ప్రభాత్ చెప్పారు. అయితే, దురదృష్టవశాత్తు శుక్రవారం రాత్రి 11.20 గంటల ప్రాంతంలో సంభవించిందన్నారు. సున్నితమైన స్వభావం కారణంగా నమూనా ప్రక్రియ రెండు రోజులుగా కొనసాగుతోందని ఆయన అన్నారు. భారీ పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనం తీవ్రంగా దెబ్బతిన్నదని, పక్కనే ఉన్న నిర్మాణాలపై కూడా ప్రభావం పడిందన్నారు. చిన్న చిన్న పేలుళ్లు మొదట్లో సహాయక చర్యలకు ఆటంకం కలిగించాయి.

**దర్యాప్తునకు ఆదేశించాం : ఎల్‌జి**

ఘటనపై జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందిస్తూ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై దర్యాప్తుకు ఆదేశించామన్నారు. ప్రమాదవశాత్తు పేలుడుకు కారణాన్ని నిర్ధారించడానికి దర్యాప్తుకు ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు. నమూనాగా సేకరించిన పదార్థాలలో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి దాదాపు 360 కిలోల పేలుడు పదార్థాలు, రసాయనాలు, కారకాలు ఉన్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ నుండి టాటా 407 పికప్ ట్రక్కు లో చిన్న సంచులలో పేలుడు పదార్థాల భారీ నిల్వను తీసుకువచ్చారని ఒక ఉన్నతాధికారి తెలిపారు. కశ్మీర్‌కు పేలుడు పదార్థాలను రవాణా చేయడానికి గల కారణం వివరిస్తూ అసలు కేసు నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైందని, పేలుడు పదార్థాలు ఆ పోలీస్ స్టేషన్ కేసు ఆస్తి అని అధికారి తెలిపారు. అందువల్ల, ఇప్పటివరకు పేలుడు పదార్థాలను రవాణా చేయాల్సిన అవసరం ఉంద ని అధికారి తెలిపారు. పేలుడు పదార్థాలను సేకరించిన 'వైట్‌కాలర్' టెర్రర్ మాడ్యూల్ లక్ష్యాల గురించి ప్రశ్నించగా, దర్యాప్తుదారులు ఇంకా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారని అధికారి తెలిపారు. ఈ నిల్వను జమ్ముకశ్మీర్ పోలీసులు 9, 10 తేదీలలో ఫరీదాబాద్‌లోని అరెస్టయిన నిందితుడు డాక్టర్ ముజ్జామిల్ గనై అద్దెకు తీసుకున్న నివాసం నుండి స్వాధీనం చేసుకున్నారు. 360 కిలోల పేలుడు పదార్థాలలో ఎక్కువ భాగాన్ని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లోని బహిరంగ ప్రదేశంలో సురక్షితంగా నిల్వ చేశారు. అక్టోబర్ మధ్యలో నౌగామ్‌లోని బున్‌పోరాలో గోడలపై పోలీసులు, భద్రతా దళాలను బెదిరించే పోస్టర్లు వెలిసిన తర్వాత దర్యాప్తు ప్రారంభమైంది.

**పలువురు నాయకులు విచారం**

పేలుడు పట్ల జమ్ముకశ్మీర్‌లోని పలువురు రాజకీయ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తుకు ఆదేశించిన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ప్రాణనష్టం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. జమ్ములో ఉదయం జరగాల్సిన భద్రతా సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించాల్సిన సిన్హా, ఈ సంఘటన దృష్ట్యా సమావేశాన్ని రద్దు చేసుకున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్‌లో ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. 'విలువైన ప్రాణాలను బలిగొంది, అనేక మంది సిబ్బందిని గాయపరిచింది. మృతుల కుటుంబాలకు అబ్దుల్లా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తూ. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని' ప్రార్థిస్తున్నా అని అన్నారు. ఈ విషాదం తనను తీవ్రంగా బాధపెట్టిందని మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజాద్ లోన్ ఈ సంఘటనను హృదయ విదారకంగా అభివర్ణించారు. డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డిపిఏపి) అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ కూడా మరణాలకు సంతాపం తెలిపారు.

**కేంద్రం మేల్కోవాలని కాంగ్రెస్ హితవు**

శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి నిఘా, ఉగ్రవాద నిరోధక యంత్రాంగాలను బలోపేతం చేయడానికి ఒక మేల్కొలుపు అని, జవాబుదారీతనం నుండి తప్పించుకోవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బయటి శక్తుల మద్దతు ద్వారా పెరుగుతున్న ఉగ్రముప్పుపై చర్చించడానికి అత్యవసరంగా అఖిలపక్ష సమావేశం ఏర్పా టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేలుడుపై ఆందోళన వ్యక్తం చేశారు. మృతులకు నివాళులు అర్పించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిచారు. పేలుడులో ప్రాణా లు కోల్పోవడం పట్ల ఖర్గే తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారికి తక్షణ వైద్య సహాయం, మృతుల బంధువులకు పరిహారం అందించాలని కోరారు. 'తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులకు తక్షణ వైద్య పర్యవేక్షణతో చికిత్స అందించాలి. బాధితులకు తగిన పరిహారం అందించాలని ఖర్గే పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఉగ్రవాద దాడి తర్వాత కొన్ని రోజులకే ఈ పరిణామాలు వచ్చాయని, కేంద్రప్రభుత్వం నిఘా, ఉగ్రవాద వ్యతిరేక యంత్రాంగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జవాబుదారీగా ఉండలన్నారు. ఉగ్రవాద మహమ్మారికి వ్యతిరేకంగా దేశానికి కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు. ఇటీవల ఎర్రకోట ఉగ్రవాద దాడి దృష్ట్యా, బాహ్య శక్తుల నుండి మద్దతుతో పెరుగుతున్న ఉగ్రవాద ముప్పుపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## మీడియా అకాడమీలో నేడు జాతీయ పత్రికా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ పాల్గొంటున్నారు. ప్రముఖ సంపాదకులు దేవులపల్లి అమర్, అదే విధంగా పుర ప్రముఖులు, వర్కింగ్ జర్నలిస్టులు హాజరవుతారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పనిచేయడం ప్రారంభించిన రోజునే నేషనల్ ప్రెస్ డేగా జరుపుకుంటాము. 1956లో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటును చేస్తూ, జర్నలిజంలో వృత్తిపరమైన నీతిని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గంగా పరిగణించబడింది. ఈ కార్యక్రమానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నందున అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మీడియా అకాడమీ కార్యదర్శి ఒక ప్రకటనలో కోరారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సే) శాఖ
ఫారం-VI
(సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 19- సెక్షన్ 11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)
ప్రాథమిక ప్రకటన

జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: 2279/2025 తేదీ: 13.11.2025
RDO ఫైలు సంఖ్య. సి/1958/2025 తేదీ: 12.11.2025
గెజిట్ సంఖ్య: 59/2025 తేదీ: 13.11.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్-I, సూర్యాపేట, గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు లో ఉన్న భూమిలోని సర్వే నెం. 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255 & 259లో మొత్తం భూమి ఎ.9.34 1/4 గుంటల భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట నిర్మాణము కొరకు, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందేహక్కు చట్టం, 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.
కావున మోతే మండలము బుర్కచర్ల గ్రామ శివారు పరిధిలో ఉన్న సర్వే నెం 114, 122, 128, 129, 131, 132,142, 157, 159, 160, 161, 176, 177, 178, 179, 180, 187, 188, 189, 191, 193, 245, 246, 252, 253, 254, 255& 259 లో మొత్తం భూమి ఎ.9.34 1/4 గుంటల భూమి అన్నారిగూడెం సమీపంలో పాలేరు రిజర్వాయర్ పై నిర్మించే ఇరిగేషన్ పథకం SRSP stage -II యొక్క 22 L, 36L minor of DBM- 71 క్రింద ఆయకట్టు భర్తీ చేయుట. నిర్మాణము కొరకు అవసరమైనదిగా ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము : బుర్కచర్ల మండలం : మోతే జిల్లా : సూర్యాపేట

షెడ్యూల్

| క్ర.సం. | సర్వే నెంబర్ | యాజమాన్యపు రకము | భూమి రకము | సేకరించబడు భూమి విస్తీర్ణం ఎ./గుం. | పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు | సరిహద్దులు | | | | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | |
| 1 | 142 | పట్టా | మెట్ట | 0.01<br>0.02 1/2 | రోడ్డు<br>భూక్యా సురేందర్ తండ్రి దరియాబ్ (ప & అ) | 114 | 114 | గ్రామ సరిహద్దు | 132 | |
| 2 | 122 | పట్టా | మెట్ట | 0.23<br>0.05 | గార్లపాటి సునిత భర్త వెంకటరెడ్డి (ప & అ)<br>బానోతు మంగత్య @ మంగ్యా తండ్రి వెంకటరాం (ప & అ) | 122 | 122 | 128 | 193 | |
| 3 | 128 | పట్టా | మెట్ట | 0.11 1/2 | గార్లపాటి సునీత భర్త వెంకటరెడ్డి (అ)<br>బానోత్ మంగ్యా తండ్రి వెంకట్ రాం (ప)<br>సలికంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (ప)<br>ములుకూరి సురేందర్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప)<br>గార్లపాటి వెంకట రెడ్డి తండ్రి లచ్చిరెడ్డి (ప) | 128 | 128 | 129 | 122 | |
| 4 | 129 | పట్టా | మెట్ట | 0.03 1/2<br>0.13 | ములుకూరి ఉష భర్త సురేందర్ రెడ్డి (అ)<br>సలిగంటి పెంటయ్య తండ్రి వెంకయ్య (అ)<br>ములుకూరి మధుసూదన్ రెడ్డి తండ్రి శ్రీనివాస రెడ్డి (ప) | 129 | 129 | 131 | 128 | |
| 5 | 131 | పట్టా | మెట్ట | 0.01 1/2<br>0.11<br>0.12 1/2<br>0.12 1/2<br>0.07 1/2 | డొంక<br>భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ)<br>భూక్యా మహేందర్ తండ్రి వాల్య (ప& అ)<br>భూక్యా సురేష్ తండ్రి బాలు (ప & అ)<br>భూక్య సక్కుబాయమ్మ @సక్కుబాయి భర్త శ్రీను (ప & అ) | 131 | 131 | 132 | 129 | |
| 6 | 132 | పట్టా | మెట్ట | 0.09 1/2<br>0.02 1/2<br>0.00 1/2<br>0.09 1/2 | ధారవత్ లింగా తండ్రి బాన్య (ప & అ)<br>భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ)<br>భూక్య మహేందర్ తండ్రి వాల్య(ప & అ)<br>ధారవత్ చాంప్లా తండ్రి బాన్య(అ)<br>భూక్య కవిత తండ్రి మహేందర్ (ప)<br>భూక్య స్వామి తండ్రి వుమ్లా (ప)<br>ధరవత్ నగేష్ తండ్రి బిక్షం (ప)<br>భూక్య చిరంజీవి తండ్రి స్వామి (ప)<br>భూక్య లింగా తండ్రి స్వామి (ప)<br>భూక్య రాంజీ తండ్రి స్వామి(ప) | 132 | 132 | 114 | 131 | |
| 7 | 142 | పట్టా | ప్రభుత్వ భూమి | 0.02 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ)<br>నిమ్మరబోయిన మల్లయ్య తండ్రి రాములు (ప)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి రాములు (ప)<br>బానోత్ రఘు తండ్రి లింగా (ప)<br>మేకరబోయిన శివమ్మ భర్తవెంకన్న (ప)<br>నిమ్మరబోయిన సతీష్ తండ్రి కనకయ్య(ప)<br>నిమ్మరబోయిన పిచ్చయ్య తండ్రి ముత్తయ్య (ప)<br>బానోతు రాము తండ్రి లింగా (ప)<br>భూక్య బాలు తండ్రి సూర్య (ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి సత్యం (ప)<br>నిమ్మరబోయినమల్లికాంబ భర్తవెంకన్న (ప)<br>షేక్ ఖాశిం తండ్రి పీరుసాబ్ (ప)<br>జెట్టి లక్ష్మయ్య తండ్రి వీరాస్వామి (ప)<br>షేక్ జానీ బాబు తండ్రి షర్ఫద్దీన్(ప)<br>భూక్య రమేశ్ తండ్రి గోల్య (ప)<br>నిమ్మరబోయిన గురవయ్య తండ్రిరామయ్య (ప)<br>భూక్య పొట్టి తండ్రి శంకర్ (ప)<br>భూక్య మహేందర్ తండ్రి వాల్య(ప)<br>భూక్య హాము తండ్రి సకు రాం (ప)<br>షేక్ యాకూబ్ పాషా తండ్రి మౌలానా (ప)<br>షేక్ షబ్బీర్ తండ్రి మౌలానా(ప)<br>నిమ్మరబోయిన ఉప్పలయ్య తండ్రి లచ్చయ్య (ప)<br>నాగిరెడ్డి కోటమ్మ భర్త నారాయణ రెడ్డి(ప)<br>నాగిరెడ్డి హేమలత భర్త వెంకట రెడ్డి(ప)<br>నిమ్మరబోయిన సీతమ్మ భర్త గురవయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>భూక్యా నాగు తండ్రి ధర్మ (ప)<br>భూక్యా రాంజా తండ్రి గోల్య (ప)<br>గుగులోతు పందు తండ్రి బిచ్చా(ప)<br>నిమ్మరబోయిన లక్ష్మమ్మ భర్త రామయ్య (ప) | 142 | 142 | 159 | కెనాల్ | |
| 8 | 157 | పట్టా | మెట్ట | 0.05<br>0.05<br>0.01 | నిమ్మరబోయిన గంగయ్య తండ్రి యల్లయ్య (ప&అ)<br>నిమ్మరబోయిన బిక్షం తండ్రి వీరయ్య (అ&ప)<br>నిమ్మరబోయిన కరుణాకర్ తండ్రి వెంకన్న (అ &ప) | 157 | 157 | 176 | 161 | |
| 9 | 159 | పట్టా | మెట్ట | 0.11<br>0.02 | చెరుకు భారతమ్మ భర్త రోశయ్య (అ &ప)<br>చెరుకు భారతమ్మతండ్రి రోషయ్య(ప & అ) | 159 | 159 | 160 | 142 | బోరు |
| 10 | 160 | పట్టా | మెట్ట | 0.05 | చెరుకు మల్సూర్ తండ్రిజానయ్య (ప&అ) | 160 | 160 | 161 | 159 | బోరు |
| 11 | 161 | పట్టా | మెట్ట | 0.16 1/2<br>0.07 1/4<br>0.02<br>0.03 1/4 | కొత్తపల్లి నాగలక్ష్మి భర్త వెంకన్న (అ)<br>జెట్టి లింగయ్య తండ్రి నాగయ్య (అ)<br>చెరుకు సైదులు తండ్రి జానయ్య (అ)<br>అర్వ పల్లి చంద్రయ్య తండ్రి కాశయ్య (ప)<br>కొత్తపల్లి వెంకన్న తండ్రి నర్సయ్య (ప)<br>చెరుకు మల్సూర్ తండ్రి జానయ్య(ప)<br>చెరుకు వీరాస్వామి తండ్రి జానయ్య (ప)<br>కొత్తపల్లి రమేశ్ తండ్రి నరసయ్య (ప)<br>నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు (ప)<br>నాంపల్లి లింగమ్మ భర్త శ్రీరాములు(ప & అ) | 157 | 160 | 161 | 161 | బోరు<br>బోరు |
| 12 | 176 | పట్టా | మెట్ట | 0.09 1/4 | కొండ గంగమ్మ భర్త పాపయ్య (అ)<br>నిమ్మరబోయిన వెంకన్న తండ్రి యల్లయ్య(ప)<br>మేకరబోయిన వెంకన్న తండ్రి బిక్షం (ప) | 176 | 176 | 177 | 157 | 5 - జామ చెట్లు |
| 13 | 177 | పట్టా | మెట్ట | 0.03 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ&ప) | 177 | 176 | 180 | 176 | |
| 14 | 178 | పట్టా | మెట్ట | 0.05 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (ప & అ) | 178 | 178 | 179 | 180 | |
| 15 | 179 | పట్టా | మెట్ట | 0.06<br>0.02<br>0.01 1/2<br>0.01 1/2 | కొండ ప్రకాష్ తండ్రి పెద్ద సామేలు (అ)<br>కొండ మాధవి భర్త అనిల్ (అ)<br>బండ<br>భూక్యా నాగు తండ్రి ధర్మ (అ) | 179 | 179 | 187 | 178 | |
| 16 | 180 | పట్టా | మెట్ట | 0.02<br>0.02 1/2<br>0.04 | కొండ ప్రకాష్ తండ్రి పెన్నయ్య (అ)<br>కొండ లింగమ్మ భర్త వీరయ్య (అ)<br>కొండ సాలమ్మ తండ్రి గోపయ్య(అ) | 180 | 180 | 179 | 177 | |
| 17 | 187 | పట్టా | మెట్ట | 0.02 | భూక్య నాగు తండ్రి ధర్మ (అ) | 187 | 179 | 188 | 179 | |
| 18 | 188 | | మెట్ట | 0.02<br>0.12 1/2 | ధారవత్ నాన్కు తండ్రి బాల్య(అ)<br>దర్మాసోత్తు తండ్రి భీముడు (ప)<br>షేక్ యాకూబ్ తండ్రి మౌలానా (ప & అ)<br>షేక్ షబ్బీర్ తండ్రి మౌలానా (ప & అ) | 188 | 188 | 189 | 179 | బోరు |
| 19 | 189 | పట్టా | మెట్ట | 0.07 | భూక్యా మంగత్య @ మంగ్యా తండ్రి కృష్ణ (ప& అ) | 189 | 189 | 191 | 188 | |
| 20 | 191 | పట్టా | మెట్ట | 0.06 | భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (అ)<br>దేకహరాజు లక్ష్మీ వరప్రసాద్ తండ్రి వెంకటేశ్వర రావు (ప)<br>బానోత్ సురేష్ తండ్రి మంగత్య (ప) | 191 | 191 | 193 | 189 | |
| 21 | 193 | పట్టా | మెట్ట | 0.01 1/2<br>0.01 1/2<br>0.05<br>0.00 1/2 | వాగు<br>భూక్యా చాంప్లా తండ్రి ధర్మ (ప & అ)<br>భూక్యా లింగా తండ్రి ధర్మ (ప & అ)<br>రామసాయి నీరజ భర్త బిక్షం రెడ్డి (అ)<br>భూక్య మోతీరం తండ్రి లక్ష్మ ణ్ (ప)<br>మహమ్మద్ అబ్దుల్ హకీం కురేషీ తండ్రి రావుఫ్ కురేషీ(ప) | 193 | 193 | 122 | 191 | వాగు |
| 22 | 245 | పట్టా | మెట్ట | 0.01 1/2<br>0.07<br>0.07<br>0.06 1/2 | బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య (ప & అ)<br>బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య (అ)<br>బొమ్మగాని సత్తెమ్మ భర్త వెంకటయ్య(ప)<br>బొమ్మగాని వెంకటయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని రాంమూర్తి తండ్రి ఎల్లయ్ (ప)<br>బొమ్మగాని కొండయ్య తండ్రి సైదులు (ప)<br>బొమ్మగాని కాశయ్య తండ్రి ఎల్లయ్య (ప)<br>మండవ ఎల్లయ్య తండ్రి బుచ్చయ్య (ప)<br>బొమ్మగాని శ్రీను తండ్రి వెంకటయ్య (ప)<br>సూరబోయిన శైలజ భర్త నాగరాజు (ప)<br>జెట్టి లింగరాజు తండ్రి శ్రీను (ప)<br>బొమ్మగాని కటంరాజు తండ్రి రాంమూర్తి (ప)<br>బొమ్మగాని వెంకన్నతండ్రి రాంమూర్తి (ప)<br>జెట్టి గంగయ్య తండ్రి చింతలు (అ &ప)<br>పంతగి పరమేశ్ తండ్రి నర్సయ్య (అ) | 245 | 245 | గ్రామ సరిహద్దు | 246 | |
| 23 | 246 | పట్టా | మెట్ట | 0.03<br>0.01<br>0.02 1/2<br>0.00 1/2<br>0.06 1/2<br>0.05 1/2<br>0.18 1/2 | జెట్టి ఉప్పమ్మ భర్త శ్రీను (ప& అ)<br>జెట్టి వీరయ్య తండ్రి చింతలు (ప & అ)<br>పంతగి పరమేశ్ తండ్రి నర్సయ్య (అ)<br>పంతంగి నర్సయ్య తండ్రి సాయిలు (ప)<br>జెట్టి గంగయ్య తండ్రి చింతలు (ప & అ)<br>బొమ్మగాని సీతారాములు తండ్రి ఎల్లయ్య(ప & అ)<br>బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య(ప & అ)<br>బొమ్మగాని సీతారాములు తండ్రి యల్లయ్య (ప & అ)<br>బొమ్మగాని రమేశ్ తండ్రి సూరయ్య (ప & అ) | 246 | 246 | 245 | 255 | |
| 24 | 252 | పట్టా | మెట్ట | 0.10 1/2 | ధరవత వీరన్న తండ్రి వాల్య (అ)<br>బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి (ప )<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప )<br>బండారు శ్రీనివాస్ రెడ్డి తండ్రి సామీ రెడ్డి (ప )<br>బండారు వెంకట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి (ప ) | 252 | 252 | 259 | 252 | |
| 25 | 253 | పట్టా | మెట్ట | 0.07 1/2 | వాగు | 253 | 254 | 251 | 259 | వాగు |
| 26 | 254 | పట్టా | మెట్ట | 0.13 1/2 | వాగు | 253 | 254 | 255 | 259 | వాగు |
| 27 | 255 | పట్టా | మెట్ట | 0.18 | వాగు | 255 | 255 | 246 | 254<br>253 | వాగు |
| 28 | 259 | పట్టా | మెట్ట | 0.10 1/2<br>0.05<br>0.01<br>0.002<br>0.05 | బండారు విజయ్ గంగాధర రెడ్డి తండ్రి బాస్కర్ రెడ్డి / బాస్కర్ రెడ్డి (ప & అ)<br>ధరావ ధరావత్ వీరన్న తండ్రి వాల్య(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>ధరావత్ శ్రీను తండ్రి పాప(అ)<br>బండారు సక్కు బయమ్మ భర్త నర్సిరెడ్డి (ప)<br>బండారు శ్రీనివాస్రెడ్డి తండ్రి సామీ రెడ్డి(ప)<br>బండారు వెంక ట రమణ రెడ్డి తండ్రి సామీరెడ్డి(ప) | 259 | 259 | 253 | 252 | |
| 29 | డొంక | | | | హదీ రాస్తా | | | | | |
| మొత్తం : 9.34 1/4 | | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (నెం. 30/2013)లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు, సూర్యాపేట గార్లు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.
భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలయును.

సం/- రాజస్వ మండలాధికారి, సూర్యాపేట
సం/- అదనపు కలెక్టరు, సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టరు, సూర్యాపేట

DIPR RO NO. 828/LA/PP/Advt/Pub/2025-26

# ప్రజల హక్కుల పరిరక్షణలో సిపిఐదే కీలకపాత్ర

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/ముధోల్/నిజామాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సిపిఐ పార్టీ శత వార్షికోత్సవ బస్సు యాత్రను ముధోల్ నియోజకవర్గంలోని బాసర మండలం నుండి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు ప్రజల హక్కుల సాధనలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించిందని పశ్య పద్మ స్పష్టం చేశారు. స్వతంత్ర భారతదేశం ఏర్పడటంలో సిపిఐ నాయకులు చేసిన కృషిని ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఆమె కొనియాడారు. ఈ బస్సు యాత్ర ద్వారా పార్టీ సిద్ధాంతాలను, ప్రజల కోసం చేసిన పోరాటాలను ప్రజలోకి తీసుకెళ్లామని ఆమె తెలిపారు. నేడు దేశవ్యాప్తంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసే ఏకైక పార్టీ సిపిఐ అని పశ్య పద్మ గట్టిగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆమె విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి, కార్మికులు రోజుకు 8 గంటలే పని చేసే విధంగా సిపిఐ సాధించిన విజయాన్ని నేటి ప్రభుత్వం కార్మిక చట్టాలకు మార్చడం ద్వారా కాలరాసే ప్రయత్నం చేస్తోందని, కార్మికులపై మరింత పని భారం మోపుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేసి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని పశ్య పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతూ, కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు పన్నులు మినహాయింపులు వర్తింపజేసి, ప్రజాధనాన్ని వారి చేతిలో పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. సామాన్య ప్రజలకు సిపిఐ నిరంతరం అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని పశ్య పద్మ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి విలాస్, నాయకులు, పార్టీకి సంబంధించిన అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సిపిఐ త్యాగం వెలకట్టలేనిది**
**మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా**

సిపిఐ కార్మికవర్గం కష్టజీవుల పార్టీ అని వందేళ్ల సభను విజయవంతం చేద్దామని మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ వందేళ్ల పండగ సందర్భంగా బస్సు ప్రచార జాత బాసర నుంచి ప్రారంభమై శనివారం మధ్యాహ్నం నిజామాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్సపల్లి నుంచి గాంధీ గంజ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ గంజ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. కళాజాత కళాకారులు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ ఎంపీ అజీజ్‌పాషా, పశ్య పద్మ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, డీజీ నరేంద్ర ప్రసాద్, ఉప్పలయ్య, నగర కార్యదర్శి ఓమయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తర్వాత వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నది సిపిఐ మాత్రమేనన్నారు. దేశంలో ఎన్నో పార్టీలు పురుడు పోసుకున్నాయి అంతరించిపోయాయని ప్రజల సమస్యల మీద ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా పోరాటాలు చేస్తూ ప్రజల ఆదరణ పొందినదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిపిఐ త్యాగం వెల కట్టలేనిదన్నారు. కమ్యూనిస్టు పార్టీ పుణ్యం వల్ల 10 లక్షల ఎకరాలు భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సభకు మూడు నుంచి ఐదు లక్షల వరకు కామ్రేడ్లు హాజరు కానున్నారని, ఇతర దేశాల నుంచి 40 మంది ప్రతినిధులు రానున్నారన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ దేశాల ఆర్థిక స్థితిగతులను దెబ్బ తీయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని, ఎగుమతులు దిగుమతులపై అధిక సుంకాలు విధించడం సరి కాదన్నారు. డిసెంబర్ 26న చరిత్రలో నిలిచిపోయే సిపిఐ శత జయంతి ఉత్సవ కార్యక్రమం విజయవంతం చేద్దామన్నారు. మెక్ అమెరికా బిగ్ అగైన్ అని అతిపెద్ద సంపద గల దేశంగా మార్చుకోవడంలో భాగంగా ఎగుమతులు దిగుమతులను పెంచుతూ ట్రంప్ కుట్ర చేస్తున్నారన్నారు. దేశంలో రాష్ట్రంలో కార్మిక కర్షకులు ఇబ్బందుల పాలువుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచే సిపిఐకి మద్దతు తెలుపాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజేశ్వర్, రాజన్న, స్వరూప, రాణి, రఘురాం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు

### మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరా గాంధీ జయంతి రోజున (నవంబర్ 19న) మహిళా శక్తి బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలను చేపడతామని, మహిళా సమాఖ్య సభ్యులకు ప్రత్యేక యూనిఫాముల చీరలు త్వరలో అందజేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. 'స్వయం సహాయక బృందాల రూపంలో సగటు స్త్రీ అస్తిత్వం మరింత శక్తివంతమవుతుందని, ఎస్‌హెచ్‌జిల భాగస్వామ్యంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ, వారిని ప్రపంచ మార్కెట్ వైపు తీసుకెళ్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మండల సమాఖ్య అధ్యక్షుల రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరవ్వగా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలడిఆర్‌డిఒలు, అదనపు డిఆర్‌డిఒలు, అన్ని మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు హాజరయ్యారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు జరిపించాలని, ప్రతి ఆడపిల్లను చదివించడం, మహిళలపై జరిగే ఏ రకమైన హింసనైనా ఎదిరించడం, కులమత భేదాలను వదిలివేయడం, అంటరానితనాన్ని నిర్మూలించడంలో ముందుండడం లాంటి అంశాలపై మహిళా సంఘాల సభ్యులతో మంత్రి సీతక్క ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఇందిరా మహిళా శక్తి బజార్లు విస్తరిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వ సంకల్పంపై కొంతమంది ఎద్దేవా చేసినప్పటికీ, ఇప్పటికే అనేక మండల సమాఖ్యల్లో కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని, గ్రామీణ మహిళలు వ్యాపారాలను నెలకొల్పారని వివరించారు. ఆదిలాబాద్ ఆదివాసీ మహిళలు తయారు చేస్తున్న ఇప్ప పువ్వు లడ్డూలు విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందుతున్నాయని, స్థానిక ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలతో మహిళల్లో ధైర్యం పెరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలే సాధారణ స్త్రీకి అస్తిత్వాన్ని ఇచ్చే వేదికలన్నారు. సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమ, ఇందిరా గాంధీలా మహిళలు ధైర్యంగా నిలబడితే కొత్త చరిత్ర లిఖించ వచ్చన్నారు. అనంతరం డిఆర్‌డిఒ, అదనపు డిఆర్‌డిఒలతో మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్మాణాలు

### సచివాలయంలో భక్తుల క్యూలైన్ల బ్రాస్ గ్రిల్స్ నమూన పరిశీలించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమ్మక్క–సారక్క మేడారం జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్ఘాటించారు. యావత్ ప్రపంచం ఈ జాతర కోసం ఎదురు చూస్తుందని పేర్కొన్నారు. ఈ జాతర వేదిక... ప్రపంచం నలుమూలలూ చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మేడారం విలసిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క–సారలమ్మ పోరాట గాథ, చరిత్ర విశ్వవ్యాప్తమవుతున్నదని చెప్పారు. సమ్మక్క సారక్క మేడారం జాతరలో అమ్మవారి గద్దెల చుట్టూ భక్తులు క్యూలైన్లలో సాఫీగా వెళ్ళేందుకు తయారు అవుతున్న బ్రాస్ గ్రిల్స్ నమూనాను తెలంగాణ సెక్రటేరియట్‌లో శనివారం కొండా సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులతో స్వయంగా మాట్లాడారు. గిరిపుత్రుల ఆరాధ్య దేవతల ఆశీస్సులు తీసుకునేందుకు... మొక్కులు చెల్లించుకునేందుకు... ఆ ప్రాంతాన్ని సందర్శించి తన్మయత్వం చెంది పునీతులయ్యేందుకు కోట్లలో భక్తులు, ప్రజలు జాతరకు వస్తారని, అందుకు తగిన విధంగా బ్రాస్ గ్రిల్స్ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని సూచన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మేడారంలో పెద్ద ఎత్తున శాశ్వత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణ సంబంధిత నిర్వాహకులు మంత్రి సురేఖకి గ్రిల్స్ చూపించేందుకు బ్రాస్ గ్రిల్స్‌ను స్వయంగా సచివాలయానికి తీసుకొచ్చామని అక్కడే ఎదురైన మీడియా ప్రతినిధులకు చెప్పారు. దాదాపు రెండు వందల ఏండ్ల పాటు మన్నికగా ఉండే ఉద్దేశంతో ఈ గ్రిల్స్‌ను పటిష్టంగా తయారు చేయించినట్టు చెప్పారు. వీటిని సమ్మక్క సారక్క, జంపన్న గద్దెల చుట్టూ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వెళుతుందని, ఈ నేపథ్యంలో మేడారం జాతరలో భక్తుల రద్దీ నిర్వహణను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు మూడు నెలల ముందు నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారిని అభినందించారు.



# పార్టీని భ్రష్టు పట్టించింది హరీష్, కెటిఆర్‌లే




### తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు

**ప్రజాపక్షం/మెదక్ :** కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్‌ఎస్‌ని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటిఆర్ అధోగతి పాలు చేస్తూ భ్రష్టు పట్టించారని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా వజ్రాయుధంలా జాగృతి సంస్థ పనిచేస్తుందని అన్నారు. మెదక్ జిల్లా కోసం విన్నది వేరని ఇక్కడ చూస్తే వేరేలా ఉందని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని అన్నారు. కెటిఆర్ సోషల్ మీడియాలోనే పోరాటం చేస్తున్నారని సమస్యలపై పోరాటం చేసేందుకు ప్రజల్లోకి రావాలని ఎమ్మెల్సీ కవిత సలహా ఇచ్చారు. మెదక్ జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కవిత పర్యటన రెండవ రోజు శనివారం సాగింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కెసిఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్‌ఎస్‌ను అధోగతి పాలు చేశారన్నారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలు రాష్ట్రంలో ప్రతిపక్షం బలంగా లేదన్న విషయాన్ని గుర్తు చేసిందన్నారు. అన్న కెటిఆర్ సోషల్ మీడియాలోనే ప్రజల సమస్యలు తీసుకు వస్తున్నాడని, సోషల్ మీడియాను వీడి ప్రజల్లోకి వచ్చి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. హరీష్‌రావు పార్టీని మోసం చేయడం మానుకోవాలన్నారు. ఒక సభ సక్సెస్ అయితే కేసీఆర్‌ని మోసినట్లు ఫీల్ అవుతున్నారని, ఆయన ముందు వీరంతా బచ్చాలు అని పేర్కొన్నారు. హరీష్ రావు అవినీతిని బయటపెట్టిన సీఎం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రెడ్డిపల్లి, చిప్పలదుర్తి, తునికి గ్రామాల మధ్య హరీష్ రావుకు 400 ఎకరాల భూమి ఉందన్నారు. ఆయన భూమి కోసమే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారని విమర్శించారు. ఆ ప్రాంతంలో రిసార్ట్ నిర్మాణం చేసి ప్రజలను రానివ్వడం లేదన్నారు. చిన్న చింతకుంటలో గంగుల కమలాకర్‌కు 15 ఎకరాలు, నవీన్‌రావుకు 18 ఎకరాలు భూమి ఉండడం అలైన్‌మెంట్ మార్చారని రైతులు చెబుతున్నారని, నిజామా కాదా నేతలే చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి హాస్టల్ అద్దె రూ.లక్షా 6 వేలు తీసుకుంటున్నాడని, విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఐదేళ్లుగా విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటివి కేసీఆర్‌కు తెలిసి ఉండవని, తెలిస్తే ఆయన ఒప్పుకునే వారు కాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం పరిధిలోని, అశ్వారావుపేట మున్సిపాలిటీ, అశ్వారావుపేట (గ్రామం & మండలం), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గల **దొంతి కుంట చెరువును మిని ట్యాంక్ బండ్** చేయు పనులకు సంబంధించిన టెండర్ నోటీస్ నెంబర్: 11/2025-26, తేదీ: 11.11.2025లో అంచనా మొత్తం **రూ.3,76,21,677/-** టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు **17.11.2025, 3.00PM నుండి 01.12.2025, 3.00PM** వరకు లభించును. **గమనిక:** మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు ఇరిగేషన్ సర్కిల్, కొత్తగూడెం
DIPR R.O. No. : 10746-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
HYDERABAD
**చందానగర్ సర్కిల్-21, శేరిలింగంపల్లి జోన్.**
క్ర.సం.1, **NIT No.** 21/SLPZ/GHMC/2025-26, తేది: 13.11.2025. **పని పేరు:** ఎఫ్‌ఒబిల నిర్వహణ, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 14.11.2025న మ.2.00గం.ల నుండి 17.11.2025న మ.2.00గం.ల వరకు, **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీమతి ఆర్.ఇందిరాబాయి, ఇఇ, డివిజన్-21, ఎస్ఎల్‌పి జోన్. **ఫోన్ నం.** 040-23033163. మరిన్ని టెండర్ వివరాలకు వెబ్‌సైట్ www.ghmc.gov.in ను చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10762-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025

తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ**
ఇ-టెండర్ నోటీసు
2025-26 సంవత్సరానికి (1) పని కోసం సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్‌లో గుమ్మడిదల సెక్షన్‌లోని బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. అనగా టెండర్ ఐడి: 643539 ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఫైల్ నెం. 861976/S6/2025, తేదీ.14.11.2025తో ప్రచురించబడినది. పని వివరాలను @www.tender.telangana.gov.in కు లాగిన్ అయి చూడవచ్చు.

| క్ర.సం. | పని పేరు | అంచనా వేసిన మొత్తం రూ. |
|---|---|---|
| 1. | సంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి రేంజ్, గుమ్మడిదల సెక్షన్, బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ పార్క్ వద్ద నీటి సంప్ నిర్మాణం. | రూ. 7,90,000/- |
| 2. | టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మరియు బిడ్ డాక్యుమెంట్ సమర్పణ | 17.11.2025 @ 10:30 AM నుండి 03.12.2025 @ 3:00 PM |
| 3. | సాంకేతిక బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 3.50 PM |
| 4. | ప్రైస్ బిడ్ ప్రారంభ తేదీ | 03.12.2025 @ 4.30 PM |

**కార్యాలయ చిరునామా:** జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి, మల్కాపూర్ X రోడ్ దగ్గర, రాంచంద్రారెడ్డి కాలనీ, సంగారెడ్డి - 502001 (సంప్రదింపు నంబర్ 9440810118).
సం/- జిల్లా అటవీ అధికారి, సంగారెడ్డి.
DIPR R.O. No. : 10702-PP/CL/ADVT/1/2025-26, Date: 15-11-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## 'గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్-2025' దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్:వివిధ రంగాలలో కృషి చేసిన సంస్థలకు, వ్యక్తులకు 'గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్2025 ' కోసం గవర్నర్ కార్యాలయం దరఖాస్తులకు ఆహ్వానించింది. మహిళా సాధికారత, గిరిజన అభివృద్ధి, రూరల్ హెల్త్ మెడికల్ ఫిలాన్త్రోపీ, కార్పొరేట్ వాలంటీరింగ్‌లో విశేష సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలు, సంఘాలు, ట్రస్టులు తమ నామినేషన్లను సమర్పించాలని రాజ్‌భవన్ కార్యాలయం శనివారం తెలిపింది. ప్రతి రంగంలో రెండు విభాగాల్లో సంబంధిత వ్యక్తులు, సంస్థ,సంఘాలు,ట్రస్టులకు అవార్డులు అందించబడతాయని వెల్లడించారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో స్వీకరించబడతాయని, అవార్డుల ఎంపికను గవర్నర్ నియమించిన ప్రత్యేక నిపుణుల సంఘం చేస్తుందని తెలిపారు. నామినేషన్లను నవంబర్ 16 వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని చెప్పారు. అవార్డులు జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేస్తారు. ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేయడం కోసం సంప్రదించాలన్నారు.



కైరోలో జరుగుతున్న ప్రపంచ షూటింగ్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన హైదరాబాద్ అమ్మాయి ఈషాసింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం అభినందనలు తెలిపారు. మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచారన్నారు. షూటింగ్‌లో పట్టుదలతో సాధన చేస్తున్న ఈషాసింగ్ ఎంతోమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని, మరింతగా రాణించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.


### దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1446

**వాటర్ వెండింగ్ యంత్రాల సంస్థాపన మరియు నిర్వహణ కోసం ఇ-వేలం**

భారత రాష్ట్రపతి తరపున దక్షిణ మధ్య రైల్వే, హైదరాబాద్ డివిజన్‌లోని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కింది స్టేషన్లలో స్వతంత్ర ప్రాతిపదికన వాటర్ వెండింగ్ యంత్రాల (WVMs) సంస్థాపన మరియు నిర్వహణ కోసం కాంట్రాక్ట్‌ను అందించడానికి IREPS వెబ్‌సైట్ www.ireps.gov.in యొక్క వేలం లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-బిడ్స్‌ను ఆహ్వానించడమైనది.
ప్రచురించబడిన కేటలాగుల వివరాలు మరియు ఇ-వేలం షెడ్యూల్ వివరాలు సవివరంగా క్రింద తెలుపబడినది.

| క్ర. సం. | కేటగిరీ | కేటలాగ్ నెం. | స్టేషన్ పేరు మరియు డబ్ల్యువిఎం యూనిట్ల సంఖ్య | వేలం తేదీ | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | వాటర్ వెండింగ్ మెషీన్స్ (WVMs) | HYB-WVM-010 | కాచిగూడ - 04 యూనిట్లు<br>కర్నూల్ సిటీ - 01 యూనిట్<br>నిజామాబాద్ - 01 యూనిట్<br>గద్వాల్ - 01 యూనిట్ | 20-11-2025 | 11:00 | 12:00 |

A1840 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్.



### దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1447

**క్యాటరింగ్ స్టాల్స్ అవార్డుకు ఇ-టెండర్ నోటీసు**

భారత రాష్ట్రపతి తరపున దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్‌లోని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, ఈ-టెండరింగ్ వెబ్‌సైట్ www.ireps.gov.in ద్వారా రెండు ప్యాకెట్ టెండరింగ్ సిస్టమ్‌లో ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు, ఈ క్రింది స్టేషన్లలో క్యాటరింగ్ స్టాల్ కాంట్రాక్టులను అంటే జనరల్ మైనర్ యూనిట్లు (GMUలు) అందజేయడానికి.

| క్ర. సం. | స్టేషన్ పేరు (Catg.) & లొకేషన్ | క్యాటరింగ్ స్టాల్ రకం | యూనిట్ నెం. | కేటాయించబడిన యూనిట్ |
|---|---|---|---|---|
| 1 | కాచిగూడ (A1) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-011 | GMU |
| 2 | కాచిగూడ (A1) - P.F.No.2/3 | ఫ్రూట్ జ్యూస్ స్టాల్ | GMU-013 | GMU |
| 3 | కాచిగూడ (A1) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-014 | GMU |
| 4 | కాచిగూడ (A1) - P.F.No.4/5 | టీ స్టాల్ | GMU-017 | GMU |
| 5 | నిజామాబాద్ (A) - P.F.No.1 | టీ స్టాల్ | GMU-007 | GMU-WOMEN |
| 6 | నిజామాబాద్ (A) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-011 | GMU-WOMEN |
| 7 | నిజామాబాద్ (A) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-008 | GMU-WOMEN |
| 8 | నిజామాబాద్ (A) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-009 | GMU |
| 9 | కర్నూల్ సిటీ (A) - P.F.No.1 | ఫ్రూట్ జ్యూస్ స్టాల్ | GMU-004 | GMU |
| 10 | కర్నూల్ సిటీ (A) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-006 | GMU |
| 11 | కర్నూల్ సిటీ (A) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-007 | GMU |
| 12 | మహబూబ్‌నగర్ (B) - P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-008 | GMU |
| 13 | బాసర (B)- P.F.No.1 | టీ స్టాల్ | GMU-001 | GMU-WOMEN |
| 14 | బాసర (B)- P.F.No.1 | టీ స్టాల్ | GMU-003 | GMU-WOMEN |
| 15 | కామారెడ్డి (B)- P.F.No.2/3 | టీ స్టాల్ | GMU-002 | GMU |

టెండర్ ముగింపు తేదీ & సమయం : 05.12.2025న 15:00గం.లకు

A1841 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్.



### దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1448

**ఇ-వేలం ప్రకటన : నాందేడ్ డివిజన్/ఎస్‌సిఆర్/ ఇ-వేలం/2025, తేదీ : 13-11-2025**

ద సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, నాందేడ్ డివిజన్. నాందేడ్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ఎస్ఎల్ఆర్/విపియు, పే అండ్ యూజ్ మరుగుదొడ్లు లీజుకు తీసుకొనుటకు, ప్రకటన, ఇతర రకాలైన చిన్న చిన్న స్థిరమైన సేవలు అనగా ఎంటిఎంలు, పార్కింగ్ కాంట్రాక్టులు అందించడానికి ఎటిఎంలు,18 ఏళ్ళు వయసు దాటిన అంతకంటే ఎక్కువ వయసుగల భారత జాతీయులు/సంస్థలకు భారత రాష్ట్రపతి తరపున ఇ-వేలానికి ఆహ్వానం. https:www.ireps.gov.in/ websiteలో అధికారికంగా పొందుపరచబడినవి. ఆ వివరాలు ఈ క్రింద ఇవ్వబడినవి.

**క్రమ సంఖ్య** : 1. **జాబితా నెం:** నాందేడ్–ప్రకటన–31–నాందేడ్. **వేలం తేదీ:** 27.11.25. **వేలం ప్రారంభ సమయం:** మధ్యాహ్నం 1.00 గంటలకు. **వేలం ముగింపు సమయం:** సాయంత్రం 4.00 గంటలకు. **వ్యాఖ్యలు/వివరాలు** : నాందేడ్ స్టేషన్ దిశగా రైల్వే ఆసుపత్రివద్ద మొదలుకొని రైల్వే కాలనీ వరకూ ఎన్ఇడి, ఎంయుఇ, ఎంట్రీ గేటు (ఆర్‌పిఎఫ్ ఆఫీస్) నాందేడ్ స్టేషన్ సమీపం బస్‌స్టాండ్ వరకూ బహిరంగ ప్రదేశాలలో హోర్డింగుల ద్వారా ప్రకటనలు నాందేడ్ పిబిఎన్, జె, సిపిఎస్ఎన్ డిటిసి నుండి సంఘవి కార్నర్ వరకూ ఎంఎస్ఇబి ఆఫీస్, ఎన్ఎస్ఎల్, మరియు ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి & ఓఆర్‌హెచ్ సమీపం నుండి సిపిఎస్ఎన్ స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన మూడు సంవత్సరాలపాటు బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగుల ద్వారా ప్రకటనలు. వాణి & యుఎంఎం వైపు ప్రవేశ ద్వారా వద్ద మరియు ఎడిబి స్టేషన్ పక్కన లోపలికి మరియు వెలుపలికి వెళ్ళే ప్రవేశ ద్వారాల గోడలపైన, మరియు ఎడిబి స్టేషన్‌కు ఐదేళ్ళ కాలం పాటు హోర్డింగుల ద్వారా బహిరంగ ప్రకటనలు. సిపిఎస్ఎన్, ఎన్ఎస్ఎల్ వద్ద, పిబిఎన్ & జె వద్ద మూడేళ్ళకాలానికిగాను రైల్వే డిస్‌ప్లే హోర్డింగుల ద్వారా ప్రకటనలు.

**క్రమ సంఖ్య** :2. **జాబితా నెం** : నాందేడ్–ఎటిఎం–09– నాందేడ్. **వేలం తేదీ** : 27.11.2025. **వేలం ప్రారంభ సమయం** : ఉదయం 11.15 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : మధ్యాహ్నం 1.25 గంటలు **వ్యాఖ్యలు/వివరణలు** : ముధ్కేడ్ వద్ద, నాందేడ్ (డివిజనల్ రైల్వే ఆఫీసు కాంప్లెక్స్), నాందేడ్ ప్లాట్‌ఫాం-01, ప్రవేశ సమీపం (ఎంటిఎం-02), నాందేడ్ ప్లాట్‌ఫాం-04 ప్లాట్‌ఫాం పక్కన ఎటిఎం-01, నాగర్‌సోల్, పూర్ణ, పార్టూర్, సెలు, కిన్వట్, ఆదిలాబాద్ & గంగాఖేర్‌లవద్ద ఐదు సంవత్సరాల కాలానికిగాను ఎటిఎం కాంట్రాక్టు.

**క్రమ సంఖ్య** :3. **జాబితా నెం** : నాందేడ్–పార్క్–31–నాందేడ్. **వేలం తేదీ** : 27.11.2025. **వేలం ప్రారంభ సమయం** : మధ్యాహ్నం 12.00 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : మధ్యాహ్నం 1.30 గంటలు. **వ్యాఖ్యలు/వివరణలు** : సహస్రకుండ్,భోకార్, రోటేగాన్,లాసూర్,బాస్మత్, పూర్ణా & ఆకోట్‌లవద్ద మూడు సంవత్సరాల కాలానికిగాను పార్కింగ్ కాంట్రాక్టు.

**క్రమ సంఖ్య** :4. **జాబితా నెం** : నాందేడ్–పాలన్‌పూర్–32–నాందేడ్. **వేలం తేదీ** : 28.11.2025. **వేలం ప్రారంభ సమయం** : మధ్యాహ్నం 12.00 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : మధ్యాహ్నం 1.30 గంటలు. **వ్యాఖ్యలు/వివరణలు** : రోటేగావ్, నాగర్‌సోల్, హింగోలీ, జల్నా, పార్టూర్, బాస్మత్ & గంగాఖేర్‌లో మూడు సంవత్సరాల కాలానికిగాను పే అండ్ యూజ్ మరుగుదొడ్లు కాంట్రాక్టు.

క్ర.సం. : **5.** క్యాటలాగ్ నెం. : NED-Parcel-43-NED. వేలం తేది : 27-11-25. వేలం ప్రారంభ సమయం: 10:00. వేలం ముగింపు సమయం: 17:00. రీమార్కులు / వివరాలు : **Parcel SLR leasing in train No.** 17618/F1, 17664/R1, 17618/R1, 16004/F1, 20810/F1, 17662/F1, 17664/F1, 17664/F2, 17630/F1, 17409/F1, 12753/F1, 17662/F2, 17662/R1, 17611/F2, 17648/F2, 17410/F1, 17409/F2, 12421/F1, 12788/F2, 17611/F1, 17611/R1, 17614/F1, 17406/F2, 17410/F2, 17410/R1, 14621/F1, 20810/F2, 12788/R1, 17618/F2, 12072/F1, 17406/F1, 22723/F1, 12767/F1, 17232/F1, 17232/F2, 17648/F1, 17232/R1, 20812/F1, 12788/F1 & VP 3 సంవత్సరాల కొరకు ట్రైన్ నెం.12715 లో.

**క్రమ సంఖ్య** :6. **జాబితా నెం** : నాందేడ్–ఒకచోట స్థిరంగా ఉండి చేసే ఇతరత్రా చిన్న చిన్న సేవలు. **వేలం తేదీ** : 27.11.2025. **వేలం ప్రారంభ సమయం** : ఉదయం 11.00 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : సాయంత్రం 6.00 గంటలు. **వ్యాఖ్యలు / వివరణలు** : 1. నాందేడ్‌లో ఐదు సంవత్సరాలపాటు **బ్యాటరీ ద్వారా పనిచేసే కారు సేవలు**. 2. నాందేడ్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ఐదు సంవత్సరాలకాలంపాటు **నీటి విక్రయ యంత్రం ఏర్పాటు. వేలం తేదీ** : 28.11 2025. **వేలం ప్రారంభ సమయం** : ఉదయం 10.00 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : మధ్యాహ్నం 12.00 గంటలు. **వ్యాఖ్యలు / వివరణలు** : 1. జె,ఎన్ఎస్ఎల్, ఎన్ఇడి, ఎడిబి, పిబిఎన్ & పిఎయు లవద్ద మూడు సంవత్సరాలకాలానికిగాను **మొబైల్ & యాక్సెసరీస్ కియాస్క్‌ల సేవలు.** 2. సిపిఎస్ఎన్, ఎడిబి, జె & పిబిఎన్ ల వద్ద మూడు సంవత్సరాల కాలానికిగాను **ఫోటో కాపీయర్ కియాస్క్‌ల సేవలు. వేలం తేదీ** : 29.11 2025. **వేలం ప్రారంభ సమయం** : ఉదయం 10.00 గంటలు. **వేలం పూర్తయ్యే సమయం** : ఉదయం 11.20.గంటలు. **వ్యాఖ్యలు/వివరణలు** : 1. సిపిఎస్ఎన్‌లో ఐదు సంవత్సరాలపాటు **బ్యాటరీ ద్వారా పనిచేసే కారు సేవలు.** 2. నాందేడ్, పిఎయు,హెచ్ఎన్ఎల్, ఎంయుఇ & డబ్ల్యుహెచ్ఎంల వద్ద మూడు సంవత్సరాల కాలానికిగాను **కిరాణా, ఫోటో కాపీయర్ కియాస్క్‌ల సేవలు.**

ఆసక్తిగలవారు మరియు కాంట్రాక్టర్లు దీనిని పరిగణనలోకి తీసుకుని మరియు పైన పేర్కొన్న వెబ్‌సైటులో ఉన్న వివరాలను తెలుసుకోగలరు. పైన పేర్కొన్న విధంగా మరిన్ని వివరాలను ఇ-వేలం ప్రకటనను చదివి సంబంధిత సమాచారం తెలుసుకోగలరు.
ఇతర వివరాలకు, దయచేసి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, నాందేడ్ డివిజన్, నాందేడ్-431605 కార్యాలయంలో పనివేళలలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ ఈ క్రింద సంతకం చేసిన అధికారిని సంప్రదించగలరు.

A1842 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు, నాందేడ్.


## విద్యార్థులకు లక్ష్యాన్ని నిర్దేశించి విజయం సాధించేలా కృషి



### ఎటిసి ప్రిన్సిపాళ్ల శిక్షణ కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి

ప్రజాపక్షం/హైదరాబాద్: విద్యార్థులకు లక్ష్యాన్ని నిర్దేశించి వారు విజయం సాధించేలా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో శనివారం నిర్వహించిన ఏటీసీ ప్రిన్సిపాళ్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎటిసిల ద్వారా అత్యుత్తమ మానవ వనరులను తీర్చిదిద్దే బాధ్య త ప్రిన్సిపాళ్లు, శిక్షకులపై ఉందని, లక్ష్య సాధన కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు(ఎటిసి)లుగా అప్‌గ్రేడ్ చేయడం గొప్ప ముందడుగు అని, ఇది త్వరలోనే ఫలితాలను ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం నిరుద్యోగం పెద్ద సవాలుగా మారిందని, దాని ని అధిగమించాలంటే ఎటిసిలు సమర్థవంతంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ట్రైనర్లకు శిక్షణ ఇవ్వడం మొదటి ప్రాధాన్యత కావాలని, ఆశించిన ఫలితాలను సాధించేందుకు ప్రిన్సిపాళ్లు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. స్పష్టం చేశారు.ఎటిసిల ద్వారా 2 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగలిగితే అదో అద్భుత మైలురాయి అవుతుందని ఎటిసిలలో ప్రవేశ పెట్టిన కోర్సులు అవసరమైన మార్పులతో మరో 10 నుంచి 15 ఏళ్ల వరకు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎటిసిలు రాబోయే రెండేళ్లలో 2 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించగలిగితే, అది చాలా గొప్ప విజయం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చొరవతోనే ఇది సాధ్యమైందని, ఎటిసిలు సత్ఫలితాలను ఇస్తే సిఎస్ఆర్‌లో భాగస్వాములైన టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో కలిసి ముందుకు సాగేందుకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్స్ తగ్గించడంతో పాటు ఎటిసిల పనితీరును క్రమబద్ధీకరించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా సమన్వయంతో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎటిసిల లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేస్తున్న ప్రిన్సిపాళ్లు, శిక్షకులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక, ఉపాధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్, ఉపాధి, శిక్షణ శాఖ జెడి ఎస్వికె నాగేశ్, టాటా గ్రూప్ ప్రతినిధులు,ఎటిసిలప్రిన్సిపాళ్లు,అధికారులు ఉన్నారు.

## ఫారెస్టుల్లో 'ఫైర్స్' తగ్గించేందుకు స్థానికులకు శిక్షణ

### మంత్రి కొండా సురేఖ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫారెస్టుల్లో ఫైర్స్ తగ్గించేందుకు స్థానికులకు శిక్షణ ఇవ్వాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. అటవీ పరిరక్షణకు ఏ చర్యకైనా వెనకడుగు వేయొద్దని ఫారెస్టు ఉన్నతాధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. దాంతో పాటు, ఎకో టూరిజం అభివృద్ధి చేసి అడవులను కూడా ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేయాలని చెప్పారు. తెలంగాణ సచివాలయంలోని మంత్రి పేషిలో శనివారం 'తెలంగాణ హరిత నిధి' రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్,పిసిసిఎఫ్(హెచ్ఒఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, సిసిఎఫ్ డాక్టర్ జి. రామలింగం(సోషల్ ఫారెస్టు), డాక్టర్ భీమా నాయక్, ప్రియాంక వర్గీస్, అన్ని జిల్లాల డిఎఫ్ఒలు, ఆర్థిక శాఖఇతరశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హరితనిధి వినియోగంపై సమగ్ర చర్చ చేశారు. నర్సరీలనుఏర్పాటుచేయడం, మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, సంరక్షించడం, మొక్కల లెక్కలు తేల్చడం, పచ్చదనంపై అవగాహన పెంచే కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన, అమలు, పర్యవేక్షణ వంటి అవసరాలకు మంత్రి సురేఖ ప్రత్యేక సూచనలు చేశారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కూడా చర్చ చేశారు. దాంతోపాటు, అడవుల్లో ఫైర్స్ కంట్రోల్ చేయడం అనివార్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. దాని ద్వారా అటవీ సంపద, జంతువుల పరిరక్షణ చేపట్టినట్టు అవుతుందన్నారు.2025–26 బడ్జెట్ మీద మంత్రి శాంక్షన్లపై సుదీర్ఘంగా చర్చ జరిపారు. ఫైర్స్ మీ ద కూడా సమావేశంలో చర్చ జరగ్గా... వాటిని తగ్గించేందుకు ప్రస్తుతం అవలంభిస్తున్న విధానాలపై మంత్రి ఆరా తీశారు. హరిత నిధి కింద నర్సరీల పెంపకం (గంధపు చెక్క, వెదురు, శాంటాలమ్ ఆల్బమ్) మౌలిక సదుపాయాల అభివృద్ధితో 26 అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి,నిర్వహణ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. నాలుగు ఎకో టూరిజం ప్రదేశాల అభివృద్ధి, కాకతీయ జూలాజికల్‌లో అభివృద్ధి, నిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. పార్క్, హనుమకొండ 24 గ్రీనరీ ప్రాజెక్టుల అభివృద్ధి (అవెన్యూ ప్లాంటేషన్లు) సిబ్బందికి సామర్థ్య నిర్మాణ శిక్షణలు ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు వనదర్శిని కార్యక్రమాలు మొదలైనవి చేపట్టామన్నారు. నాగార్జున సాగర్‌లో వన్యప్రాణుల నిర్వహణ చేపడుతున్నామన్నారు. నారాయణపేటలో బ్లాక్‌బక్ రెస్క్యూ & పునరావాస కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని రక్షణ, నియంత్రణ నిర్వహణ చేపడుతున్నారు. వరంగల్ నుండి మేడారం రహదారి వరకు (సమ్మక్క సారక్క కారిడార్) అవెన్యూ మరియు ఇతర తోటల పెంపకం చేపట్టడం జరుగుతుందన్నారు. ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలోని మాస్ట్రీ ఫాల్ వద్ద పునరుజ్జీవన కార్యకలాపాల చేపట్టడం జరుగుతుందని వివరించారు.

## 'ఒయు'ను రూ.వెయ్యి కోట్లతో తీర్చిదిద్దుతాం

### ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అధ్యక్షతన హైపర్ కమిటీ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీని రూ.1000 కోట్లతో ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చి దిద్దుతామని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటిని ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడంతో పాటు క్యాంపస్‌లోపల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అధ్యక్షతన శనివారం హైపర్ కమిటి సమావేశమైంది. రూ. 1000 కోట్ల ప్రణాళికతో హైదరాబాద్‌లోని ఐఎస్‌బి, ఐఐటి వంటి ప్రముఖ సంస్థలతో పోటిపడే విధంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధిని అందించడమే లక్ష్యంగా మొదటి ముసాయిదా ప్రతిపాదనలను సమావేశంలో చర్చించారు. విద్యా పరిశోధన, వినోద సౌకర్యాలతో స్థిరమైన క్యాంపస్‌ను సృష్టించడం ఈ ప్రణాళికల లక్ష్యమని తెలిపారు. మరింత చక్కటి వివరాలతో కమిటి ఒక వారం వ్యవధిలో మరోసారి సమావేశమవుతుంది. కమిటీ సభ్యులతో పాటు విద్యా శాఖ సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఇంజనీర్లతోనే చరిత్ర సృష్టి




### హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్

ప్రజాపక్షం/హైదరాబాద్:చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి ఇంజనీర్‌లతోనే సాధ్యమని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇందుకు ఆదర్శమని తెలిపారు. సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా పరిష్కార మార్గాలను ప్రతిపాదించడం ఇంజనీర్‌ల ప్రధాన బాధ్యత అని అన్నారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో శుక్రవారం ది ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐఈఐ) తెలంగాణ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ తెలంగాణ ఇరిగేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంజనీర్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ మూసీ వరదలు నివారణతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా జంట జలశయాలను నిర్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య నిజమైన ఆదర్శనియులని కొనియాడారు. డ్రైనేజీ, ట్రాఫిక్, వాతావరణ మార్పులు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించే సమయం వచ్చిందన్నారు. 2025లో కూడా పాత పద్ధతులతో సమస్యలను పరిష్కరించడం సమంజసం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. హైడ్రా కమిషనర్‌గా తాను చేపడుతున్న కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేసిన రంగనాథ్, ప్రభుత్వ పూర్తి సహకారంతో జరుగుతున్న ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ ఇంజనీర్లు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలకు పదును పెట్టి, కొత్త ఆవిష్కరణలు చేయాలని కోరారు. చరిత్రను తిరగరాయడం ఇంజనీర్ల చేతుల్లోనే ఉంది అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఐఈఐ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్ మాట్లాడుతూ ఇంజనీర్ విద్యాసాగర్ రావు జయంతి సందర్భంగా నిర్వహించే తెలంగాణ ఇరిగేషన్ డేలో ఇంజనీర్‌లను సత్కరించడం గర్వకారణమన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి ఐఈఐ తరఫున ప్రత్యేక అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఐఈఐ కౌన్సిల్ మెంబర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ రంగారెడ్డి, చీఫ్ సైనస్ట్ హెచ్.వి.ఎస్. సత్యనారాయణ, ఐఈఐ సెక్రటరి మర్రి రమేష్, ఈ వెంట్ కన్వీనర్ టి.వెంకట రత్నం పాల్గొన్నారు.

## 'తిరుపతిరావు' కమిటీ నివేదికను బహిర్గతం చేయాలి



ప్రజాపక్షం/హైదరాబాద్:ఉస్మానియాయూనివర్సిటీలో గత విసి హయాంలోసీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులకు సంబంధించిన అక్రమాలపై నియమించిన 'ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ' నివేదికను బహిర్గతం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఇటీవల జరిగిన పదోన్నతులలో కొంతమంది ప్రొఫెసర్లకు జరిగిన అన్యాయంపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, అర్హత ఉన్న వారికి పదోన్నతులలో అన్యాయం జరగకుండాచూడాలని కోరింది.ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శిపుట్ట లక్ష్మణ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో గత విసి హయంలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల విషయంలో యుజిసి నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారికి పదోన్నత్తులు కల్పించారని ఆరోపించారు. దీనిపైన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని తన నివేదికను సమర్పించినప్పటికీ , దీనిని బహిర్గతం చేయలేదన్నారు. ఒయు విసిగా ప్రొఫెసర్ కుమార్ మొలగారం నియమితులైన తర్వాత ఇటీవల మరోసారి పదోన్నతులు జరిగాయని, ఇందులో అన్ని అర్హతలు ఉన్నవారికి పదోన్నతులలో అన్యాయం జరిగిందని వివరించారు. యుజిసి నిబంధనలను గాలికి వదిలేసి, కొంతమంది విషయంలో కక్షపూరితంగా వ్యవహరించారని, ప్రొఫెసర్లకు ఇంగ్లీషు రాదని అవహేళన చేశారని ఆరోపించారు. అన్యాయం జరిగిందని నిరసన చేస్తే కేసులు నమోదు చేయడం, మెమోలు జారీ చేయడం అప్రజా స్వామికమన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఒయు కౌన్సిల్ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య నాయకులు అశ్విన్ పాల్గొన్నారు.


## చట్టబద్ధమైనదని తెలిసే చేశా : నటుడు రానా

### బెట్టింగ్ యాప్ కేసులో వేగం పెంచిన సిఐడి సిట్



ప్రజాపక్షం/హైదరాబాద్: తాను బెట్టింగ్ యాప్ చట్టబద్ధమైనదని తెలుసుకున్నాకే ప్రచారం చేశానని టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటి తెలిపారు. ఈ యాప్ ప్రచారంపై తన న్యాయ బృందం పూర్తిగా విచారణ చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సిఐడి అధికారులకు వివరించినట్లు ఆయన మీడియా ప్రతినిధులకు తెలిపారు. బెట్టింగ్, గేమింగ్ యాప్ ప్రమోషన్ కేసులో సిఐడి సిట్ అధికారులు దర్యాప్తు వేగం పెంచారు. మూడు రోజులుగా ఈ కేసులో సినీ హీరోలపై ప్రశ్నల వర్షం కురిపించిన సిట్ అధికారులు తాజాగా శనివారం టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటితో పాటు యాంకర్ విష్ణు ప్రియలు విచారించారు. వేర్వేరుగా ఇద్దరి స్టేట్మెంట్లను రికార్డు చేసినట్లు తెలిసింది. సుమారు గంటపాటు సాగిన విచారణలో అధికారులుయాప్‌ల ప్రచారానికి సంబంధించిన ఒప్పందాలు, చెల్లింపులు, ప్రమోషన్ విధానాలపై ప్రశ్నించారు. రానా 2017లో బెట్టింగ్, గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు.. స్కిల్ బేస్డ్ గేమ్ యాప్ను మాత్రమే ప్రమోట్ చేశానని ఇప్పటికే రానా సిఐడి సిట్‌కు వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో ఇటీవల ప్రముఖ నటులు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, సిరి హనుమంతు తదితర సినీ ప్రముఖుల స్టేట్మెంట్లు సిట్ రికార్డు చేసిన విషయం విదితమే. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసుల వద్ద నమోదైన కేసుల ఆధారంగా సిట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుల్లో టాలీవుడ్‌కు చెందిన మొత్తం 29 మంది సెలబ్రిటీలపై కేసులు నమోదు అయ్యాయి. విజయ్ దేవరకొండ, రానా, మంచు లక్ష్మి, ప్రకాశ్ రాజ్, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, శ్రీముఖి లు ఈ జాబితాలో ఉన్నారు. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తూ.. పలువురు ఇండస్ట్రీ సెలబ్రిటీలు ప్రచారం చేయడంపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసును సిట్ విచారణ చేస్తోంది.

## చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'డిఆర్ఎస్' ఇంటర్నేషనల్ విద్యార్థులు




ప్రజాపక్షం/హైదరాబాద్: బాలల దినోత్సవం సందర్భంగా విద్యా, కళలు, అథ్లెటిక్స్‌లోఅంతర్జాతీయంగా, జాతీయంగా అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు మంది విద్యార్థులకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అనుబంధసంస్థ అయిన చిల్డ్రన్ బుక్ఆఫ్‌రికార్డ్స్‌లో చోటు దక్కింది. నాయిస్ మేకర్స్ ఈవెంట్స్ సంస్థ సహకారంతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయ నిర్ణేతలు డా.పావని, డా.సరయు వ్యవహరించారు.అవార్డులకు ఎంపికైన మిష్కా అగర్వాల్, బర్ధవల్ శివ శంకర్, అదితి సోమ, కీర్తన రెడ్డి మడమడకల, ఆరుషి ముదిగొండ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు ను సర్టిఫికెట్ లను హైదరాబాద్, గుండ్ల పోచంపల్లి, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో శనివారం ప్రదానం చేసారు. డిఆర్ఎస్ ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ, వేణుగోపాల్ విజేతలను అభినందించారు. డిఆర్ఎస్ ఐఎస్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, రెసిడెన్సియల్ హెడ్ రాజేందర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, అడ్మిన్ హెడ్ వినోద రంజన్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారులపై కత్తులతో దాడి

### రాజమండ్రి, బెంగళూరు నుంచి డ్రగ్స్, గంజాయి సరఫరా.. ఇద్దరు అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాజమండ్రి, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్, గంజాయి సరఫరా చేస్తున్న ఓ ముఠాపై ఎక్సైజ్ అధికారులు దాడి చేయగా..నిందితులు తప్పించుకునేందుకు కత్తులతో ఎదురు దాడికి పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొద్దిపాటి గాయాలకు గురైన ఎక్సైజ్ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయితోపాటుడ్రగ్స్‌స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన గోబెరు వెంకట చైతన్య అలియాస్ ఫేక్ రెజ్వన్, నడిమిటి మమత భార్యాభర్తలు. వీరితో పాటు మరో వ్యక్తి పడమటి రవీందర్ అనే వ్యక్తి కూడా ఉన్నారు.ఈ ముగుగరు తరచూ రాజమండ్రి, బెంగుళూరు నుంచి గంజాయి, డ్రగ్స్‌ను తీసుకొని వచ్చి హైదరాబాదులో అమ్మకాలు సాగిస్తున్నారు.ఈ ముగ్గురు ప్రతి సారి మాదిరిగానే కారులో మాదకద్రవ్యాలను హైదరాబాద్‌కు తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ బిటీంసిఐభిక్షారెడ్డి,ఎస్ఐలుబాలరాజు, సంధ్యాతో పాటు సిబ్బంది శనివారం ఉదయం పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ 11 ప్రాంతంలోపిస్తా హౌస్ వద్ద కారుపై దాడి చేశారు. పోలీసులను గమనించిన చైతన్య, రవీందర్, మమత పారిపోతుండగా పోలీసులు వెంబడించారు. చైతన్య, రవీందర్ కత్తులతో సిబ్బందిపై దాడి చేసే ప్రయత్నంలో తోసివేసి మమత పరారయింది. దాడిలో సిబ్బందికి స్వల్పగాయాలయ్యాయి. చైతన్య, రవీందర్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 4.495 కిలోల గంజాయిని, 0.65 ఎండి ఎండిఎం ఎ డ్రగ్స్ తో పాటు కారు, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ముంబై మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరి పోరు

**ముంబై:** మహావికాస్‌అఘాడి(ఎంవీఏ)లో ఉద్రిక్తత ఏర్పడే అవకాశం ఉందని, బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కి జరగబోయే ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేయడానికి పార్టీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ ముంబై అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ అన్నారు. శనివారం పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ, 'బీఎంసీలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని సంకల్పించుకోవాలని పిలుపునిచ్చారు. 'కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎన్నికలయ్యేలా మనం చూసుకోవాలి. మొత్తం 227 స్థానాలకు సిద్ధం కావాలి' అని ఆమె అన్నారు. దేశంలోనే అత్యంత ధనిక పౌర సంస్థ అయిన బీఎంసీకి ఎన్నికలు జనవరి 2026లో జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితల, కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ సహా సీనియర్ నాయకుల సమక్షంలో గైక్వాడ్ ఈ ప్రకటన చేశారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే, ఆయన బంధువు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) నాయకుడు రాజ్ థాకరే పౌర ఎన్నికలకు చేతులు కలిపే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చింది.

## ఓటమి బాధ.. విజయగర్వం లేదు : ఆర్‌జెడి



**పట్నా:** ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) పేర్కొంది. ఓడిపోయామని బాధపడటం, విజయం సాధించామని గర్వపడటం ఉండదని తెలిపింది. ప్రజా సేవ బాటలో సాగే ప్రయాణం అంతం లేనిదంటూ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం అనంతరం ఎక్స్‌లో ఆర్జేడీ ఓ పోస్టు పెట్టింది. 'గెలుపోటములు తప్పవు. ఆర్జేడీ పేదల పార్టీ. ఓటమి బాధ, విజయ గర్వం ఉండదు. ప్రజా సేవలో సాగే ప్రయాణానికి అంతం ఉండదు. ఇది పేదల పార్టీ. ఎల్లప్పుడు వారి పక్షాన గళం వినిపిస్తుంది' అని పేర్కొంది. 243 మంది సభ్యులు ఉండే అసెంబ్లీలో 25 స్థానాలకు ఆర్జేడీ పరిమితమైంది. 2010 తర్వాత ఇంత ఘోర పరాభవాన్ని ఆర్జేడీ ఎప్పుడు చూడలేదు. నాడు 22 స్థానాలను మాత్రమే గెలిచింది. 2020 ఎన్నికల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చి 75 స్థానాలు కైవసం చేసుకుంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల వాటాను పెంచుకుంది. 23 శాతం ఓట్లు (బీజేపీ కంటే 2.92శాతం ఎక్కువ) పొందింది. జేడీయూ కంటే 3.72 శాతం అధికంగా ఆర్జేడీకి ఓట్లు వచ్చాయి. మహాకూటమి కేవలం 35 స్థానాలకు పరిమితం కాగా ఇందులో కాంగ్రెస్‌కు ఆరు, సీపీఐ(ఎంఎల్)కు రెండు, సీపీఎంకు ఒక స్థానం దక్కాయి.

## స్వల్ప మెజారిటీతో మారిన ఫలితాలు





**పట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ప్రత్యర్థులమధ్య విజయం చివరి వరకూ దోబూచులాడింది. చాలా తక్కువ మెజార్టీతో కొంతమంది అభ్యర్థులు విజయం సాధించారు. మూడు స్థానాల్లో అయితే, మెజార్టీ కేవలం 100లోపే. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటు సాధించి... బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఖాతా తెరిచింది. ఆ గెలుపు కూడా కేవలం 30 ఓట్ల తేడాతో దక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఎన్నికల్లో 243 సీట్లకుగాను 192 స్థానాల్లో మాయావతి పార్టీ బరిలోకి దిగింది. ఒకేఒక్క సీటు పార్టీ దక్కించుకోగలిగింది. ఆ పార్టీకి చెందిన సతీశ్ కుమార్ యాదవ్ రామ్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలో దిగారు. ఓట్ల లెక్కింపు ఆద్యంతం ఉత్కంఠగా జరిగింది. అర్ధరాత్రి తర్వాత వెలువడిన ఫలితాల్లో సతీశ్ అతి తక్కువ మెజార్టీతో విజేతగా నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆయనకు 72,689 ఓట్లు రాగా... సమీప బీజేపీ అభ్యర్థి అశోక్‌కుమార్ సింగ్‌కు 72,659 ఓట్లు క్కాయి.భోజ్‌పూర్‌జిల్లాలోని సందేశ్ అసెంబ్లీ నియోజకవర్గంలో జేడీయూ, ఆర్జేడీ అభ్యర్థుల మధ్య విజయం చాలాసేపటివరకు దోబూచులాడింది. చివరకు జేడీయూ అభ్యర్థి రాధాచరణ్ షా తన సమీప ఆర్జేడీ ప్రత్యర్థి దీపుసింగ్‌పై 27 ఓట్ల తేడాతో గెలుపొందారు. వీటితోపాటు అర్రాలోని అగియాన్ ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్‌కు చెందిన శివప్రకాశ్ రంజన్... బీజేపీ అభ్యర్థి మహేశ్ పాశ్వాన్ చేతిలో 95 ఓట్ల తేడాతో ఓడిపోయారు. నబీనగర్ అసెంబ్లీ స్థానంలో జేడీయూకి చెందిన చేతన్ ఆనంద్, ఆర్జేడీ అభ్యర్థి ఆమోద్‌కుమార్ సింగ్‌ను 112 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ ప్రత్యర్థి పవన్‌కుమార్ జైస్వాల్‌ను ఓడించి ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ రెహమాన్ ధాకానుసొంతం చేసుకున్నారు. వ్యత్యాసం 178 ఓట్లు మాత్రమే. ఫోర్బ్స్‌గంజ్ నుంచి బీజేపీ తరపున దిగిన విద్యాసాగర్ ఓటమి పాలయ్యారు. ఆయనపైఅభ్యర్థి మనోజ్ బిశ్వాన్ 221 ఓట్లతో విజయం సాధించారు.

## రాజకీయాలకు లాలూ కుమార్తె గుడ్‌బై
### కుటుంబంతోనూ తెగదెంపులు

**పాట్నా:** బిహార్ ఎన్నికల్లో ఆర్‌జెడికి షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఈ ఓటమి నుంచి కోలుకోకముందే ఆ పార్టీ అధినేత లాలూ యాదవ్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన కుమార్తె రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు రోహిణి ఆచార్య ప్రకటించారు. అంతే కాదు, కుటంబంతో సంబంధాలను కూడా తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నేను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను. అలాగే నేను నా కుటుంబాన్ని కూడా వదులుకుంటున్నాను. సంజయ్ యాదవ్, రమీజ్ నన్ను చేయమని అడిగింది ఇదే' అంటూ సంచలన ట్వీట్ చేశారు. ఎన్నికల్లో ఆర్‌జెడి ఘోర పరాభవం వేళ రోహిణి ఆచార్య ప్రకటన అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. కాగా, రోహిణి ఆచార్య వృత్తిరీత్యా వైద్యురాలు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లోని సరన్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అయితే, బిజెపి అభ్యర్థి రాజీవ్ ప్రతాప్ చేతిలో ఓటమి పాలయ్యారు.

## ఓట్ల చోరీపై యువజన కాంగ్రెస్ నిరసనలు

**బెంగళూరు:** వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం) జరిగిందని ఆరోపిస్తూ కర్నాటక ప్రదేశ్ యువజన కాంగ్రెస్ కమిటీ (కేపీవైసీసీ) శనివారం ఇక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఎన్నికల అక్రమాలపై భారత ఎన్నికల సంఘం, కేంద్రం నుంచి జవాబుదారీతనం కోరింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'భారీ స్థాయిలో ఓటు చోరీ' జరిగిందని, 'మొదటి నుంచీ న్యాయంగా లేని ఎన్నికల్లో మేము విజయం సాధించలేకపోయాము' అని రాహుల్ గాంధీ చెప్పిన ఒక రోజు తర్వాత ఈ ప్రదర్శన జరిగింది. ఇక్కడి ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన ప్రదర్శనకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, ఐవైసీ ఇంఛార్జ్ మనీశ్ శర్మ, కేపీవైసీసీ అధ్యక్షుడు మంజునాథ్ గౌడ నాయకత్వం వహించారు. కర్నాటకకు చెందిన అనేక మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. వీరిలో కార్మిక మంత్రి సంతోశ్ లాడ్, రాజ్యసభ ఎంపీ జీసీ చంద్రశేఖర్ ఉన్నారు. ఎన్నికల వ్యవస్థలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని, పారదర్శకతను నిర్ధారించే చర్యలను కోరుతూ నిరసనకారులు బెంగళూరులోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి కూడా ర్యాలీ చేయనున్నారు.

## గిరిజనులను విస్మరించిన కాంగ్రెస్
### ప్రధాని మోదీ విమర్శ



**దేడియాపాడ (గుజరాత్):** భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి గిరిజనులు గొప్పగా దోహదపడినప్పటికీ, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 60 సంవత్సరాల పాలనలో గిరిజనుల సహకారాన్ని ఎప్పుడూ గుర్తించలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గిరిజన దిగ్గజం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని నర్మదా జిల్లా దేడియాపాడ పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ... తన ప్రభుత్వం వైద్య సౌకర్యాలు పెంచిందని, గిరిజన ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు పెంచడానికి కృషి చేస్తోందని అన్నారు. గిరిజన ప్రాంతాలు సికిల్ సెల్ అనీమియా ముప్పును ఎదుర్కొంటున్నందున మేము వైద్య సదుపాయాలను పెంచామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను అభివద్ధి చేస్తున్నామని, ఇటీవల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన మహిళా జట్టులో ఒక గిరిజన క్రీడాకారిణి ఉందని తెలిపారు. తన ప్రసంగానికి ముందు, ప్రధాని రూ.9,700 కోట్లకు పైగా ఖర్చు చేసే వివిధ మౌలిక సదుపాయాలు, అభివద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.

## ఎన్నికల ప్రక్రియ ప్రశ్నార్థకం
బిహార్ ఫలితాలపై కాంగ్రెస్ వ్యాఖ్య
### పారదర్శకత లేదు.. త్వరలో ఫలితాలను విశ్లేషిస్తాం



**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే రాష్ట్రంలో ప్రతిపక్షం పేలవ ప్రదర్శనపై ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ పాత్రను ప్రశ్నించింది. ఫలితాలపై చర్చించేందుకు శనివారం రాహుల్ గాంధీ, పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే సహా అగ్ర నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, కోశాధికారి అజయ్ మాకెన్ బిహార్ ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు కూడా పాల్గొన్నట్లు వర్గాలు తెలిపాయి. బిహార్‌లో 61 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయగా కేవలం ఆరు సీట్లను మాత్రమే గెలుచుకుంది. 2010 తరువాత మళ్లీ ఇంత దారుణంగా ఓడడం ఇదే తొలిసారి. కాగా, సమావేశం అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ మొత్తం ఎన్నికల ప్రక్రియ ప్రశ్నార్థకంగా ఉందని, పారదర్శకత లేదని ఆరోపించారు. పార్టీ త్వరలో ఫలితాన్ని విశ్లేషిస్తుందని, రానున్న కొన్ని వారాల్లో కచ్చితమైన ఆధారాలను విడుదల చేస్తుందని ఆయన అన్నారు. 'బిహార్ ఫలితం అందరికీ నమ్మశక్యం కానిది. ఇది కాంగ్రెస్‌కు మాత్రమే కాదు, మొత్తం బిహార్ ప్రజలు, మా కూటమి భాగస్వాములు కూడా దీనిని నమ్మడం లేదు. మేము వారందరితో చర్చించాము; వారు దానిని నమ్మడం లేదు' అని వేణుగోపాల్ అన్నారు. ఒక రాజకీయ పార్టీకి 90 శాతం కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ రావడం భారత చరిత్రలో జరగలేదదన్నారు. దీనిపై తాము క్షుణ్ణంగా విశ్లేషణ చేస్తున్నామని, బిహార్ అంతటా డేటాను సేకరిస్తున్నామన్నారు. ఒకటి లేదా రెండు వారాల్లో తాము కచ్చితమైన ఆధారాలతో బయటకు వస్తామని అని ఆయన విలేకరులతో అన్నారు. ఎన్నికల ప్రచార ప్రక్రియ పూర్తిగా ప్రశ్నార్థకం అని ఆరోపిస్తూ, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని నిరంతరం లేవనెత్తుతున్నారన్నారు. 'ఎన్నికల కమిషన్ పూర్తిగా ఏకపక్షంగా ఉంది. వారు ఏమి చేసినా, పారదర్శకత లేదు, అందువల్ల, ఈ ప్రక్రియ ప్రశ్నార్థకం. ఏదేమైనా, మేము బిహార్ అంతటా అన్ని చోట్ల నుండి అన్ని డేటాను సేకరించి, వాస్తవాలను బహిర్గతం చేస్తామన్నారు. ఎన్నికలు 'న్యాయంగా లేవు' అని గాంధీ చేసిన వ్యాఖ్యల గురించి ప్రశ్నించగా, వేణుగోపాల్ మాట్లాడుతూ, తాము ఎన్నికల కమిషన్ (పాత్ర) గురించి మాట్లాడుతున్నామని, హర్యానా ఎన్నికల సమయంలో దీని గురించి లేవనెత్తామని, హర్యానా ఎన్నికలు రిగ్గింగ్ చేయబడ్డాయన్నారు. తాము ఆధారాలతో ముందుకు వచ్చామని, ఎన్నికల కమిషన్ తమ ఆధారాలపై ప్రశ్నించచమని కోరామమన్నారు. బిహార్ ఎన్నికలపై కూడా ఖచ్చితమైన ఆధారాలతో మందుకు వస్తామన్నారు. బిహార్ ఎన్నికల ఫలితం ఆశ్చర్యకరంగా ఉందని, ఎన్నికలు ప్రారంభం నుండే న్యాయంగా జరగలేదు, అందుకే పార్టీ పెద్దగా ఏమీ సాధించలేకపోయిందని ఆయన పేర్కొన్నారు.

### 96 లక్షల మంది ఫాలోవర్లు
## 50వేల ఓట్ల తేడాతో ఓటమి

**పట్నా:** బీహార్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రముఖ యూట్యూబర్ మనీశ్ కశ్యప్ ఓటమి చెందారు. చన్‌పటియా నియోజకవర్గంలో జన్‌సురాజ్ అభ్యర్థిగా పోటీ చేసిన మనీశ్... 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. సోషల్ మీడియాలో గొప్ప ప్రజాదరణ, 96 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నప్పటికీ అనుభవజ్ఞులైన రాజకీయ ప్రత్యర్థులను ఆయన అధిగమించలేకపోయారు. బీహార్ ఎన్నికల్లో చన్‌పటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ రంజన్ బీజేపీ అభ్యర్థి ఉమాకాంత్ సింగ్‌పై 37 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ స్థానం నుంచి పోటీ చేసిన 34 ఏళ్ల యూట్యూబర్ మనీశ్ కశ్యప్ 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. బీహార్‌కు చెందిన ఆయన యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పాపులారిటీని సంపాదించుకున్నారు. బీహార్ వలస కూలీలపై తమిళదులో దాడులు జరుగుతున్నాయంటూ 2023లో వీడియోలు రూపొందించడంతో మనీశ్ వార్తల్లో నిలిచారు. వలస కూలీలపై తమిళనాడులోని ప్రజలు దాడులు చేసి చంపుతున్నారంటూ మనీశ్ రూపొందించిన వీడియోలు 2023లో కలకలం సష్టించడంతో తమిళనాడు, బీహార్ పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో అవి నకిలీ వీడియోలుగా తేలడంతో వలసకూలీలపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో అప్పట్లో తమిళనాడు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. 2024లో మనీశ్ బీజేపీలో చేరారు. అనంతరం జన్‌సురాజ్ పార్టీలో చేరి... చన్‌పటియా నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

### బిహార్‌లో రెబల్స్‌పై
## బిజెపి చర్యలు..
### మాజీ మంత్రితో సహా ముగ్గురు నేతలు సస్పెన్షన్



**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత రెబల్స్‌పై బిజెపి దృష్టి సారించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్న కేంద్ర మాజీ మంత్రితో సహా ముగ్గురు నేతలను సస్పెండ్ చేసింది. బిహార్‌కు చెందిన సీనియర్ నేత, కేంద్రమాజీమంత్రి ఆర్‌కె సింగ్, శాసనమండలి సభ్యుడు అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌కు షోకాజ్ నోటీసులు పంపింది. పార్టీ నుంచి వారిని ఎందుకు బహిష్కరించకూడదో వారంలోపు వివరణ ఇవ్వాలని బిహార్ బిజెపి ప్రధాన కార్యాలయం ఇన్‌చార్జ్ అరవింద్ శర్మ ఆ నోటీస్‌లో కోరారు. కాగా, అర్రా మాజీ ఎంపి అయిన ఆర్‌కె సింగ్, 2024 ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి బిజెపితోపాటు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. ఎన్‌డిఎ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మాజీ దౌత్యవేత్త అయిన ఆయన మన్మోహన్ సింగ్ హయాంలో హోం కార్యదర్శిగా ఉన్నారు. 2013లో బిజెపిలో చేరారు. 2014, 2019లో రెండుసార్లు అర్రా నుంచి ఎంపిగా గెలిచారు. 2017లో మోదీ తొలి మంత్రివర్గంలో విద్యుత్ మంత్రిగా పనిచేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన స్థానాన్ని కోల్పోయారు.

మొత్తం సీట్లు 243, మానజిక్ సంఖ్య 123, ఎన్‌డిఎ–202,ఎంజిబి–35

## బిహార్ ఎన్నికల ఫలితాల తీరు– తెన్ను (2025)

| పార్టీ | గెలిచిన స్థానాలు | పోలైన మొత్తం ఓట్లలో వాటా(శాతం) | పోటీచేసిన సీట్లలో ఓటు వాట(శాతం) | గత ఎన్నికలతో పోల్చితే(+) పెరుగుదల, (–)తగ్గుదల సీట్లు |
|---|---|---|---|---|
| బిజెపి | 89 | 20.6 | 48.5 | +15 |
| జెడియు | 85 | 20.3 | 46.5 | +42 |
| ఎల్‌జెపి(ఆర్‌వి) | 19 | 4.6 | 43.4 | +18 |
| ఇతరులు | 9 | – | – | +5 |
| ఎన్‌డిఎ మొత్తం | 202 | 46.7 | – | – |
| ఆర్‌జెడి | 25 | 22 | 38.9 | –50 |
| కాంగ్రెస్ | 6 | 8.9 | 34.4 | –13 |
| సిపిఐ(ఎంఎల్)ఎల్ | 2 | 3.2 | 35.6 | లెఫ్ట్–14 |
| ఇతరులు(సిపిఐ(ఎం)1) | 2 | 3.4 | 27.1 | – |
| మహాగట్బంధన మొత్తం | 35 | 375 | – | – |
| ఎఐఎంఐఎం5 | 2 | 16.2 | | |
| జెఎస్‌పి | 0 | 3.4 | 3.5 | |
| ఇతరుల | 1 | 10.4 | 10.8 | |

2020తో పోల్చితే పార్టీల ఓట్ల శాతంలో (+) పెరుగుదల(–) తరుగుదల.
బిజెపి +0.28 శాతం, జెడియు + 3.55, ఎల్‌జెవి(ఆర్‌వి) –0.81 శాతం
ఆర్‌జెడి–0.5శాతం, కాంగ్రెస్– 0.87, వామపక్షాలు–0.3శాతం

## మహిళలకు నగదు బదిలీ వల్లే...
### ఎన్‌డిఎ విజయంపై జన్ సురాజ్ పార్టీ వెల్లడి



**పట్నా:** బీహార్ అసెంబ్లీలో ఖాతా తెరవడంలో విఫలమైన మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పార్టీ జన్ సురాజ్ శనివారం తన ఎన్నికల పరాజయంపై నిరాశ వ్యక్తం చేసింది. మహిళల ఖాతాలకు నగదు బదిలీ ఎన్డీయే విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని పేర్కొంది. రాష్ట్రంలో నిరుద్యోగం, వలసలు, పరిశ్రమల కొరత వంటి ముఖ్యమైన సమస్యలను లేవనెత్తుతూ భారీ ప్రచారం చేసినప్పటికీ, పార్టీ తనకు అనుకూలంగా ఓట్లను సముపార్జించుకోలేకపోయింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'అసెంబ్లీ ఎన్నికల ఫలితంతో మేము నిరాశ చెందాము. కానీ కలత చెందలేదు. మేము ఒక్క సీటు కూడా గెలవకపోయినా అధికార ఎన్డీఏను వ్యతిరేకిస్తూనే ఉంటాము' అని తెలిపారు. బీహార్‌లోని ముస్లిం ఓటర్లను ఒప్పించడంలో పార్టీ విజయం సాధించలేకపోయిందని ఆయన అన్నారు. 'ప్రజలు ఆర్‌జేడీ తిరిగి రావాలని కోరుకోలేదని కూడా ఈ తీర్పు రుజువు చేస్తుంది' అని సింగ్ తెలిపారు. బీహార్‌లో అధికార ఎన్డీఏ ప్రభుత్వం మహిళల ఖాతాలకు రూ.40 వేల కోట్ల నగదు బదిలీ చేయడం దాని విజయంలో 'ముఖ్యమైన పాత్ర' పోషించిందని చెప్పారు. బీహార్ ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన గురించి ప్రస్తావిస్తూ, దీని కింద రాష్ట్రంలోని మహిళల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు బదిలీ చేశారని అన్నారు. 'ఇది ఎన్నికలకు ముందు ప్రజలకు లంచం ఇవ్వడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నం. ఓట్లను కొనుగోలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత కూడా నగదు ప్రయోజనాలను బదిలీ చేశారు' అని ఆయన ఆరోపించారు. జన్ సురాజ్ నాయకుడు మాట్లాడుతూ 'ఇప్పుడు మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల ఖాతాలకు ఎలా బదిలీ చేస్తుందో చూడటానికి మేము వేచి ఉన్నాము' అని అన్నారు. బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏకు 50 శాతం ఓట్లు కూడా రాలేదని ఆయన తెలిపారు. జేడీ(యూ) 25 కంటే ఎక్కువ సీట్లు గెలుచుకున్నందున ప్రశాంత్ కిశోర్ రాజకీయాల్లో చురుకుగా ఉంటారా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, 'మీరు ఈ ప్రశ్న కిశోర్‌ను మాత్రమే అడగాలి' అని సింగ్ అన్నారు. నితీశ్ కుమార్ నేతత్వంలోని జెడియు 25 కంటే ఎక్కువ సీట్లు గెలిస్తే తాను రాజకీయాలను వదిలివేస్తానని కిషోర్ గతంలో ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలలో జేడీ(యూ) 85 సీట్లు గెలుచుకుంది.

### బిహార్ 'ఎస్ఐఆర్'లో గుర్తింపు రుజువుగా ఆధార్‌ను ఉపయోగించడంపై...
## సుప్రీంకోర్టుకు 'ఇసి' వెల్లడి
### ఇప్పటికే సూచనలు జారీ అయ్యాయి..



**న్యూఢిల్లీ :** బిహార్‌లో సవరించిన ఓటరు జాబితాలో చేర్చడానికి లేదా మినహాయించడానికి ఆధార్‌కార్డును పౌరసత్వానికి కాకుండా గుర్తింపు రుజువుగా ఉపయోగించాలని ఇప్పటికే సూచనలు జారీచేసినట్లు భారత ఎన్నికల సంఘం (ఇసి) సుప్రీంకోర్టుకు తెలిపింది. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఓటర్ల జాబితాను నవీకరించడానికి ఆధార్ వాడకాన్ని సెప్టెంబరు 8న కోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని పోల్ ప్యానెల్ తెలిపింది. 1950 ప్రజాప్రాతినిథ్య చట్టం యొక్క సెక్షన్ ఆర్‌పిఎలోని 23(4) ప్రకారం గుర్తింపును స్థాపించడానికి ఆధార్ కార్డును ఉపయోగించాలని కోర్టు తెలిపినట్లు పేర్కొంది. ఆర్‌పిఎలోని సెక్షన్ 23 ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడానికి సంబంధించినది. 'పైన పేర్కొన్న ఉత్తర్వులను అనుసరించడం ద్వారా, బిహార్ రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేర్చడం లేదా మినహాయించడం కోసం ఆధార్ కార్డును గుర్తింపు రుజువుగా, పౌరసత్వ రుజువుగా ఉపయోగించమని బిహార్‌లో ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ)కి 2025 సెప్టెంబరు 9నాటి సూచనలను కమిషన్ జారీ చేసింది' అని ఎన్నికల సంఘం తెలిపింది.1950 ఆర్‌పిఎలోని సెక్షన్ 23(4) స్ఫూర్తితో ఆధార్‌ను సంస్థ స్థాపన, ప్రామాణీకరణ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలని ఉద్దేశించాలని న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్‌పై ఎన్నికల సంఘం (ఇసి) తన సమాధానం దాఖలు చేసింది.2023 ఆగస్టులో భారత విశిష్ట ప్రాధికార సంస్థ (యుఐడిఎఐ) ఒక కార్యాలయ మెమోరాండం (ఒఎం)లో ఆధార్‌పుట్టిన తేదీకి రుజువుకాదని, రుజువు భారం ఆధార్ హోల్డర్ పైనే ఉంటుందని స్పష్టంచేసిందని ఎన్నికల సంఘం తెలిపింది. బాంబే హైకోర్టు ఒక తీర్పులో ఒఎం ను ప్రస్తావించిందని, ఇది వాస్తవానికి పుట్టిన తేదీకి రుజువు కాదని, పుట్టిన తేదీ ప్రూఫ్ ఆధార్ హోల్డర్‌పై ఆధార్ పడి ఉంటుందని పేర్కొంది. 2025 సెప్టెంబరు 8న ఇచ్చిన ఉత్తర్వు ద్వారా ఈ కోర్టు ఓటరు జాబితాలో చేర్చడం, మినహాయించడం కోసం ఆధార్ వాడకాన్ని ఇప్పటికే స్పష్టం చేసిందని హైలెట్‌చేయడం ముఖ్యం అని ఎన్నికల సంఘం చెప్పింది. అక్టోబరు 7న అత్యున్నత న్యాయస్థానం ఉపాధ్యాయుల దరఖాస్తుపై నోటీస్ జారీచేసింది. ఆధార్ పౌరసత్వం నివాసానికి రుజువు కాదని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే చెప్పిందని ధర్మాసనం గమనించింది. దేశవ్యాప్తంగా తప్పకుండా ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లో ఈ దరఖాస్తు దాఖలైంది.

## నిధుల పంపిణీకి అనుమతించడమేంటి?
### ఇసిని ప్రశ్నించిన శరద్‌పవార్



**బారామతి (మహారాష్ట్ర):** బీహార్ ఎన్నికలలో ఎన్డీఏ విజయంలో మహిళల కోసం వ్యవస్థాపకత పథకం పాత్ర పోషించిందని ఎన్‌సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిధుల పంపిణీని ఎలా అనుమతించిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్నికలలో బీజేపీజేడీ(యూ) కలయిక అఖండ విజయం సాధించిన ఒక రోజు తర్వాత శనివారం ఇక్కడ పవార్ విలేకరులతో మాట్లాడుతూ 'బీహార్ ఎన్నికల ఫలితం (ముఖ్యమంత్రి) నితీశ్ కుమార్ అంచనా వేసిన దానికంటే భిన్నంగా లేదు. మహిళలు ఎన్నికలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ చేసే పథకం ఎన్డీఏకి అనుకూలమైన ప్రభావాన్ని చూపిందని నేను ఇంతకు ముందే భావించాను' అని అన్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన గురించి ఆయన ప్రస్తావిస్తూ 'బీహార్ ప్రభుత్వం ఈ పథకం కింద డబ్బు పంపిణీ చేయడం సరైనదేనా అని ఎన్నికల కమిషన్ ఆలోచించాలి' అని అన్నారు. భవిష్యత్ ఎన్నికలలో బీహార్ నమూనా అమలు సాధ్యమేనా అనే దానిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'మహారాష్ట్ర ఎన్నికల సమయంలో కూడా ఆ మొత్తాన్ని (లడ్కీ బహిన్ పథకం కింద) అధికారికంగా మహిళల ఖాతాలకు జమ చేశారు. పాలక పార్టీలు ఎన్నికలలో ఇలాంటి పద్ధతిని ఉపయోగిస్తే, అది ప్రజల విశ్వాసాన్ని అలాగే ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తుందని' అని అన్నారు. స్థానిక సంస్థలకు రాబోయే ఎన్నికల కోసం ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతత్వంలోని ఎన్‌సీపీ(ఎస్పీ), ఎన్‌సీపీ మధ్య పొత్తులు ఏర్పడే అవకాశం ఉన్నాయనే ప్రశ్నలకు పవార్ ప్రత్యక్ష సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారు. 'ఏ జిల్లాలలో అయినా (ఎన్‌సీపీ) రెండు వర్గాల మధ్య పొత్తుపై) చర్చలు జరుగుతున్నాయని నాకు తెలియదు. ఎన్‌సీపీ (ఎస్పీ) లో జరిగిన చర్చల ప్రకారం, నగర పంచాయతీ, పంచాయతీ సమితి ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు (కూటమి ఏర్పాటుపై) నిర్ణయం తీసుకుంటారు' అని ఆయన తెలిపారు.

### వైద్యకళాశాలల్లో పిజి సీట్లు ఖాళీలపై ఒక యంత్రాంగాన్ని రూపొందించేలా..
## జాతీయవైద్యకమిషన్ ఆదేశించాలన్న పిటిషన్‌ను 'రేపు' 'సుప్రీం'లో విచారణ



**న్యూఢిల్లీ :** దేశంలోని వైద్య కళాశాలల్లో ప్రీ క్లినికల్, పారాక్లినికల్ బ్రాంచ్‌లలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు ఖాళీగా ఉండకుండా పర్యవేక్షించే ఒక యంత్రాంగాన్ని రూపొందించేలా జాతీ య వైద్య కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రీక్లినికల్, పారా క్లినికల్ బ్రాంచ్‌లలో గత ఐదు సంవత్సరాలుగా ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయనే విషయమై డేటా సమర్పించాలని కమిషన్‌ను ఆదేశించాలని కూడా పిటిషన్ కోరింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ ఏడాది జనవరిలో ప్రత్యేక పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు గమనించిన అత్యున్నత న్యాయస్థానం వైద్య కోర్సు ల్లో సీట్లు ఖాళీగా ఉండకూడదని సుప్రీంకోర్టు సూచించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి రాష్ట్రాలు సహా సంబంధిత వాటాదారులతో సమావేశం నిర్వహించాలని కేంద్రాన్ని కోరింది. 2023 ఏప్రిల్‌లో వైద్య కోర్సుల్లో సూపర్ స్పెషాలిటీ సీట్లు భర్తీకాకుండా ఉండటంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన రాష్ట్రాలు, ప్రైవేట్ మెడికల్ కాలేజీల ప్రతినిధులు సహా అందరు వాటాదారులతో కూడినఒక కమిటీని నియమించాలని అప్పట్లో కేంద్రం ప్రతిపాదించింది.


SHRIRAM Finance
**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**


సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS04UB 9335 | Kummajeela Venkatesh | TATA LPTK 3118 FBT-T | 2016 |
| 2 | TS31T 0383 | Alle Deepanjali | AL 3718IK FBT | 2016 |
| 3 | TS25T 3031 | Mykamalla Veeraswamy | SONALIKA DI 740 | 2018 |
| 4 | AP01AC 1479 | Vinod Kumar Kondra | INDICA VISTA AQUA 1.3 QUADRAJET DIESEL 5 SEATER | 2011 |

AUCTION DATE : 22-11-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426




## శక్తివంతమైన సౌర విస్ఫోటనం



సూర్యుడు గతంలో ఎన్నడూ లేని రీతిలో విడుదల చేసిన అత్యంత శక్తివంతమైన సౌర విస్ఫోటనం ఈనెల 11న జరిగింది. దీని ప్రభావంతో, ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఆకాశంలో అద్భుత కాంతి పుంజాలు కనిపించాయి. సూర్యునిపై ఉన్న ఎఆర్4274 అనే సన్‌స్పాట్ నుంచి భారీ స్థాయిలో ఎక్స్ 5.1 తరగతి సౌర ఫ్లేర్ విస్ఫోటనం సంభవించింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' సోలార్ అబ్జర్వేటరీ, ఎన్ఒఎఎ నిర్వహిస్తున్న స్పేస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వంటి పరిశీలనా కేంద్రాలు ఈ సౌర విస్ఫోటనాన్ని గుర్తించాయి. ఇది భారీ స్థాయిలో ఎక్స్ కిరణాలను, అల్ట్రావయొలెట్ కాంతి వికిరణాలను విడుదల చేసింది. ఈ అధిక శక్తి గల కణాలు యూరప్, ఆఫ్రికా ప్రాంతాల్లో ఆర్3 స్థాయి రేడియో బ్లాక్‌అవుట్లకు కారణమయ్యాయి. దీని ఫలితంగా సూర్యుని వైపు ఉన్న భూమి భాగంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. అక్కడితో ఆగకుండా, ఈ విస్ఫోటనం తర్వాత వరుసగా మూడు శక్తివంతమైన కరోనా మాస్ ఎజెక్షన్లు (సిఎంఇ) సూర్యుని నుండి భూమివైపు దూసుకువచ్చాయి. ఎన్ఒఎఎ అంచనా ప్రకారం, వీటిలో మూడవ సిఎంఇ అత్యంత వేగవంతమైనది. అమితమైన శక్తివంతమైనది. ఈ సంఘటన ప్రత్యేకత దాని పరిమాణంలోనే కాదు, సమయానికీ ఉంది. ఇది సౌర చక్రం తన అత్యుత్తమ దశ అయిన 'సోలార్ మాక్సిమమ్'కు చేరడాన్ని సూచిస్తున్నది. కాగా, సూర్యుడు విడుదల చేసే ఇలాంటి శక్తి ఏ విధంగా భూగోళాన్ని ప్రభావితం చేస్తుందనే విషయంపై శాస్త్రవేత్తలు పరిశోధలు చేస్తున్నారు.

## ఆదర్శ దంపతులు..



విడాకుల కేసులు విపరీతంగా పెరుగుతున్న నేటి కాలంలో ఫ్లోరిడాలోని మియామీ (అమెరికా)కి చెందిన లైల్, ఎలెనార్ గిట్టెన్స్‌లను ఆదర్శ దంపతులుగా పేర్కోవాలి. లైల్ వయసు 108 సంవత్సరాలుకాగా, భార్య ఎలెనార్ అతని కంటే ఒక ఏడాది చిన్నది. ఈ ఏడాది జూన్‌లో వీరిద్దరూ తమ 83వ



వివాహ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ జంటగా గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించారు. సుదీర్ఘమైన వారి దాంపత్య జీవితంలో ఆటుపోట్లు ఎదురుకాలేదనిగానీ, వాగ్వాదాలు జరగలేదనిగానీ, మనస్పర్థలు రాలేదనిగానీ చెప్పలేం. కానీ, సరైన అవగాహన, పరస్పరం ప్రేమానురాగాలు ఉంటే, సమస్యలను అధిగమించడం కష్టం కాదని ఈ దంపతులు నిరూపిస్తున్నారు. విడాకుల కేసులు అధికంగా నమోదయ్యే అమెరికాలో 83 సంవత్సరాల వైవాహిక సంబంధం ఒక అద్భుతం. అందుకే, లైల్, ఎలెనార్ ఆదర్శదంపతులయ్యారు.

## ఇథియోపియాలో 'హైనా మ్యాన్'



ఒక ఆలోచన సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడమేకాదు... సంప్రదాయంగా కూడా మారుతుంది. ఇథియోపియాకు చెందిన యూసుఫ్ ముమే సల్లే అనే వ్యక్తిని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'హైనా మ్యాన్'గా ప్రసిద్ధి చెందిన యూసుఫ్ 1960 దశకాల్లో తన ఊరు హరార్‌లోని పశువులపై హైనాలు దాడి చేయడాన్ని గమనించాడు. వాటిని ఎదుర్కోవడం అసాధ్యమని గ్రహించాడు. పశువులను నష్టపోకుండా ఉండాలంటే, హైనాలను మచ్చిక చేసుకోవడం ఒకటే మార్గమని నమ్మాడు. అప్పటినుంచి హైనాలకు ఆహారం పెట్టడం మొదలు పెట్టాడు. తర్వాతి కాలంలో ఇది ఒక సంప్రదాయంగా మారింది. అతని కుమారుడు అబ్బాస్ యూసుఫ్ కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నాడు. హైనా దాడుల నుండి పశువులను కాపాడేందుకు, ఊరి పొలిమేరల్లో మిగులు మాంసాన్ని, చర్మాన్ని ఉంచుతారు. దీనితో హైనాలు ఊరులోకి రాకుండా ఆ ప్రాంతానికి దూరంగా ఉంటాయి. హైనాలకు ఆహారం సమర్పించడం అక్కడ ఒక నమ్మకంగా మారింది. హైనాలు కూడా ఊరిమీద పడకుండా, ఆహారం కోసం ఓర్పుతో వేచి చూస్తాయి. హైనాలతో మనుషులకు సఖ్యత ఉండేదని జానపద కథల్లో మాత్రమే ఉంటుందనుకునే వారికి యూసుఫ్ ప్రవేశపెట్టిన విధానమే సమాధానమిస్తుంది. హైనాలు అతనితో చాలా సన్నిహితంగా ఉండేవి.

## మంచు ఫలకాల కింద అగ్నిపర్వతాలు!



అంటార్కిటికా మంచు ఫలకాల కింద అగ్నిపర్వతాలు ఉన్నాయి. అవి కూడా రెండో, మూడో కాదు. 138కి పైగా అగ్నిపర్వతాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అంటార్కిటికా ఆగ్నేయ ప్రాంతంలోని 'వెస్ట్ అంటార్కిటిక్ ఐస్ షీట్' కింద పలు అగ్ని పర్వతాలను ఎడన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మంచు పరిశోధక రాడార్లు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా, మంచి ఫలకాల కింద సుమారు నాలుగు కిలోమీటర్ల మందమైన మంచు కింద 91 అగ్ని పర్వతాలను గుర్తించారు. ఈ పర్వతాలు 3,800 మీటర్లకు పైగా ఉన్నవిగా ఉన్నట్లు తెలుసుకున్నారు. అంటే ఇవి యూరప్ లోని ఆల్ప్స్ పర్వతాలకు పోటీ ఇచ్చే స్థాయిలో ఉన్నాయి. కాగా, వెస్ట్ అంటార్కిటిక్ రిఫ్ట్ సిస్టమ్‌లోని టెక్టానిక్ బెల్ట్‌లోనూ ఈ అగ్నిపర్వతాలు వ్యాపించి ఉన్నాయి. ప్రస్తుతానికి అవి నిశ్చలంగా ఉన్నప్పటికీ, పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ తదితర కారణాల వల్ల అంటార్కిటికాలో మంచు వేగంగా కరుగుతున్నది. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే, మంచు ఫలకాల కింద ఉన్న మంచు పర్వతాలు విస్ఫోటనం చెందే ప్రమాదం లేకపోలేదు.

— బిఎస్ఎస్ మైత్రేయి

# మహాగట్బంధన్‌కు గుణపాఠాలు

శుక్రవారం వెలువడిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎన్‌డిఎ అభిమానుల ఊహలను, ఎగ్జిట్ పోల్స్ జోస్యాలను తలదన్నుతూ చేస్తూ పాలక ఎన్‌డిఎకి ఏకపక్షంగా ఉండటం ఆశ్చర్యకరం. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో (ఎస్ఐఆర్) ఎస్‌సి, ఎస్‌టి, దళిత, మైనారిటీ ఓట్ల తొలగింపుకు బిజెపికి సహకరించిందని ఎన్నికల కమిషన్ తీవ్రమైన ఆరోపణలకు గురైన నేపథ్యంలో పాలక ఎన్‌డిఎ కూటమి 202 సీట్లతో ఘన విజయం సాధించటం ప్రతిపక్షాల సంశయాలకు బలం చేకూర్చుతుంది. ఎన్నికల కమిషన్ తొలుత 65లక్షల ఓట్లు తొలగించింది. ఒకవైపు సుప్రీంకోర్టులో న్యాయపోరాటం, రాహుల్‌గాంధి 'ఓట్ అధికార్ యాత్ర' నేపథ్యంలో ప్రచురించిన ముసాయిదా జాబితాలో ఆ తొలగింపు 47లక్షలకు తగ్గింది. ఇలాంటి గందరగోళాలు చివరిదాకా ఉన్నాయి. ఓటర్ల జాబితాలు పూర్తిగా సవ్యంగా ఉండటం, ఎన్నికల కమిషన్ లేదా స్థానిక ఎన్నికల అధికారులు పాలక పార్టీకి ఎంతో కొంత అనుకూలంగా వ్యవహరించటం మన ఎన్నికల వ్యవస్థలో కొత్తేమీకాదు. ఎన్నికల కమిషన్ సహకారంవల్లనే ఎన్‌డిఎకి ఈ అనూహ్య ఫలితాలు లభించాయని నిందించలేనంతగా ప్రజలు దిగ్భ్రాంతిగొలిపే తీర్పు ఇచ్చారు. మహాగట్బంధన్‌కు మరీ దారుణమైన ఫలితాలు వచ్చాయి. అధికారంకోసం పోరాటం చేసిన కూటమి 35సీట్లకు పరిమితంకావటం ఊహించని దెబ్బ. కాబట్టి నామినేషన్‌ల సమయందాకా సీట్ల పంపిణీపై అంగీకారానికి రాలేకపోవటం, కొన్ని స్నేహ పోటీలు ఉండటం, ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనవసరపు జగడంతో కాలహరణం, ప్రచారంలో సమన్వయలోపం ఇత్యాది లోపాలపై కూటమి భాగస్వాముల్లో ఆత్మవిమర్శ అవసరం. ఎన్నికల కమిషన్ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తదుపరి, తొలగింపులు, మినహాయింపులు సరిగ్గా జరిగాయో లేదో ఇంటింటి వెరిఫికేషన్ చేసి అర్హుల దరఖాస్తులు సమర్పించని బలహీనత గట్బంధన్ సంస్థాగత నిర్మాణ రాహిత్యానికి అద్దం పడుతున్నది. కేవలం కుల పొందికల కూర్పు, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం, తమ అనుకూల గాలి సృష్టించటం ద్వారానే బలమైన ప్రత్యర్థిని ఓడించగలమని భావించినట్లున్నారు. అది బెడిసికొట్టింది. మొత్తం మీద పోలైన ఓట్ల శాతం సరికొత్త శిఖరాన్ని చేరింది. మహిళల ఓట్ల పోలింగ్ పురుషులను అధిగమించి 70శాతం దాటింది. కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. అంతిమంగా ఇరు పక్షాల మధ్య ఓటింగ్ వ్యత్యాసం గత ఎన్నికల్లోని అతి తక్కువ స్థాయినుంచి గరిష్టంగా 9.2శాతానికి చేరింది. ఎందుకిలా జరిగిందో ఆత్మవిమర్శనా పూర్వక విశ్లేషణ అవసరం.

ప్రజాపక్షం
16-11-2025, ఆదివారం

మహిళలు, యువత ఎన్‌డిఎ తిరుగులేని విజయానికి కారణంగా స్పష్టమైంది. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ 20ఏళ్లపాలన సహజమైన ప్రభుత్వ వ్యతిరేకతకు బదులు సానుకూలత సృష్టించింది. దానికి ప్రధాని నరేంద్రమోదీ హిందూత్వ ఇమేజి, అభివృద్ధి ఎజండా, గతంలోని లాలు ప్రసాద్ పదేళ్ల పాలనను 'ఆటవిక రాజ్యం'గా ఆరోపిస్తూ ప్రజలను భయపెట్టటం, ముస్లిం వ్యతిరేకిగా అమిత్‌షా దృఢవైఖరి, కులాల కూర్పు (సామాజిక ఇంజినీరింగ్) ఇవన్నీ కుదురుకున్నాయి. ముందే సీట్లు పంచుకుని అరమరికలు లేని, ఐక్యత నిండిన కూటమిగా ఎన్‌డిఎ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

నితీశ్‌కుమార్ మహిళా అనుకూల కార్యక్రమాలు, పథకాలు, ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్‌తోపాటు ప్రధాని మోదీ రెండు నెలల ముదునుంచే పలు అభివృద్ధి పథకాలు ప్రకటించటం మహిళలు, యువకుల్లో భరోసా కల్పించింది. హిందీ బెల్టులో తమ చేతికి చిక్కని బిహార్‌పై కాషాయ జండా ఎగురవేసేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎంతో వ్యూహాత్మకంగా పనిచేశాయి. ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ, నితీశ్‌కుమార్‌ను కాదనలేని స్థితిలోనే ఉండిపోయింది. 10వ పర్యాయం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకారం ఖాయమైనట్లే. వయస్సు, ఆరోగ్యంరీత్యా నితీశ్ కాషాయ జండాకు ముఖ్యమంత్రి పదవి అప్పగించాలన్న వాదన ఇప్పటికి వాయిదా పడినట్లే.

అత్యంత వెనుకబడిన తరగతులకు ఆశాజ్యోతిగా నిస్వార్థమైన పరిపాలన అందిస్తున్న నితీశ్ కుమార్ కొన్నేళ్లుగా ప్రత్యేకించి మహిళలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మద్యపాన నిషేధం విధించారు. అమలులో ఎన్ని లోపాలున్నా నిస్సంశయంగా మహిళలు స్వాగతించారు. అలాగే పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు 25 శాతం రిజర్వేషన్ ప్రవేశపెట్టారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించారు. స్కూలు బాలికలకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. అన్నిటికీ మించి ఈ ఎన్నికల ప్రకటనకు కొద్దిరోజుల ముందు 'మహిళా రోజ్‌గార్ యోజన' ప్రకటించి కోటి పాతిక లక్షల మంది మహిళలకు రూ.10వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. వ్యాపారానికి ముందుకొచ్చే వారికి రూ.2లక్షలు ఇస్తామన్నారు. మహిళా గ్రూపుల సభ్యులు (జీవికలు) అలవెన్స్ పెంచారు. ఆ గ్రూపులు నితీశ్ కోసం పనిచేశాయి. మొత్తంమీద రాష్ట్రంలో పేదరికం తగ్గింది, శాంతి–భద్రతల్లో మెరుగుదల ఉంది. వీటికితోడుగా ప్రధాని మోదీ అనేక రహదారులు, రైలు, వంతెనలు ప్రారంభించారు, ప్రకటించారు. నిరుద్యోగం ప్రధాన సమస్యగా గుర్తించి 5లక్షలమంది పట్టభద్రులకు రెండేళ్లపాటు నెలకు రూ.1000 చొప్పున అలయెన్స్ పథకం ప్రకటించారు. యువతకోసం రూ.62 వేలకోట్ల పథకాలు ప్రకటించటంతోపాటు వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు వాగ్దానం చేశారు. మహిళలు–యువత కాంబినేషన్‌ను ఆకర్షించటంవల్ల ఓట్ల పోలింగ్‌లో కొత్త రికార్డు నమోదైంది. మహాగట్బంధన్ కూడా అనేక ఆకర్షణీయ పథకాలు ప్రకటించినా విశ్వసనీయత నితీశ్–మోదీ పైనే ఉండటం వల్ల ఎన్‌డిఎకు ఘనవిజయం చేకూరింది. ప్రతిపక్ష కూటమి వీటన్నిటినీ కూలంకషంగా చర్చించి గుణపాఠాలు తీసుకోవాలి. వచ్చే సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అప్రమత్తతతో ఉండటం, ఐక్యతతో పనిచేయటంపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

# ప్రజల ఆశాజ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ



(కీ.శే.)నల్లమల గిరిప్రసాద్

సిపిఐ శతవార్షికోత్సవం ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో పెద్ద ర్యాలీకి రాష్ట్రంలో ప్రచారం ప్రారంభమైన సందర్భంగా పార్టీ చరిత్రను సూక్ష్మంగా తెలిపే కామ్రేడ్ గిరిప్రసాద్ ఒక నాటి వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాం. ॥సం॥

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1848లో కమ్యూనిస్టు ప్రణాళికను ప్రకటించడంతో ప్రపంచంలో కమ్యూనిస్టు ఉద్యమ శకం ప్రారంభమైంది. బూర్జువా వర్గ దోపిడీ వ్యవస్థను తుదముట్టించాలని దాని స్థానంలో కార్మిక వర్గ రాజ్యం స్థాపించాలని అందుకోసం ప్రపంచ కార్మికులారా ఏకంకండి, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని రానున్న యుగం కార్మిక, కర్షక, మధ్యతరగతి, రైతు, కూలీ, పేద, దళిత, అణగారిన మహిళా వర్గానిదేనని వెన్నుతట్టి లేపారు. 1917 వరకు అనేక దేశాలలో ముఖ్యంగా యూరప్ ఖండంలో ఉద్యమాలు పెల్లుబికినప్పటికి అవి విజయవంతం కాలేకపోయాయి. చరిత్ర ప్రసిద్ధికెక్కిన 'పారిస్ కమ్యూన్' అది దోపిడీ వర్గ ఎదురు దాడుల నుంచి రక్షించుకోలేకపోయింది. సరిగ్గా ఆ దశలో 1917 సంవత్సరంలో వి.ఐ.లెనిన్ అత్యంత విశాలమైన రష్యా దేశంలో కమ్యూనిస్టు జెండాను ఎగురవేశాడు. ఆ కాలానికి పెట్టుబడిదారి వ్యవస్థ సామ్రాజ్యవాద దశకు చేరుకుందని, అదే దాని చరమ దశ అని, సామ్రాజ్యవాద వ్యవస్థ గొలుసులో అత్యంత బలహీనమైన దేశంలో లేక దేశాలలో కార్మిక వర్గ విప్లవాలు జయప్రదమై తీరుతాయని పరిశోధించి, పరిశీలించి సిద్ధాంతపరంగా మార్క్సిజానికి నూతన వన్నె తెచ్చాడు. మార్క్స్ ఏంగెల్స్ కాలంనాటి మార్క్సిజం, మార్క్సిజం–లెనినిజంగా రూపాంతరం చెందింది. జార్ చక్రవర్తి అంతమై బూర్జువా వర్గ రాజ్యాధికారం తొలగించబడింది. సోవియట్ రిపబ్లిక్‌లతో సోషలిస్టు రాజ్యం ఏర్పడింది. 14 సామ్రాజ్యవాద దేశాలు సోవియట్‌పై నాలుగేళ్ల పాటు అంతర్యుద్ధ జ్వాలలు లేపాయి. ఇవన్నీ ఓడింపబడినాయి. తర్వాత 20 సంవత్సరాలకు ప్రపంచ ఆధిపత్యం కోసం బయలుదేరిన హిట్లర్ ఫాసిస్టు మూకలు సోవియట్‌పై దాడి చేశాయి. ఈ రెండవ ప్రపంచ యుద్ధంలో ఎర్ర సైన్యం రెండు కోట్ల మంది రక్తతర్పణలతో ఫాసిస్టు మూకలను నిలువరించాయి. 1945 మే నెలలో బెర్లిన్ కోటపై అరుణ పతాకాన్ని ఎగుర వేశాయి. ఉత్తర కొరియా సోషలిస్టు రాజ్యంగా ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధ అనంతరం భారతదేశంతో సహా 70 దేశాలు సామ్రాజ్యవాద వలస పాలన నుండి స్వాతంత్ర్యవాయువులు పీల్చుకున్నాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం గతి నేడేమైందో మనందరికి తెలుసు.

స్వాతంత్ర్య అనంతరం అనేక దేశాలు సోషలిస్టు దేశాలుగా ఇంకా ఆ భావాలు గల దేశాలుగా ప్రయాణం చేశాయి. ఆ గమనంలో ప్రపంచంలో రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఆవిర్భవించాయి. ఒకటి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ, రెండు పెట్టుబడిదారి వ్యవస్థ. దీనిని పెట్టుబడిదారి వర్గం నుండి సోషలిస్టు దశకు మార్పు చెందే దశగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అభిప్రాయపడింది. సోషలిస్టు వ్యవస్థలో నిరుద్యోగం, పేదరికం, నిరాక్షరాస్యత కనిపించేవి కావు. శ్రమ కొలది శక్తి, అవసరం కొలది భుక్తి అనే సూత్రంతో తన కోసం, సమాజం కోసం స్వచ్ఛందంగా శ్రమించి వస్తువుల కొరత తీర్చాలని ఆ వైపు ప్రయాణం చేసింది. అయితే ఇందుకు భిన్నంగా అమెరికన్ సామ్రాజ్యవాదం కమ్యూనిజాన్ని నాశనం చేయాలని అణుబాంబులతో, నక్షత్రయుద్ధ పథకాలతో నవ నాగరికతతో విరాజిల్లుతున్న ప్రపంచాన్ని బూడిద గుట్టగా మార్చాలని ప్రయత్నం చేసింది. అయితే సోవియట్ యూనియన్ అమెరికన్ సామ్రాజ్యవాద అణుయుద్ధ నివారణకు, ప్రపంచ శాంతి పరిరక్షణకు నడుంబిగించింది. సర్వ మానవులకు సౌభాగ్యాలు చేకూర్చగల సామాజిక వ్యవస్థ కోసం అణ్వాయుధ యుద్ధ నివారణకు కమ్యూనిస్టు ఉద్యమమే శ్రీరామ రక్షగా నిలబడింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాద కాలంలోనే రష్యా విప్లవ విజయాలకు ప్రభావితులైన అనేక మంది విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. అలా ఏర్పడ్డ కమ్యూనిస్టు గ్రూపులపై బ్రిటిష్ వారు తీవ్ర నిర్బంధ చర్యలకు పూనుకున్నారు. వారిపై 1922 –24 సంవత్సరాలలో పెషావర్, కాన్పూర్, మీరట్ కుట్ర కేసులు బనాయించారు. ఈ నిర్బంధ కాండను ధిక్కరించి అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై కాన్పూర్‌లో డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. కాంగ్రెస్ పార్టీ తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర కలిగినది సిపిఐ. ఈలోగా భారత రాజకీయ రంగంలో లేక స్థానికంగా అనేక



రాజకీయ పార్టీలు పుట్టినవి, గిట్టినవి ఉన్నాయి. ఇందులో కొన్ని పార్టీలకు చరిత్ర లేకపోగా భవిష్యత్తు కూడా సామాజిక, పురోగమి లక్ష్యాలు లేకుండా వ్యక్తుల ప్రయోజనాలకు సంకుచిత ఆశయాలకు ఏర్పడ్డాయి. అవి ఎంత తళుక్కున ఎగురుతాయో అంత త్వరితంగానే ముగుస్తాయి. భారత కమ్యూనిస్టు పార్టీ 1925 సంవత్సరంలోనే సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం చేసిన తొలి రాజకీయ పార్టీ. 1927 మద్రాస్ సభలో గాని కాంగ్రెస్ ఈ తీర్మానం చేయలేదు. కాంగ్రెస్ రాజకీయాల్లో అతివాద మార్పులు తెస్తున్న కమ్యూనిస్టులను దెబ్బకొట్టాలని బ్రిటిష్ పాలకులు మీరట్ కేసు, భగత్‌సింగ్ వంటి వారిపై లాహోర్ కుట్ర కేసులు విధించారు. ఇర్విన్‌తో 1931 రౌండ్ టేబుల్ సమావేశంలో భగత్‌సింగ్ ఆయన సహచరులని విడుదల చేయాలని గాంధి కోరలేదు. వారిని కనీసం ఉరి తీయవద్దని అడుగలేదు. అంతకు ముందు బ్రిటిష్ పాలకులు జలియన్‌వాలాబాగ్‌లో అనేక మంది ప్రజలను ఊచకోత కోశారు. బ్రిటిష్ పాలకుల గుండెలపై గురిచూసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆయన సహచరులను నిలువునా కాల్చిచంపారు. అందుకే గదర్ వీరులు, భగత్‌సింగ్ సహచరులు, చిట్టగాంగ్ ఆయుధాగారంపై దాడి చేసిన వీరులు ఒకరేమిటి జాతీయ విప్లవకారులందరూ కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఆది నుంచి అంతం వరకు అకుంఠిత దీక్షతో మహోజ్వల పాత్ర నిర్వహించారు.

**కమ్యూనిస్టు పార్టీ అద్వితీయ స్థానం :**

కమ్యూనిస్టు పార్టీకి ఈ రాష్ట్రంలో అద్వితీయ స్థానం ఉంది. తెలుగు జాతిని ఏకం చేయడానికి, ఆంధ్ర భాషా సాంస్కృతిక పునరుజ్జీవనానికి, వికాసానికి బాటలు వేసింది. గురజాడ, కందుకూరి, చిలకమర్తి వంటి వారి రచనలు వెలుగులోకి తెచ్చింది. మద్రాస్ రాష్ట్రాన్ని విడగొట్టి ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ముందుండి పోరాడింది. నైజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల వెన్నుతట్టి నిలబెట్టి సాయుధ పోరాటం నిర్వహించింది. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు వీర మరణం చెందారు. ఈ పోరాటంలో మూడువేల గ్రామాలు విముక్తి చేసి గ్రామ రాజ్యాలు ఏర్పాటు చేయడం జరిగింది. 10లక్షల ఎకరాల దొరల భూమి ప్రజల పరం చేయబడింది. జమీందారి, జాగీర్‌దారి వ్యవస్థకు గోరీ కట్టింది. తెలుగు, మరాఠి, కన్నడ భాషా ప్రజలకు వేర్వేరుగా, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతమైంది.

**ప్రజల ఆశాజ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ :**

నందికొండ శ్రీశైలంలో ఉన్న సిద్దేశ్వరం ప్రాజెక్టుకు దాని ద్వారా రాయలసీమకు నీళ్లివ్వాలంది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, భూ గరిష్ట పరిమితి చట్టం కోసం పోరాడింది. మిగులు భూములు పేదలకు పంచాలని కోరింది. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి, కృష్ణాజిల్లా నూజివీడు విస్సన్నలపేటల నుంచి ఆదిలాబాద్, బెల్లంపల్లి వరకు బినామి, బంజర భూములు పేద ప్రజలు ఆక్రమిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో అసంఘటితంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, చేనేత, గీత, బీడి కార్మికులను చైతన్యపరుస్తూ వారి దైనందిన సమస్యల కోసం పోరాడింది. సిపిఐ బొగ్గుగని కార్మికులు, ఆర్టీసి, జౌళి, జూట్, సిమెంట్ , చక్కెర ఫ్యాక్టరీ, అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార సంస్థల్లో ఇంకా అనేక వాటిల్లో పనిచేసే లక్షలాది కార్మికుల తరుపున పోరాడుతుంది. ధాన్యం, పత్తి, పొగాకు, వేరుశనగ వగైర పంటలకు గిట్టుబాటు ధర కావాలని, విద్యార్థి, యువజన, మహిళ, దళితుల, గిరిజన అభ్యున్నతికి నిత్యం పోరాటాలు నిర్వహిస్తుంది. పదరికుప్పం, కారంచేడు సంఘటనలను ఖండించింది. వ్యవసాయ కార్మికులు, రైతులు, శ్రమజీవులు తమ వర్గ విభేదాలు మరిచి సంఘటితమై పోరాడినప్పుడే సాంఘిక దౌర్జన్యాలు సమాధి అవుతాయి. పీడిత ప్రజల ఆశాజ్యోతిగా వెలుగొందే సిపిఐని మార్క్సిజం, లెనినిజంలకు వ్యతిరేకంగా మావోవాద పిడివాద సిద్ధాంతాలతో బద్దలుగా చీల్చారు. ఫలితంగా కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనంకు ఆటంకం కలిగింది. సిపిఐ నుంచి సిపిఎంగా చీలినవారు చీలికను నేటికి శ్లాఘిస్తున్నారు. విప్లవోద్యమం ముందుకుపోయిందని నమ్మజూపడం దురదృష్టకరం. భారతదేశంలో సూత్రబద్ధంగా కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత సాధించడానికి కమ్యూనిస్టు పార్టీ శక్తివంచన లేకుండా పాటుపడుతుంది. దేశ కళ్యాణం కోసం, శ్రామిక ప్రజల హక్కుల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడింది. అదే కష్టజీవుల ఆశాజ్యోతి. ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీ అత్యంత పాశవికమైన నిర్బంధాలను, జైళ్లను, లాఠీలను, తుపాకీ గుండ్లను ఎదిరించి మేరుపర్వతంలా నిలబడింది. ఇంతటి త్యాగాలు, ఇంతటి రక్తతర్పణం చేసిన రాజకీయ పార్టీ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే మరొకటి లేదని కమ్యూనిస్టు పార్టీ సగర్వంగా చెప్పగలదు.

('విశాలాంధ్ర' స్వర్ణోత్సవం– ఖమ్మం జిల్లా ప్రత్యేక సంచిక (2002) నుంచి)

# మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం

కీ.శే.సురవరం సుధాకర్‌రెడ్డి స్నేహశీలి. సున్నితంగా విమర్శించే స్వభావం. అందుకే విభిన్న సిద్ధాంతాలు కలిగిన కరుడుగట్టిన మితవాదులు సైతం ఆయనకు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు. పౌరహక్కుల మానవ హక్కుల నాయకులు సైతం ఆయనకు నివాళులర్పించారు. ఆయనలో మానవత్వం మూర్తీభవించింది. ప్రజానీకాన్ని, అలాగే కార్యకర్తలను ఉత్తేజపరచగలిగిన వాగ్ధాటి. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్నారు.

ప్రస్తుత అఖిలభారత విద్యార్థి సమాఖ్య శాఖ హైదరాబాద్‌లో హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్‌గా ఉండేది. కోఠి మహిళా కళాశాల దర్బార్ హాల్‌లో జరిగిన మహాసభలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య హైదరాబాద్ శాఖగా పేరు మార్చారు. దానికి సదానంద్ అధ్యక్షులు. నేను ప్రధాన కార్యదర్శిని. అయితే అజీజ్‌పాషా రాష్ట్రం నుండి హైదరాబాద్ శాఖకు బాధ్యులుగా విద్యార్థులను సమీకరిస్తుంటే రాష్ట్ర, జాతీయ నాయకులుగా సుధాకర్ రెడ్డి తన ఉత్తేజకరమైన ప్రసంగాల ద్వారా విద్యార్థులలో చైతన్యాన్ని కలిగించేవారు. హైదరాబాద్‌లో విద్యార్థి పార్టీ శాఖలో 80 మంది సభ్యులు.



సురవరంతో నా జ్ఞాపకాలు
**వి.రాంనర్సింహారావు**
సిపిఐ సీనియర్ నాయకుడు

నేను దానికి కార్యదర్శిని, కామ్రేడ్ విజయలక్ష్మి సహాయ కార్యదర్శి, తదనంతరం అంచెలంచెలుగా ఎఐటియుసి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే అనేకమంది హోల్ టైమర్లుగా తయారయ్యారు.

అనేక మంది సుధాకర్‌రెడ్డి ప్రసంగాలకు ఆకర్షితులైనారు. అజీజ్‌పాషా డా.కె.నారాయణ విద్యార్థులతో నిత్య సంబంధాలు పెంచుకోవడంలో అత్యంత a సమర్థులు. వీరి త్రయం వల్ల అనేక మంది వివిధ రంగాలలో ఆరితేరారు. తమ్మారెడ్డి భరద్వాజ ఎఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు. వారు సినీదర్శక, నిర్మాత బాధ్యతలు నిర్వహించారు. డా.కిలారు పూర్ణచంద్రరావు వ్యవసాయ శాస్త్రవేత్త విధులు నిర్వహించారు. బొమ్మగాని ప్రభాకర్ మాస్కో రాజకీయ పాఠశాలలో ఏడాది కాలం సురవరంతో సహ విద్యార్థిగా ఉండి తదనంతరం న్యాయవాదిగా న్యాయమూర్తి కావడానికి అవకాశాలున్నప్పటికీ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజెయు) సంఘానికి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా పనిచేసి, ప్రస్తుతం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పల్లావెంకట్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. ఉజ్జిని యాదగిరి రావు శాసనసభ్యునిగా విధులు నిర్వహించారు. అజీజ్‌పాషా సిపిఐ జాతీయ కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. ప్రేంపావని, మహిళా సమాఖ్య, ఎఐటియుసి రాష్ట్ర బాధ్యతలు, వనశ్రీ, జ్యోత్స్న, కల్పన, సిఆర్ ఫౌండేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జి.సీతారాములు, విద్యుత్ ఉద్యోగుల సంఘ నిర్మాణంలో పాల్గొన్నారు. వీరంతా ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ శాఖ నాయకులే. సురవరం ప్రసంగాల ప్రభావం, అలాగే అజీజ్‌పాషా, తదనంతరం డా.కె.నారాయణ నిత్య సంబంధాలు పెట్టుకోవడంతో అనేకమంది పూర్తి కాలం పార్టీ కార్యకర్తలుగా తయారయ్యారు.



ఈ సమయంలోనే నేను సిటీ కాలేజీ విద్యార్థి యూనియన్‌కు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యాను. ఆ ఎన్నికలలో నాకు పూర్తి సహకారం అందించిన వారు బొమ్మగాని ప్రభాకర్, అలాగే పరుచూరి గోపాలకృష్ణ (సినీ మాటల రచయిత). గోపాలకృష్ణ మరియు నేను కాలేజీలో కలిసి నాటకాలు కూడా వేశాం. ఆ రోజుల్లో నేను సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బోర్డర్‌ను. అందులో 90% బి.సి, ఎస్.సి, ఎస్.టి విద్యార్థులే. ప్రభుత్వం వారికి కేవలం రూ.20/– గ్రాంటుతో పరిమితమైన భోజనం అందించేవారు. అజీజ్‌పాషా నేను కలిసి రాష్ట్రవ్యాపిత సంఘాన్ని ఏర్పాటు చేసి భోజన చార్జీలు పెంచాలని ఉద్యమం నిర్మించాం. 20,000 మంది నిరాహార దీక్షలతో రాష్ట్ర వ్యాపితంగా 1968 డిసెంబర్‌లో పాల్గొన్నారు. డా.విజయలక్ష్మి నాయకత్వంలో ఆబిడ్స్ మహిళా విద్యార్థినులతో రాస్తారోకో నిర్వహించారు. ఫలితంగా చార్జీలు పెంచారు. అందరికీ అపరిమిత భోజనంతోపాటు సౌకర్యాలు మెరుగుపర్చారు. కాని నన్ను మాత్రం హాస్టల్ నుండి తొలగించారు.

వెంటనే సుధాకర్‌రెడ్డి స్పందించి నన్ను హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆఫీస్‌లో వసతి ఏర్పాటు చేసి కార్యాలయం ఎదుట ఉన్న హోటల్‌లో భోజనం ఏర్పాటు చేశాను. మాది పెద్ద కుటుంబం. భువనగిరిలో మా ఇల్లు అవతారం చూసి సుధాకర్‌రెడ్డి చలించిపోయారు. నేను ఎంఎస్‌సి మ్యాథ్స్ చదువుతున్నా యూనివర్శిటీకి ప్యాంట్లు లేక నిక్కర్‌తో వెళ్లేవాణ్ని. క్యాంపస్ మొత్తంలో నేనొక్కడినే నిక్కర్ వేసుకొనేవాడిని. సుధాకర్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లినపుడల్లా నాకు బట్టలు కొనుక్కొచ్చేవారు. భూస్వామ్య కుటుంబం నుండి వచ్చినా ఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఒక బెంచి మీద పడుకునేవారు. ఆయన వివాహం విజయలక్ష్మితో జరిగిన తదనంతరం సైతం నా వివాహం అయ్యేంతవరకూ సుధాకర్‌రెడ్డి విజయలక్ష్మి గార్ల ఇంటిలోనే నా భోజన వసతి సౌకర్యాలు. ఇంత ఆదరంగా నన్ను చూసినా, ఆయనను ఏకంగా రాష్ట్ర పార్టీ మహాసభలోనే మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లి క్రిందిస్థాయిలో పనిచేయాలని విమర్శ పెట్టినా ఆయన నన్ను ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. తాను తయారు చేసిన కార్యకర్త తననే విమర్శించే స్థాయికి ఎదిగాడని మరింత ఆదరాభిమానాలు పెంచుకోవడం కమ్యూనిస్టుకు ఉండాల్సిన సద్గుణం.

ఆయనపై కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ప్రభావం బాగా ఉండేది. ఆయనది జమీందార్ కుటుంబమైన వ్యవసాయ కార్మిక సంఘంలో పని

(మిగతా 9వ పేజీలో)

## తెలుగు సాహిత్యం పరిశోధనకు రాఘవేందర్‌కు డాక్టరేట్



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ఎలువర్తి గ్రామానికి చెందిన కావా లి రాఘవేందర్ తెలుగు సాహిత్యంలో చేసిన విస్తృతమైన పరిశోధనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మక డాక్టరేట్(పిహెచ్‌డి) పట్టాను ప్రకటించిందని నవంబర్ 15వ తేదీన ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం ఈ మేరకు అధికారికంగా ప్రకటించింది. సూర్య ధనుంజయ్ పర్యవేక్షణలో కావలి రాఘవేందర్ సాహిత్య చరిత్రలు,తెలంగాణ సాహిత్యం అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా కావాలి రాఘవేందర్ కు అధ్యాపకులు,కుటుంబ సభ్యులు,సాహితీవేత్తలు, మిత్రులు అభినందనలు తెలిపారు.

## సేవాభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : కె.లలితా దేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్కీం ద్వారా పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పదిమంది మెడికల్ ఆఫీసర్ పోస్టులను 13వ తేదీన జరిగిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టినట్లు రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి తెలిపారు. వారందరికీ శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారికి సేవాభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని,ప్రజా ఆరోగ్యం పట్ల ప్రత్యేక వహించి పేదలకు సరైన వైద్యం అందించాలని సూచించారు.

# ‘లంచం వద్దు.. సేవే లక్ష్యం’

- చేయి చేయి కలుపుతాం.. అవినీతిని అరికడతాం
- హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది ప్రతిన
- హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది అవినీతి వ్యతిరేక పాదయాత్ర, మానవహారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానానికి అనుగుణంగా పనిచేసేందుకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది సంకల్పబద్ధంగా ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల్లో అవినీతి నిరోధక చైతన్యం పెంపొందించేందుకు శనివారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి లిబర్టీ వరకు పాదయాత్ర, అనంతరం మానవహారాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రాజెక్ట్ డైరెక్టర్లు, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ‘లంచం వద్దు – సేవే లక్ష్యం’, ‘నిజాయితీ మా విలువ – అవినీతి మా శత్రువు’, ‘అవినీతికి నో బాధ్యతకు ఎస్’ వంటి నినాదాలతో వారు ప్లకార్డులు పట్టుకుని ప్రజల్లో అవగాహన కల్పించారు. హిమాయత్ నగర్ ప్రధాన కార్యాలయం నుంచి లిబర్టీ వరకు పాదయాత్రగా సాగిన అనంతరం, లిబర్టీ సమీపంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అవినీతి వ్యతిరేక హెల్ప్‌లైన్, కాల్ సెంటర్ వివరాలున్న పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఇకపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ ప్రకటించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్, హెల్ప్‌డెస్క్, కాల్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు ఈశ్వరయ్య, చైతన్యకుమార్, భాస్కరరెడ్డి, విజయకుమార్, మమత, శ్రీదేవి పాల్గొన్నారు.


## నాణ్యమైన వైద్యం అందించాలి

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** వైద్యం కోసం వచ్చే పేద ప్రజలకు నాణ్యతమైన వైద్యం అందించినప్పుడే ప్రజల నుంచి మన్ననలు పొందుతామని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి లు అన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్‌లోని నాగార్జున కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విరాట్ హాస్పిటల్‌ను స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే ప్రజలకు అధునాతన పరికరాలతో కలిగిన వైద్యం అందించాలని నిర్వహకులకు సూచించారు. పేద ప్రజలకు సాధారణ చార్జీలతో మెరుగైన వైద్యం అందించి రోగుల ఆదరణ పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ పార్టీ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, పన్యాల జయపాల్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ అధికారుల సంబరాలు



**ప్రజాపక్షం/షాబాద్:** నూతనంగా రాష్ట ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారులను నియమించిన సందర్భంగా నెల జీతం రావడంతో జిపి రెవెన్యూ అధికారులు మండల తహశీల్దార్ అన్వర్, డిప్యూటీ తహశీల్దార్ మధు ఇతర అధికారులకు స్వీట్స్ పంచుతు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ అన్వర్, డిప్యూటీ తహశీల్దార్ మధు మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి ఆయా గ్రామాల రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల అనుసారం ప్రభుత్వ భూములను కాపాడుతు, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు వాణి, సుధాకర్, సంతోష, నరహరి, రాజు, గౌతమి, జంగయ్య, అంజలి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

## సకాలంలో ఇండ్లు నిర్మించుకోవాలి



**ప్రజాపక్షం/యాచారం :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరు సకాలంలో ఇండ్లు నిర్మించుకోవాలని యాచారం మండల ఎంపిడిఒ రాధారాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాల్ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని పరిశీలించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వం ధారిద్రరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేసిందని వాటిని త్వరగా పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులపై ఉందన్నారు. ఇండ్లు నిర్మించుకుంటున్న వారందరికి సకాలంలో బిల్లులు చెల్లించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇండ్ల నిర్మాణం విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇంకుడు గుంతలు ప్రతి ఒక్కరు నిర్మించుకునేలాచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి రాజు తదితరులు పాల్గోన్నారు.

## పేదల అభయహస్తం రిలీఫ్ ఫండ్



**ప్రజాపక్షం /హయత్ నగర్ :** సిఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్‌బినగర్ ఎంఎల్ఎ సుదీర్ రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్‌లో నివాసం ఉండే సైదమ్మ ఎముకల కండరాలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక స్థితులు బాగలేక వారు వారి కుటుంబ సభ్యులు ఎల్‌బినగర్ శాసన సభ్యులు సుదీర్ రెడ్డి సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్‌కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి గాను వారికి 3,00,000 (మూడు లక్షల రూపాయలు) ఎల్‌ఒసి చెక్కు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయ నిధి దోహదపడుతుందన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సతీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక పరంగా అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/కొందుర్గు:** విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరంగా అవగాహన కలిగి ఉండాలని, అప్పుడు భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్ వివరించారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ 2025 సంబరాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ప్రతిభను, సృజనాత్మకతను, శాస్త్ర సాంకేతిక పరంగా అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. 8,9,10తరగతుల విద్యార్థులందరు ఆహ్వానితులేనని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుకు రూ.5, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రూ.10 చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 21వ తేదిన మండల స్థాయి పోటీ, నవంబర్ 28న జిల్లా స్థాయి పోటీ, డిసెంబర్ 12,14వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



## బతుకమ్మకుంట బాగుందా..!

- వాకర్లతో మాట్లాడిన హైడ్రా కమిషనర్
- ఆహ్లాదకరంగా మారిందన్న వాకర్స్
- సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభివృద్ధి చేశాక బతుకమ్మకుంట ఎలా ఉంది, మీకు ఎలా ఉపయోగపడుతుంది అని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ వాకర్స్‌ను అడిగారు. బతుకమ్మకుంటను శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో సందర్శించారు. బతుకమ్మ కుంట చుట్టూ వాకర్లతో కలసి నడిచారు. బతుకమ్మ కుంట అభివృద్ధి పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది వాకింగ్ కు వస్తున్నారు, ఎలా ఉపయోగపడుతోంది అని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ కుంట ఇప్పుడు మాకందరికీ విహార కేంద్రం అయ్యిందని స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. బతుకమ్మకుంట అందుబాటులో రావడంతో ఈ పరిసర ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయని, వాకింగ్ చేసుకుంటూ ఆరోగ్యాలు కాపాడుకుంటున్నామని కమిషనర్‌కు వారు తెలిపారు. ఒకప్పుడు దుర్గంధంతో వ్యాధులు భారిన పడేవాళ్ళమని, ఇప్పుడు ఆరోగ్యాలు కాపాడుకుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పిల్లలకు మంచి క్రీడా స్థలంగా మారిందని చెప్పారు. ఈ చెరువును సెప్టెంబర్ 28న ప్రారంభించామని, చెరువు చుట్టూ వేసిన మొక్కలు పెద్దవైతే మరింత ఆరోగ్యవంతంగా పరిసరాలు మారుతాయని కమిషనర్ వారికి తెలిపారు. చెరువును ఇంతే శుభ్రంగా కాపాడుకోడానికి హైడ్రాతో కలసి పని చేయాలని అక్కడి వాకర్లను కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో ఫొటోలు దిగి చాలా మంది పదిలపరచుకున్నారు. చిన్నారులు థాంక్ యూ సార్ అంటూ కమిషనర్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

## వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి

### సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ పోలీస్ కమిషనర్ కె.సృజన



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** హ్యూమన్ ట్రాఫికింగ్, మానవ అక్రమ రవాణా (హ్యూమన్, చైల్డ్ ట్రాఫికింగ్), ఈవ్ టీజింగ్,సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడుతున్న వారి కఠినంగా వ్యవహారించాలని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సృజన తెలిపారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నిర్వహించి ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు, 22 మంది సెక్స్ వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. 3 పిటి కేసుల్లో 4 బాధితులను రక్షించగా, మరో 8 మంది నిందితులను అరెస్టు చేశారు.సైబరాబాద్ షీ టీమ్స్ ఈ వారంలో మొత్తం 140 డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాయిచగా పబ్లిక్ ప్రదేశాల్లో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 87 మందిని ప్రత్యక్షంగా అదుపులోకి తీసుకున్నామని సృజన తెలిపారు.

## విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జిలు పంపిణీ



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ శనివారం స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు చదువుకుంటున్నారు. వారి బంగారు భవిషత్‌కు బాటలు వేయడానికి అందరు తోడ్పాటు నందించాలన్నారు. పిఆర్ జీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రవిందర్ గుప్త పాఠశాలకు ఎంతగానో సహకరిస్తున్నారని అమే కోనియాడారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, గిరిజారాణి, గ్రామ యువకులు బన్నే శ్రీశైలం తదితరులు పాల్గోన్నారు.

## బాల్యవివాహాలను ప్రతిఒక్కరూ అరికట్టాలి



**ప్రజాపక్షం/యాచారం :** బాల్య వివాహలను ప్రతి ఒక్కరూ అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని యాచారం తహశీల్దారు అయ్యప్ప అన్నారు. శనివారం యాచారం మండల తహశీల్దారు కార్యాలయంలో బాల్య వివాహల నిర్మూలనపై ఆవగాహణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ బాల్య వివాహలు నిర్వహించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఆడ పిల్లల భవిష్యత్తును దెబ్బ తీసే కుట్రగా అయన అభివర్ణించారు.ఆడ పిల్లలకు 18 ఏండ్లు నిండకుండా వివాహం చేస్తే 2 సంవత్సరాల జైల్ శిక్ష తో పాటు లక్ష రూపాయల జరిమాన విధించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సిడిపిఒ వినితాదేవి మాట్లాడుతూ ముదస్తు వివాహం వల్ల ఆడపిల్లల చదువులు మానేయడం జరుగుతుందని తెలిపారు. ప్రసవ సమయంలో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. లైంగిక హింస, గృహ హింసకు గురి అయ్యే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహం చేసే తల్లిదండ్రులు, సంరక్షకులు, హజరైన వ్యక్తులు, పూజారులు చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని పెర్కోన్నారు. బాల్య వివాహలు ఎక్కడైనా జరిగితే సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎంపిడిఒ సూపరిండేంట్ శైలజా. ఐకేపి ఎపిఎం రవింధర్,ఎన్‌జిఒస్ ,పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం అని, ప్రజాబాట కార్యక్రమం ద్వారా మన్సూరాబాద్ డివిజన్‌లో ప్రమాదకర విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. ప్రజల భద్రతనే ప్రథమ ప్రాధాన్యతగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, ప్రియదర్శిని కాలనీలో స్తంభాలపై ఉన్న కరెంటు వైర్లు తెగిపోయే ప్రమాదం ఉందని స్థానిక కాలనీ వాసులు పలు సమస్యల నర్సింహ్మా రెడ్డి దృష్టికి తీసుకొచ్చిన వాటిన సంబంధిత అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులకు అక్కడికక్కడే సమాచారం అందించి సమస్య తీవ్రతను వివరించడంతో అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా వేలాడుతున్న పాత వైర్లను తొలగించి, సురక్షితమైన కొత్త కేబుల్స్ వైర్లను అమర్చడం పూర్తి చేశారు. సూర్యోదయ కాలనీ, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలనీ తదితర కాలనీలలో కూడా లూజ్‌గా ఉన్న వైర్లు, డ్యామేజ్ అయిన కరెంటు స్తంభాలను పునరుద్ధరించి ప్రజల భద్రతను కాపాడే దిశగా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో. విద్యుత్ అధికారులు మీర్జావుద్దీన్ ఖాదిర్, బలరాం, అసిస్టెంట్ లైన్మెన్ శివ, శ్రీనివాస్ మరియు ఆయా కాలనీ వాసులు శేఖర్ రెడ్డి, రఘురాం రెడ్డి, గంజి వెంకటేష్, మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆత్మగౌరవం బిర్సా ముండా

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** భూమికోసం.. భుక్తికోసం..ఆదివాసీల విముక్తి కోసం బిర్సా అనేక పోరాటాలు చేశారని ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ వివరించారు. శనివారం గాంధీభవన్‌లో ఆదివాసుల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ముఖ్యఅతిధిగా ఆదివాసి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ట్రైకార్ చైర్మెన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలో జన్మించిన బిర్సాముండా బ్రిటిష్, అరాచకమైన పాలనపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బ్రిటిష్ వాళ్ళు ఆదివాసీలపై చేసిన ఆరాచకాలపై తిరుగుబాటు చేసి ఆదివాసీల ఆత్మగౌరవం కోసం ఎన్నో పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గోపాల్‌నాయక్, వినోద్ నాయక్, రఘునాయక్‌లు పాల్గొన్నారు.



## సిపిఐ శతజయంతి ఉత్సవాలు పండుగలా నిర్వాహణ

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శత జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన పండుగలా నిర్వహించేందుకు సిపిఐ కార్యకర్తలు కృషి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. శనివారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.శ్రీను అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు అవుతున్న నేపథ్యంలో శత జయంతి ఉత్సవాలను గ్రామ గ్రామాన నిర్వహించేందుకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో భూస్వాములకు, దోపిడిదారులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం చేయడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని వివరించారు. డిసెంబర్26వ తేదిన ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు షాద్‌నగర్ నుండి పెద్ద ఎత్తున హాజరయ్యేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎం.గోవింద్ నాయక్, వెంకటేష్, ఎండి షకీల్, గడ్డం జంగయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్, సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చంద్రబాబు, బికెఎంయు జిల్లా నాయకుడు డి.ఎల్లయ్య, సీనియర్ నాయకురాలు యామిని పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ చట్టాలను సాధించిన ఏకైక పార్టీ సిపిఐ



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ చట్టాలను సాధించిన ఏకైక పార్టీ సిపిఐ అని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, సిపిఐ నాయకులు కొంత మాధవరెడ్డి అన్నారు. సిపిఐ పార్టీ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 36 తారీఖున ఖమ్మంలో భారత స్థాయి ముగింపు ఉత్సవాల బహిరంగ సభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కూడలిలో కరపత్రములను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 2014లో ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షక నాదాలతో అధికారంలోకి వచ్చిన అవేమీ చేయకుండా పబ్బం కడుపుతున్నారని ఎద్దేవా చేశారు. పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ అని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బాలయ్య, జగన్మోహన్ రెడ్డి, విజయ, పద్మ, సిపిఐ పార్టీ నాయకులు రేఖ అండాలు, సత్తమ్మ, నిర్మల, అంజమ్మ ,పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకంతోనే మత్స్యకారుల అభివృద్ధి

### కేశంపేట ఎంపిడిఒ రవిచంద్రకుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కేశంపేట:** చేప పిల్లల పెంపకంతోనే మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని కేశంపేట ఎంపిడిఒ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న 25చెరువులకు ఆరు లక్షల 50వేల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చేపల వ్యాపారం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఇతర ప్రాంతాలను ఎగుమతులు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మత్స్యకారుల సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లె బాలేశ్వర్, ప్రేమ్‌కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి స్వరూప్, వెంకటయ్య, ఏర్పుల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభ వెలికి తీసేందుకే జోనల్ స్థాయి పోటీలు

### వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ స్థాయి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే జోనల్ స్థాయి పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జాతీయ ఖోఖో జోన్, అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులకు రూ.5వేలు, ఇంటర్ జోనల్ ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు రూ.10వేల చొప్పున ఎమ్మెల్యే నగదు బహుమతి అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి ఎంపికైన క్రీడాకారులకు టీ షర్టులతోపాటు నగదును అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో సైతం యువత రాణించి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడలతోనే గుర్తింపు వస్తుందనే విషయాన్ని ప్రతి క్రీడాకారుడు గుర్తించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 80మంది విద్యార్థులకు టీషర్టుతోపాటు రూ.5వేలు నగదు అందజేశారు. ఇంటర్ జోనల్ ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేల నగదుతోపాటు టీషర్టులను అందించారు. షాద్‌నగర్ జోన్ నుండి ఎంపికైన క్రీడాకారులకు ఫరూఖ్‌నగర్ మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు పంది వెంకట్‌రాంరెడ్డి టీ షర్టులతోపాటు నగదు అంధించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మనోహర్, మార్కెట్ కమిటి వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, జనిగ జగన్, ముబారక్, సీతారాములు, గోదా మాధవులు, అన్వర్, గంగనమోని సత్తయ్యలు పాల్గొన్నారు.

## రోడ్డును తవ్వేసి కాలనీ వాసుల నిరసన



**ప్రజాపక్షం/తాండూరు:** శనివారం తాండూరు పట్టణ పరిధి 7వ వార్డులోని రాయల్ కాంట నుండి మసీదు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ కాలనీ వాసులు తీవ్రంగా ఆగ్రహించారు. రోడ్డుకు అడ్డంగా రోడ్డును తవ్వేసి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

## ఉప్పల్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి




**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి శనివారం న్యూ విజయపురి కాలనీలో రూ.1.83 కోట్లు నిధులతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ నిర్మాణం, కొత్త మంచినీటి పైపు లైన్ల పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణం జరుగుతున్నాయని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా చాపల శ్రీనివాస్‌ను, వైస్‌చైర్మన్‌గా మల్లేశం ను ప్రభుత్వం నియమించడం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని స్పీకర్ ప్రసాద్ నివాసంలో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు, పట్టణ అధ్యక్షునికి సుధాకర్‌రెడ్డికి, రఘుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## రామంతపూర్-కోఠి బస్సు సర్వీసు పునరుద్ధరణ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రామంతపూర్ ఆర్టీసీ కాలనీ నుండి కోఠి వరకు బస్సు సర్వీసును శనివారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఈ మార్గంలో బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొన్నారని ఆర్టీసీ ఉన్నతాధికారులను సంప్రదించి, మరల సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరగా వారు శనివారం నుండి ప్రతి రోజు రామంతపూర్ నుండి కోఠి వరకు 12 ట్రిపులు బస్సు తిరుగుతుంది అని తెలిపారు. బస్సు సర్వీస్ పునరుద్ధరించబడటంతో రామంతపూర్ ఆర్టీసీ కాలనీ వాసులు, పరిసర ప్రాంత నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పసుల ప్రభాకర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, ఎం.సురేష్, డి.మురళి, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని పార్కింగ్ తొలగిస్తాం : కమిషనర్

**ప్రజాపక్షం/దుండిగల్:** అనుమతులు లేని పార్కింగ్ నిషేధిత జాబితాలో ఉన్న స్థలాల్లో గుడిసెలు వేస్తే సహించబోమని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బోరంపేట్ పరిధిలోగల గాయత్రి గార్డెన్‌లో అనుమతులు లేకుండా బస్సు పార్కింగ్ నిర్వహించడం ఇష్టానుసారంగా గుడిసెలు నిర్మాణాలు



చేస్తుండడం చట్టరీత్యా నేరమని శనివారం హై కోర్టు ఆదేశాల ప్రకారం మున్సిపల్, పోలీసు శాఖ సంయుక్తంగా తొలగించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎస్సై రామ్మోహన్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ నగేష్ బాబు, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, మున్సిపల్ చైన్ మాన్లు, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రామంతపూర్ భరత్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు ప్రారంభించి, కరస్పాండెంట్‌తో కలిసి విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ నమూనాలను పరిశీలించారు. ఫోటో బయో రియాక్టర్, సైన్యం కోసం రూపొందించిన స్కానింగ్ కారు, భూకంప హెచ్చరిక పరికరం, పాత, కొత్త వ్యవసాయ పద్ధతుల నమూనాలు తదితర ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యాధికారి రామారావు మాట్లాడుతూ, విద్యార్థులు రూపొందించిన నమూనాలు చూస్తుంటే, భవిష్యత్తులో ప్రపంచస్థాయి శాస్త్రవేత్తలుగా ఎదగగల సామర్థ్యం వారిలో ఉన్నట్లు తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్ దేవ్, ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అనాథలైన చిన్నారులకు పాత్రికేయుల బాసట

**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ రోడ్డు ప్రమాద ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇద్దరు చిన్నారులకు చేవెళ్ళ నియోజకవర్గ పాత్రికేయులు(విలేకరులు) బాసటగా నిలిచారు. యాలాల మండల పరిధి హాజిపూర్ గ్రామానికి చెందిన బందెప్ప, లక్ష్మి దంపతులు చేవెళ్ళ రోడ్డు ప్రమాద ఘటన లో మృత్యువాత పడిన విషయం తెలిసిందే. నిత్యం ప్రజా సమస్యలపై పరితపించే పాత్రికేయులు శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి అనాథలైన చిన్నారులను పరామర్శించడంతో పాటు వారికి మేము సైతం అండగా ఉంటామంటూ రూ.68,600లు వారికి అందజేశారు. అందజేసిన వారిలో చేవెళ్ళ నియోజకవర్గం విలేకర్లు పాల్గొన్నారు.

# ‘హైడ్రా అంటే అభయం - ఎలాంటి భయం వద్దు’

హైడ్రాను ఆశ్రయించిన బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంత నివాసితులకు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా అంటే అభయమని, హైడ్రా పేరుతో అపోహలు సృష్టించడం, ప్రజలను భయాందోళలనకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ కుంట(సుద్దకుంట చెరువు) చెంత ద్వారకానగర్ నివాసితుల ఫిర్యాదుల మేరకు కమిషనర్ శనివారం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. సుమారు గంటపాటు అక్కడ పర్యటించి స్థానికులతో మాట్లాడి ప్రతి అంశాన్ని నివృత్తి చేశారు. అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా చెరువుల పేరిట ఆందోళనలు కలిగించే వివిధ శాఖల అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. చెరువుల కబ్జాదారులపై చర్యలకు ఎట్టి పరిస్థితుల్లో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. హైడ్రా పేరు చెప్పి వసూళ్లు చేస్తున్న ఘటనలు కూడా తమ దృష్టికి వస్తున్నాయని, అలాంటి విషయాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ‘సుద్దకుంట చెరువు చెంత తాము 30 ఏళ్ల క్రితం నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, ఇప్పుడు మా నివాసాలు ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తున్నాయని హైడ్రా పేరు చెప్పి బెదిరిస్తున్నారు. హెచ్‌ఎండిఏ, మున్సిపల్ స్థానిక అధికారులు ఎఫ్‌టిఎల్ మార్కింగ్ చేసి ఇనుప కడ్డీలు పాతి, ఇళ్లపై నెంబర్లు వేసి ఈ ఏడాది జులైలో మార్కింగ్ చేశారు. ఇదేమని అడిగితే హెచ్‌ఎండిఏ, మున్సిపల్ అధికారులు మరింత భయాందోళనలు కలిగిస్తున్నారు. అని హైడ్రా కమిషనర్ ముందు పలువురు స్థానికులు మొరపెట్టుకున్నారు.

**చెరువు చెంత ఉన్న నివాసాల వారికి ఎలాంటి చింత అవసరం లేదు..**

స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం సుద్దకుంటను పరిశీలించారు. ఇళ్లపై వేసిన మార్కింగ్‌లను కమిషనర్ చూశారు. అక్రమంగా ఇళ్లపై మార్కింగ్ వేసి భయభ్రాంతులకు గురి చేసిన హెచ్‌ఎండిఏ, మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. చెరువు చెంత ఉన్న నివాసాల వారికి ఎలాంటి చింత అవసరం లేదన్నారు. ఈ చెరువుకు 2014లోనే 3.16 ఎకరాల మేర చెరువు ఉందని హెచ్‌ఎండిఏ వాళ్లు ప్రిలిమనరీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. దాని ప్రకారమే చెరువు హద్దులు నిర్ణయించి కాపాడతామని హామీ ఇచ్చారు. చెరువు హద్దులు మార్చివేసి వేరొక వైపు చెరువు ఉన్నట్లుగా చూపించి ఇళ్లపై మార్కింగ్ వేసిన అధికారులపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టిఎల్ పరిధిలోకి వస్తాయంటూ దాదాపు 48 ఇళ్లపై స్థానిక అధికారులు మార్కింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. 30 ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న వారి జోలికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇళ్లపై వేసిన మార్కింగులు వెంటనే తొలగించాలని ఆదేశించారు. హెచ్‌ఎండిఏ, మున్సిపల్ అధికారులు ప్రతిపాదించిన ఫైనల్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు పక్కన పెట్టి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళతామని రంగనాథ్ స్పష్టం చేశారు.

**నివాసాల జోలికి హైడ్రా వెళ్లదు..**

2024వ సంవత్సరం జులై 19వ తేదీన హైడ్రాను ప్రభుత్వం తీసుకు వచ్చిందని, ఈ తేదీకి ముందు నిర్మించి, నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా అదే అన్నారు. చెరువుకు నివాస ప్రాంతాలకు మధ్య 1990లోనే రహదారి నిర్మించినట్టు స్థానికులు చెబుతున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు కమిషనర్ తెలిపారు. ఎవరైనా లేనిపోని గందరగోళం సృష్టించి, హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగనాథ్ హెచ్చరించారు. ప్రస్తుతం చెరువుల వద్ద మిగిలిన భూమిలోనే వాటి పునరుద్ధరణ, అభివృద్ధిని చేపడుతున్నామని స్పష్టం చేశారు. సుద్దకుంట చెరువు పునరుద్ధరణ, బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఇళ్లపై వేసిన మార్కింగ్‌లను హెచ్‌ఎండిఏ సంబంధిత అధికారులు తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కి ధన్యవాదాలు చెప్పారు.

## భూ కబ్జాదారులపై శాఖాపరమైన చర్యలు

సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్




**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండలం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. దండు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమా మహేష్, జి. దామోదర్ రెడ్డిలు మాట్లాడుతూ, సిపిఐ పార్టీ 100 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, నవంబర్ 20 నాడు సిపిఐ పార్టీ ప్రచార జాత మేడిపల్లి చౌరస్తాలో సాయంత్రం 4 గం మీటింగ్‌కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తున్న కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంట కార్పోరేషన్‌లో ఎక్కడ చూసిన పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాల్లో దర్శనమిస్తున్నాయని వాటిపైన కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జే.లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్.మాధవి, నాగరాజు, కె.ప్రమీల, కె.మహాలక్ష్మి, రమాతార, అనిత, ఎండి.అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ ప్రగతికి నమూనా..!

**పరిశోధన విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రగతికి నమూనా అని నగర మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌగోళిక శాస్త్ర విభాగం, ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 30మంది (దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారు) పరిశోధన విద్యార్థులు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, ఉద్యోగులు శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పరిశోధన విద్యార్థులతో జరిగిన స్టూడెంట్స్ విత్ మేయర్ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పార్కులు, తడి, పొడి చెత్త సేకరణ, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు, వైకుంఠధామం, కోవిడ్ సెంటర్ నిర్వహణ, వార్డు ఆఫీసర్స్ వ్యవస్థ, సెట్విన్ బ్రాంచ్ ఏర్పాటు, విద్యావాలంటీర్ల నియామకంతో పాటు ప్రజల భాగస్వామ్యం తో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, వాటి వలన ప్రజలకు కలుగుతున్న మేలును తెలియపరిచారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధన విద్యార్థులకు వివరించడంతో పాటు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మాజీ మేయర్ సమాధానాలు చెప్పారు.

ప్రజలకు సేవ చేయాల నే తమ సంకల్పం ఉంటే ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేయొచ్చన్నారు. తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కెసిఆర్, పురపాలక శాఖ మాజీ మంత్రి కెటిఆర్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పనుల ను ప్రోత్సహించడం జరిగిందన్నారు.

ఈ క్రమంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వైకుంఠధామంను వీక్షించి, అందులో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థుల ఫీల్డ్ విజిట్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఉషా, డా॥సుదర్శన్, వివిధ రాష్ట్రాలకు/విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్




**ప్రజాపక్షం/చర్లపల్లి:** కక్షిదారులు లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ ఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో స్పెషల్ లోక్ అదాలత్‌ను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ లోక్ అదాలత్ మధ్యవర్తిత్వం యొక్క ప్రాముఖ్యం గూర్చి వివరించారు.ఈ లోక్ అదాలత్‌లో 48 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 1977 సివిల్ పార్టిషన్ అప్పీల్ దావా,క్రిమినల్ కేసులు 767,చెక్ బౌన్స్ ఎన్ఐ యాక్ట్ కేసులు 32,సివిల్ 35 కేసులు పరిష్కరించబడి పరిహారంగా 2680 లక్షలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనూచౌదరి, మొదటి అరనపు జిల్లా న్యాయమూర్తి తిరుపతి, రెండవ అదనపు న్యాయమూర్తి అమరావతి, జిల్లా పోక్సో న్యాయమూర్తి ఆశాలత, నాల్గవ న్యాయమూర్తి కిరణ్‌కుమార్, సంస్థ సెక్రెటరీ, సత్తు రవీందర్, రాచకొండ డిసిపిలు పద్మజా, సురేష్‌కుమార్,పురుషోత్తం,బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**ప్రజాపక్షం/దోమ:** రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని మోత్కూర్, బొంపల్లి, బాసుపల్లి గ్రామాలలో ప్రాథమిక సహకాల సంఘాల ఆధ్వర్యాన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ రైతుల మధ్యవర్తులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరారు. రైతులను రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసిలో రేపటి నుంచి.. ‘ప్రజావాణి’ కార్యక్రమం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునే జిహెచ్‌ఎంసి ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 17వ తేదీ నుంచి తిరిగి ప్రారంభం కానుంది. సాధారణంగా ప్రతి సోమవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణిని యథావిధిగా కొనసాగించనున్నట్లు జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను, అభ్యర్థనలను అధికారులను కలసి చెప్పుకునే ఈ వేదికను మళ్లీ అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు.




## విధి నిర్వహణలో మరణిస్తే ఇంత నిర్లక్ష్యమా!

మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న పాముల ఆంజనేయులు ఈ నెల 14 వ తేదీన ఉదయం విధులకు హాజరయ్యాడు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) అతన్ని ఫేస్ స్కానింగ్ చేసి ఉదయం ఐదున్నర గంటలకు హాజరు తీసుకున్నారు. ఆంజనేయులు విధులు నిర్వహిస్తూ చెత్త తీసుకొని నర్సరీ దగ్గర చెత్తని తొలగించడం జరిగింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం ఉదయం ఆంజనేయులు విధులు నిర్వహించే దగ్గరికి తోటి కార్మికులను కలిసి విచారించారు. తోటి కార్మికులతో కలిసి చెత్త డంపింగ్ చేసే దగ్గర చూడగా అంజనేయులు అందులో కాలిపోయి శవమై కనిపించాడు. కుక్కలు కూడా కాళ్లు పీక్కుతినడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యేసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నరసింహాతో కార్మికుడు విధులు నిర్వహిస్తున్న సమయంలో మరణించడం జరిగింది కనుక జిహెచ్‌ఎంసి సంస్థ నుండి ఆ కుటుంబానికి రూ.30లక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి జీహెచ్‌ఎంసి నుండి వచ్చే అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం మరణించిన కార్మికుని ఇంటికి వెళ్ళి భార్య పిల్లల్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు ఉజ్జిని హరినాథరావు, చర్లపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.




## ఎన్.దేవయ్య అకాల మరణం కార్మిక వర్గానికి తీరని లోటు : వీఎస్.బోస్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఏఐటియుసి సీనియర్ నాయకులు, ఎన్.దేవయ్య అకాల మరణం ఏఐటియుసికి కార్మిక వర్గానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఈసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో శనివారం జరిగిన దేవయ్య సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసిఐఎల్‌లో దేవయ్య 30 ఏళ్ల పటు ఏఐటియుసి నేతగా కార్మిక రంగానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్మిక వ్యతిరేక చట్టాలకు ముందుండి పోరాటాలు చేసిన ఆయన 2002లో పదవీ విరమణ అనంతరం ఎల్బీనగర్ సిపిఐ ప్రాంత కార్యదర్శిగా రెండు పర్యాయాలు పని చేసి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి శంకర్‌రావు, ఆర్‌కె రెడ్డి, మోహనరావు, నరసింహ, ప్రభాకర్, నరసింహారావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, సిపిఐ నేతలు రాజ్‌కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడిగా చక్రపాణిగౌడ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా కుషాయిగూడకు చెందిన పనగట్ల చక్రపాణిగౌడ్‌ను పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న నియమించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్‌గౌడ్‌లను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో చురుకుగా పాల్గొని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్యగౌడ్, సంజీవ, వెంకటేశ్వర్లు, లింగం యాదవ్, పాండుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ‘భవిత’ నిర్మాణం పనులు ప్రారంభించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** నూతనంగా మంజూరైన భవిత భవనాల నిర్మాణ పనుల ను వెంటనే ప్రారంభించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలేక్టరేట్‌లోని కాన్ఫరేన్స్ నుండి పాఠశాల భవనాల మరమ్మత్తులను, యూనిఫాం, డ్రాఫ్ బాక్స్, విధ్యుత్, మరుగుదోడ్లు తదితర అంశాలపై ఎంపిడిఓ, పంచాయతీ రాజ్, ఇడబ్ల్యుఐడిసి ఎఈలు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపలు, కేజీబీవి ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులతో జూమ్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా మంజూరైన పెద్దేముల్, తాండూరు, చౌడాపూర్ మండలాలలో భవిత కేంద్రాల పనులను వెంటనే మొదలు పెట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనాలపై నీరు నిలువ కుండా చెత్తా చెదారం లేకుండా చూడాలని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా టాయిలేట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో పదోవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో ముఖ హాజరు తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

మండల విద్యాధికారులు పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వసతి గృహాలకు నాణ్యమైన బియ్యాని సరఫరా చేయాలని పౌరసరఫరా అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల వసతి గృహాలలో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అధనపు కలెక్టర్ సుదీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డిఈఓ రేణుకాదేవి, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, ఎంఇఓలు పాల్గొన్నారు.

# క్రీడ

# ఐపిఎల్ 2026..

## ఫ్రాంఛైజీలు రిటైన్ చేసుకుంది వీరినే..



ఐపిఎల్ 2026 వేలం డిసెంబర్ 15న అబుదాబిలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయా ఫ్రాంఛైజీలు తాము రిటైన్, రిలీజ్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను విడుదల చేశాయి. మరి ఏ జట్టు ఎవరిని రిటైన్ చేసింది? ఏ టీమ్‌లో ఎన్ని ఖాళీలున్నాయి, ఏ ఫ్రాంఛైజీ ఎంత మొత్తంతో వేలానికి వెళ్లనుందో తెలుసుకుందాం.

### రిటైన్ అయిన ఆటగాళ్లు వీరే

**చెన్నై సూపర్ కింగ్స్:** అన్షుల్ కాంబోజ్, గుర్జప్‌నిత్ సింగ్, జేమీ ఒవర్టన్, ఎంఎస్ ధోనీ, ముకేశ్ చౌదరి, నాథన్ ఎల్లిస్, నూర్ అహ్మద్, రామకృష్ణ ఘోష్, సంజుశాంసన్ (ట్రేడ్, రుతురాజ్ గైక్వాడ్ శివమ్ దూబె, శ్రేయస్ గోపాల్, ఖలీల్ అహ్మద్, ఆయుష్ మాత్రే, డేవాల్డ్ బ్రెవిస్, ఉర్విల్ పటేల్.
**ఢిల్లీ క్యాపిటల్స్:** అభిషేక్ పొరెల్, అజయ్ మండాల్, అశుతోష్ శర్మ, అక్షర్ పటేల్, దుష్మంత చమీర, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, కుల్‌దీప్ యాదవ్, మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్, ముకేశ్ కుమార్, నితీశ్ రాణా (ట్రేడ్, సమీర్ రిజ్వీ, నటరాజన్, త్రిపురణ విజయ్, ట్రిస్టన్ స్టబ్స్, విప్రాజ్ నిగమ్.
**గుజరాత్ టైటాన్స్:** అనుజ్ రావత్, గ్లెన్ ఫిలిప్స్, గూర్నూర్ సింగ్ బ్రార్, ఇషాంత్ శర్మ, జయంత్ యాదవ్, జోస్ బట్లర్, కగిసో రబాడ, కుమార్ కుశాగ్ర, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, అర్షద్ ఖాన్, నిషాంత్ సింధు, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి కిశోర్, రాహుల్ తెవాతియా, రషీద్ ఖాన్, సాయి సుదర్శన్, షారుక్ ఖాన్, శుభ్‌మన్ గిల్, వాషింగ్టన్ సుందర్.
**కోల్‌కతా నైట్‌రైడర్స్:** అజింక్య రహానె, అంగ్‌క్రిష్ రఘువంశీ, అనుకుల్ రాయ్, హర్షిత్ రాణా, మనీశ్ పాండే, రమణ్‌దీప్ సింగ్, రింకు సింగ్, రొవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, ఉమ్రాన్ మాలిక్, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి.
**లక్నో సూపర్ జెయింట్స్:** అబ్దుల్ సమద్, ఐడెన్ మార్‌క్రమ్, అర్జున్ తెందూల్కర్ (ట్రేడ్, అర్షిన్ కులకర్ణి, అవేశ్ ఖాన్, ఆయుష్ బదోని, ద్విగేశ్ సింగ్ రాఠీ, హిమ్మత్ సింగ్, మణిమారన్ సిద్ధార్థ్, మాథ్యూ బ్రిట్జ్కే, మయాంక్ యాదవ్, మహ్మద్ షమి, మిచెల్ మార్ష్, మోసిన్ ఖాన్, నికోలస్ పూరన్, ప్రిన్స్ యాదవ్, రిషభ్ పంత్, షాబాజ్ అహ్మద్.
**ముంబయి ఇండియన్స్:** అశ్వని కుమార్, గజానఫర్, కోర్బిన్ బాష్, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా, మయాంక్ మార్కండే ((ట్రేడ్, మిచెల్ శాంట్నర్, నమన్ ధీర్, రఘు శర్మ, రాజ్ అంగద్ భావా, రాబిన్ మింజ్, రోహిత్ శర్మ, రికెల్‌టన్, శార్దూల్ ఠాకూర్ ((ట్రేడ్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ ((ట్రేడ్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, విల్ జాక్స్.
**పంజాబ్ కింగ్స్:** అర్ష్‌దీప్ సింగ్, అజ్మతుల్లా ఒమర్జాయ్, హర్నూర్ పన్ను, హర్‌ప్రీత్ బ్రార్, ఫెర్గూసన్, మార్కో యాన్సెన్, మార్కస్ స్టొయినిస్, మిచెల్ ఓవెన్, ముషీర్ ఖాన్, నేహల్ వధేరా, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, అవినాష్, శశాంక్ సింగ్, శ్రేయస్ అయ్యర్, సూర్యాంశ్ షెడ్గే, విష్ణు వినోద్, వైశాఖ్ విజయ్‌కుమార్, బార్ట్‌లెట్, యశ్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్.
**రాజస్థాన్ రాయల్స్:** ధ్రువ్ జురెల్, డొనావన్ ఫెరీరా ((ట్రేడ్, జోఫ్రా ఆర్చర్, క్వెనా మఫాకా, ప్రిటోరియస్, నంద్రీ బర్గర్, రవీంద్ర జడేజా ((ట్రేడ్, రియాన్ పరాగ్, సామ్ కరన్, సందీప్ శర్మ, హెట్‌మయర్, శుభమ్ దూబె, తుషార్ దేశ్ పాండే, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, యుధ్వీర్ చరక్.
**ఆర్సీబీ:** అభినందన్ సింగ్, భువనేశ్వర్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, జాకబ్ బెథెల్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్య, నువాన్ తుషార, ఫిల్ సాల్ట్, రజత్ పాటిదార్, రసిఖ్ దార్ సలామ్, రొమారియో షెఫర్డ్ సుయాశ్ శర్మ, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్ విరాట్ కోహ్లీ, యశ్ దయాళ్.
సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్స్, హర్ష్ దూబె, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయ్‌దేవ్ ఉనద్కత్, కమిందు మెండిస్, నితీశ్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మ్రాన్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్ జీషన్ అన్సారీ.

**ఏ ఫ్రాంఛైజీ వద్ద ఎంత?**
కోల్‌కతా (రూ.64.3 కోట్లు), చెన్నై (రూ.43.4 కోట్లు), సన్‌రైజర్స్ (రూ.25.5 కోట్లు), లక్నో సూపర్ జెయింట్స్ (రూ.22.95 కోట్లు), ఢిల్లీ క్యాపిటల్స్ (రూ.21.8 కోట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (రూ.16.4 కోట్లు), రాజస్థాన్ (రూ.16.05 కోట్లు), గుజరాత్ టైటాన్స్ (రూ.12.9 కోట్లు), పంజాబ్ కింగ్స్ (రూ.11.5 కోట్లు), ముంబయి (రూ.2.75 కోట్లు)

**ఏ టీమ్‌లో ఎన్ని ఖాళీలు?**
కోల్‌కతా(13), సన్‌రైజర్స్(10), చెన్నై(9), రాజస్థాన్(9), ఢిల్లీ (8), ఆర్సీబీ(8), లఖ్‌నవూ (6), ముంబయి (5), గుజరాత్ (5), పంజాబ్ (4).

**సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్**
రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజు శాంసన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ చేసింది. దీంతో సంజుకు సీఎస్కే పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం జరిగింది. అయితే, దీనిపై చెన్నై టీమ్ క్లారిటీ ఇచ్చింది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా కొనసాగుతాడని సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

# క్వార్టర్స్‌లో అర్జున్..

## టైబ్రేక్ ఆడనున్న హరికృష్ణ!



ఫిడే చెస్ వరల్డ్ కప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఎరిగేసి జోరు చూపిస్తున్నాడు. గోవా వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు అర్జున్. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ లెవాన్ అరోనియన్‌తో ఐదో రౌండ్ తొలి గేమ్‌ను డ్రాతో ముగించిన అతడు.. శనివారం రెండో రౌండ్‌లో విజయం సాధించాడు. మరో స్టార్ ప్లేయర్ పెండ్యాల హరికృష్ణ టైబ్రేక్ ఆడనున్నాడు. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న అర్జున్ ఎరిగేసి చెస్ వరల్డ్ కప్‌లో గొప్పగా ఆడుతున్నాడు. ఐదో రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ లెవాన్ అరోనియన్‌ను నిలువరించాడు. తెలివైన వ్యూహాలతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచిన అతడు తొలి గేమ్ డ్రా చేసుకున్నాడు. శనివారం జరిగిన రెండో గేమ్‌లో ఆధిపత్యం చెలాయించిన అర్జున్.. లెవాన్ ఆట కట్టించాడు. సెమీస్ బెర్తు కోసం వీ యీ(చైనా), సామ్యూల్ సెవియన్(అమెరికా) మ్యాచ్ విజేతతో భారత స్టార్ తలపడనున్నాడు.
ఐదో రౌండ్ తొలి మ్యాచ్‌ను పెద్దగా కష్టపడకుండానే డ్రా చేసుకున్నాడు పెండ్యాల హరికృష్ణ. ప్రత్యర్థి అయిన జోస్ మార్టినేజ్ ఎత్తులను ముందే పసిగట్టిన అతడు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. దాంతో.. ఇరువురు 41వ ఎత్తులో డ్రాకు అంగీకరించారు. రెండో రౌండ్‌లోనూ ఇద్దరూ నువ్వా నేనా అన్నట్టు ఆడారు. ఫలితంగా మ్యాచ్ డ్రాగా ముగిసింది. మ్యాచ్‌ను ముగించేందుకు ఇరువురు ఆదివారం టైబ్రేక్ ఆడనున్నారు. గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, డి.గుకేశ్‌లో నిష్క్రమించి నందున.. భారత ఆశలన్నీ అర్జున్, హరికృష్ణ మీదనే ఉన్నాయి.

# ఫోకస్ బిజినెస్






## స్థిరమైన పెరుగుదల

# కోలుకున్న భారత స్టాక్ మార్కెట్లు

భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం కోలుకోవడమేగాక, స్థిరమైన పెరుగుదలను నమోదు చేశాయి. బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్‌ఇ), జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్‌ఇ) లాభాలతో ముగియడం మదుపరుల్లో ఆశలు పెంచింది. సంస్థాగత పెట్టుబడిదారులు కూడా సానుకూల వైఖరిని ప్రదర్శించడం, అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగల చెప్పుకోదగిన ఘటనలు ఏవీ లేకపోవడం ఈ మార్పుకు కారణం. ఈనెల 10వ తేదీ సోమవారం ప్రారంభమైన ఈవారం లావాదేవీలు 14వ తేదీ శుక్రవారంతో ముగిశాయి. బిఎస్‌ఇలో సెన్సెక్స్ 83,535.35 పాయింట్లతో మొదలై, 1,027.43 పాయింట్లు లాభపడి, 84,562.78 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా ఎన్ఎస్‌ఇలో నిఫ్టీ 25,910.05 పాయింట్ల నుంచి 25,910.05 పాయింట్లకు చేరింది. అంటే, ఈ వారం నిఫ్టీ 335.70 పాయింట్ల మేర లాభపడింది. బిహార్‌లో ఎన్‌డిఎ మరోసారి విజయం సాధించడం శుక్రవారం నాటి మార్కెట్ లావాదేవీలపై ప్రభావం చూపింది. ఇన్‌ట్రాడేలో సెన్సెక్స్ 84,175.97 పాయింట్లకు, నిఫ్టీ 25,792.05 పాయింట్లకు పడిపోయాయి. అయితే, చివరి క్షణాల్లో దేశీయ మదుపరులు కొనుగోళ్లకు ముందుకు రావడంతో పరిస్థితి మెరుగుపడింది. ఈ ప్రభావం తాత్కాలికమేనని, వచ్చే వారం మార్కెట్లు మళ్లీ స్థిరంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
మొత్తం మీద ఈ వారం విదేశీ పెట్టుబడిదారులు రూ. 7,051 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా కొనుగోళ్లు చేయడంతో పరిస్థితి చక్కబడింది.
మార్కెట్ ట్రెండ్స్‌ను పరిశీలించిన తర్వాత, ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వచ్చే వారం బిఇఎల్, ఎస్‌బిఐ, ఎటర్నల్ షేర్లపై దృష్టి పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం బిఇఎల్ స్టాక్ విలువ 426.85 రూపాయలుకాగా, 460 రూపాయలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అదే విధంగా రూ. 967గా ఉన్న ఎస్‌బిఐ షేర్ వాల్యూ రూ. 1,040కు చేరవచ్చని అంటున్నారు. ఎటర్నల్ స్టాక్స్ రూ. 304 వద్ద ముగిశాయి. ఈ కంపెనీ వాటాలు వచ్చే వారం రూ. 324కు చేరుకోవచ్చని భావిస్తున్నారు. అయితే, ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో చెప్పలేమని స్పష్టం చేస్తున్నారు. మార్కెట్లను నిశితంగా గమనించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.




# ఆగని పసిడి పరుగులు

బంగారం ధరలు నిరాటంకంగా పెరుగుతునే ఉన్నాయి. ఈవారం కూడా బులియన్ మార్కెట్ భారీ లాభాలనే ఆర్జించింది. శనివారం శనివారం దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే, 24 క్యారట్ల గ్రాము ధర ఒక రూపాయి తగ్గి, రూ.12,703కు చేరింది. 22 క్యారట్ల గ్రాము బంగారం ధర కూడా రూ.1 తగ్గి 11,644 వద్ద ట్రేడ్ అవుతున్నది. 18 క్యారట్ల గ్రాము బంగారం ధర సైతం రూ.1 తగ్గి రూ.9,527లుగా ఉంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు ఇంకా సద్దుమణగలేదు. దీంతో బంగారం ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా డాలర్ బలహీనపడటంతో భారతదేశంలో బంగారం ధరలు గత నెలలో భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నెలలో కూడా పసిడి ధరలకు రెక్కలకు భారీగానే వచ్చాయి. ఇక అమెరికా ప్రభుత్వ షట్ డౌన్ ముగియడంతో పెట్టుబడిదారులు ఊపిరి పీల్చుకున్నారు. డాలర్ పుంజుకోవడంతో పెట్టుబడులను వేరే ఆస్తుల వైపు మళ్లించారు. దీంతో బంగారం ధరలు కాస్త తగ్గుముఖం పట్టవచ్చని అంటున్నారు. ప్రస్తుత ధరకు బంగారాన్ని కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో రేటు తగ్గడం వల్ల నష్టపోతారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. అయితే, మత విశ్వాసాలు ఒకవైపు, అంతర్జాతీయ పరిణామాలు మరోవైపు పసిడి పరుగులకు ఊతమిస్తునే ఉన్నాయి. దీనితో భవిష్యత్తు ట్రెండ్ ఎలా ఉంటుందో అంచనా వేయడం కూడా కష్టంగా మారుతున్నదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

## 'ఆపిల్' తదుపరి సిఇఒ ఎవరు?




మొబైల్ రంగ దిగ్గజం ఆపిల్ కంపెనీ సిఇఒ టిమ్ కుక్ వచ్చే ఏడాది పదవి నుంచి వైదొలగనున్న నేపథ్యంలో, ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ జోరందుకుంది. స్టీవ్ జాబ్స్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత, 2011లో కుక్ ఈ కంపెనీ సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు. కంపెనీపై తనదైన ముద్ర వేశారు. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌లో ముద్రితమైన వార్తను అనుసరించి, వచ్చే ఏడాది జనవరి మాసం చివరిలో విడుదలయ్యే మూడో త్రైమాసిక ఫలితాల తర్వాతే కొత్త సిఇఒను యాపిల్ ప్రకటిస్తుంది. కాగా, హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టర్నస్‌ను కుక్ తరువాతి వారసుడిగా భావిస్తున్నట్లు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. అందుకు కొన్ని అంశాలు ప్రస్తావించింది. జాన్ టర్నస్ ప్రస్తుతం ఆపిల్‌లో హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన నేరుగా సిఇఒ టిమ్ కుక్‌కు నివేదికలు సమర్పిస్తారు. ఐఫోన్, ఐప్యాడ మాక్, ఎయిర్‌పాడ్స్ తదితర ఉత్పత్తులపై పనిచేసే అన్ని హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ బృందాలను ఆయన పర్యవేక్షిస్తారు. టర్నస్ 2001లో ఆపిల్ ప్రోడక్ట్ డిజైన్ టీంలో చేరారు. 2013 నుంచి హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్నారు. ఆపిల్‌లో ఉన్న సమయంలో, ఆయన అన్ని తరాల ఐప్యాడ్‌లు, నూతన ఐఫోన్ సిరీస్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటి అనేక ఉత్పత్తుల హార్డ్‌వేర్ అభివృద్ధిని నడిపించారు. ఆపిల్‌లో చేరక ముందు, ఆయన వర్చువల్ రీసెర్చ్ సిస్టమ్స్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేశారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. ఇలావుంటే, టిమ్ కుక్ రాజీనామా చేస్తారా? లేదా? అనే ప్రశ్న కూడా ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ ఏడాది చివరిలో ఆయనకు 65 ఏళ్లు నిండుతాయి. అందుకే, ఆయన రాజీనామాపై ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే, టిమ్ కుక్ గానీ, ఆపిల్ పాలక వర్గంగానీ అధికారికంగా ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

## కమ్యూనిస్టుల చరిత్రను కాలం చెరపలేదు : బెజవాడ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని అలాంటి కమ్యూనిస్టుల చరిత్రను కాలం చెరపలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో సిపిఐ పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 15 నుండి 21 వరకు రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్వాల నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎం.బాలనరసింహలు పాల్గొంటారని, నవంబర్ 20న హుజూర్‌నగర్ చేరుకుంటుందని తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల కోసం, సమానత్వం కోసం, దోపిడి, హింస నుండి కాపాడడం కోసం కమ్యూనిస్టుల ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు జాతి ఏనాటికి మరువదన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభలో కమ్యూనిస్టుల చరిత్రను ప్రజలకు యువతకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, మామిడి వెంకయ్య, దొంతగాని సత్యనారాయణ, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# 19న భూపాలపల్లిలో సిపిఐ ప్రచార జాతా

**• సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ • హాజరుకానున్న సిపిఐ జాతీయ నాయకులు చాడ • ప్రచార జాతాలో భారీ బైక్ ర్యాలీ**




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా ఈనెల 19న జిల్లాలో నిర్వహించే సిపిఐ కళాజాతాను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలు నవంబర్ 15న ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు ప్రచార జాత ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ప్రచార జాతా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదిలాబాద్ మంచిర్యాల, గోదావరిఖని, హుస్నాబాద్ హనుమకొండ మీదుగా ఈనెల 19న సాయంత్రం 4:30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి కళాజాత బృందం చేరుకుంటుందని, అదే రోజు 5:30 గంటలకు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అనంతరం రాత్రి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోనే బస చేసి ఉదయం 10:30 గంటలకు గణపురం నుండి ములుగు జిల్లాకు కళాజాత చేరుకుంటుందని రాజకుమార్ తెలిపారు. కావున జిల్లాలో ఉన్న సిపిఐ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు, కూలీలు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సిపిఐ కళాజాతాను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### భారీ బైక్ ర్యాలీ

ఈనెల 19న సిపిఐ పార్టీ ముగింపు ఉత్సవాల్లో ప్రచార జాతాలో భాగంగా మంజూరు నగర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందని కళాజాత అతిధులను మంజూరు నగర్ లో భారీ ఆహ్వానం పలికి పైకి ర్యాలీ ద్వారా భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మోటపలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్ ఎండి.అస్లాం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 17న నాగర్‌కర్నూల్‌కు రానున్న సిపిఐ రాష్ట్రజాతా

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రజాత ఈనెల17న నాగర్‌కర్నూల్ జిల్లాకు రానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 10గంటలకు తిమ్మాజిపేటకు జాత చేరుకుంటుందని అక్కడినుండి బిజినేపల్లి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం తెలకపల్లి అచ్చంపేట మీదుగా సాయంత్రం డిండివద్ద నల్గొండ జిల్లాకు జాతాను అప్పజెబుతారని తెలిపారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టుపార్టీ సిపిఐ ఉత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో ఈరాష్ట్ర జాతజిల్లాకు రావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈజాతకు సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ ఎమ్మెల్సీ నల్లికంటిసత్యం, రాష్ట్రకార్యవర్గసభ్యులు ఇతరపార్టీ నాయకులు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

# హామీలు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తాం

**మధ్యాహ్న భోజన పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పూసాల రమేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి**




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ధర్నా కొనసాగిస్తామని మధ్యాహ్న భోజన పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా చేసి కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ ధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వాలు మారిన తలరాత మారడం లేదని, సమస్యలు ఎప్పటికప్పు డు పెరుగుతున్నాయి తప్ప సమస్యల పరిష్కారానికి ఏ ప్రభుత్వం కృషి చేయడం లేదని, తద్వారా మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు అగమ్య గోచారంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో మధ్యాహ్న భోజన వర్కర్లకు సరైన న్యాయం జరగలేదని, కాంగ్రెస్ ప్ర భుత్వం వచ్చిన తర్వాతనైనా మా సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతోందని అనుకున్నామని, కానీ రెండు సంవత్సరాలు గడిచిన మా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. మధ్యాహ్న భోజన కార్మికుల ప్రధాన సమస్యలు అంగన్వాడీ సెంటర్లలో నిత్యావసర సరుకు లు ఎలా ఇస్తున్నారో మాకు కూడా అలాగే నిత్యావసర సరుకులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన వర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు పదివేల రూపాయల గౌరవ వేదం చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న పాత బకాయిలు వెంటనే చెల్లించాలని డి మాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా సమస్యలపై సానుకూలంగా స్పందించి పాఠశాలలలో ని పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించేలా చ ర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం మా స మస్యలను పరిష్కరించే వరకు నేటి నుండి నిరవధి క సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల యశోద, రాధమ్మ, లావణ్య, కళావతి, జుబేదా జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా భోజన కార్మికులు పాల్గొన్నారు.

(6వ పేజీ తరువాయి)

చేయాలని నిర్ణయించుకొన్నారు. బికెఎంయు జాతీయ ఉపాధ్యక్షులయ్యారు. సుధాకర్‌రెడ్డి తండ్రిగారైన వెంకట్రామిరెడ్డి గారు ఎఐకెఎస్‌లో బాధ్యతలు నిర్వహించారు. అందుకే సుధాకర్‌రెడ్డిగారిని ఎఐకెఎస్‌లో బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కాని వ్యవసాయ కార్మిక సంఘంలో పనిచేయడానికే నిర్ణయించుకొని బికెఎంయు (BKMU) జాతీయ ఉపాధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చెకొస్లొవేకియా, మంగోలియా, చైనా లాంటి అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల జాతీయ మహాసభలకు సౌహార్ద్ర ప్రతినిధిగా హాజరయ్యారు. సుధాకర్‌రెడ్డి లోక్‌సభకు పోటీ చేస్తున్న సందర్భంలో "సురవరం కంఠధ్వని పార్లమెంటులో ప్రతిధ్వని" అనే నినాదం నల్లగొండ జిల్లాలో వీధి వీధిన మారుమోగింది. ఆయనగారు లోక్‌సభకు ఎన్నికైన తదనంతరం పార్లమెంటు గ్రూపు నాయకునిగా పేరు ప్రతిపాదన రావటం, ఆయన ఆ పదవిని సున్నితంగా తిరస్కరించటం చకచక సాగిపోయాయి. దానికి కారణం మరికొంత మంది నాయకులు సీనియర్లు కావటమే. వారిని కాదని తన పేరును ప్రతిపాదించటం భావ్యం కాదన్నారు. అలాగే ఆయన వర్గ దృక్పథానికి న్యాయం చేకూరేవిధంగా లోక్‌సభలో కార్మికశాఖ కమిటీకి చైర్మన్ పదవి ఆయనను వరించింది. అనేక సంవత్సరాలుగా ఆయన ఆత్మకథను వ్రాయాలని, అందుకు తాను సహకరిస్తానని వివరించినా దానికి ఆయన సమయాన్ని ఎన్నడూ కేటాయించలేకపోయారు. ఎంతమంది కార్యకర్తలను తయారు చేసినా గంటల తరబడి ప్రసంగాలు చేసినా, ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని రగిలించడానికి సమయం దొరికేది కాని, బయోగ్రఫీ రాయడానికి సమయం దొరకలేదు. కార్మిక సంఘాలకు సైతం సుధాకర్‌రెడ్డి నాయకత్వం వహించారు. మింట్ ఎంప్లాయిస్ జాతీయ సంఘానికి నాయకత్వం వహించి ఆ కార్మికుల, ఉద్యోగుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. సుధాకర్‌రెడ్డి అనేక ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రతి

# మానవత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం

ధ్వనింపచేసారు. అందులో అతి ముఖ్యమైనవి కొన్ని భారత దేశంలో మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసి కొత్త నోట్లు ముద్రించిన దశలో ఆ సంఖ్య వివరాలు (ముద్రించిన నోట్ల సంఖ్య, బ్యాంకులకు అందజేసిన సంఖ్య పార్లమెంటుకు, కనీసం పార్లమెటరీ కమిటీకి తెలియచేయాలని తన వాణిని ప్రతిధ్వనింపచేశారు. అలాగే విదేశీ బ్యాంకుల దాచుకొన్న డబ్బును, ముఖ్యంగా స్విస్ బ్యాంకులో దాచుకొన్న నల్లధనాన్ని తెప్పించాలని, ఆ డబ్బును ప్రజలకు పంచిపెడితే ప్రతి ఒక్కరికీ రూ.15లక్షల చొప్పున చేరుతుందని లెక్కలు తీసి పార్లమెంటులో ప్రజావాణిని వినిపించారు.

సుధాకర్‌రెడ్డిగారు కేవలం ప్రసంగాలకే పరిమితం కాలేదు. విద్యార్థి – యువజన నాయకులుగా 18 సంవత్సరాలకే ఓటుహక్కు ఇవ్వాలని సమరశీల పోరాటాలు చేశారు. లాఠీ దెబ్బలకు గురయ్యారు. ఉత్తర భారతంలోని అనేక జైలు జీవితాలను సైతం అనుభవించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, దానికి వ్యతిరేకంగా తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి సమరశీల ప్రజా బాహుళ్యంతో కూడిన "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా నాయకత్వం వహించి నిర్వహించారు. ప్రత్యక్షంగా తాను ముందుండి పోలీసుల లాఠీ చార్జీని, గుర్రాల డెక్కలతో ప్రదర్శకులపై పాశవిక పోలీసులు దాడి జరిపినా లెక్కచేయకుండా ప్రదర్శనను ముందుకు సాగించారు. సిపిఐ–సిపిఐ(ఎం) ఫార్వర్డ్ బ్లాక్ ఆర్‌యస్‌పి–యంసిపిఐ(యు) – ఎస్.యుసిఐ(సి) – న్యూ డెమోక్రసి – సిపిఐ–ఎంఎల్(లిబరేషన్) తొమ్మిది కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన సాగింది. పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు ప్రదర్శకులు అమరులయ్యారు. వందలాది మంది గాయాలపాలయ్యారు. అనేక మందిని జైళ్లలోకి ఈడ్చారు. తదనంతరం బంద్ కార్యక్రమం కూడా జరిగింది. నిత్యజీవితంలో ఎంత సౌమ్యుడో, నమ్మిన సిద్ధాంతం, ఆశయాల పట్ల అంత కఠినంగా వ్యవహరించటం సుధాకర్‌రెడ్డికే చెల్లింది. నమ్మిన ఆశయాలకు వ్యతిరేకంగా రాజీపడే ప్రసక్తే లేదు. సుధాకర్‌రెడ్డి మరణించిన తదనంతరం సైతం ఆయన కోరిక మేరకు పార్థీవ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ వైద్యశాలకు అందచేయటం జరిగింది. ఆయన జాతీయ నాయకుడైనా జన్మభూమిని మరిచిపోలేదు. గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం కావాలని, స్కూళ్లలో సౌకర్యాలు మెరుగుపడాలని హాస్పిటల్ నుండి సైతం ప్రభుత్వానికి లేఖలు పంపిస్తూనే ఉన్నాడు. ఆయన అంకిత భావం అలాంటిది. పుట్టినవారు గిట్టక మానరు. అయితే జీవితకాలంలో వారి సేవలు ఎలాంటివి అనేదే ప్రశ్న. వారి స్నేహశీలతత్వం, మృదువుగా ఎదుటివారిని ఒప్పించడం, అన్యాయానికి వ్యతిరేకంగా స్పందించడం ఇవన్నీ కలగలిపి అనేకమంది హృదయాలను చూరగలిగాడు. అందుకే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సహా ఉపరాష్ట్రపతిగా పోటీచేసిన సుభాషణ్‌రెడ్డి, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రి, అనేక మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, పౌరహక్కుల సంఘాల, మానవహక్కుల సంఘాల నాయకుడు స్వయాన ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన ఆశయాలకు అంకితమై పోరాటాలను ఉధృతం చేయడమే ఆయనకు సరియైన నివాళి. సుధాకర్‌రెడ్డిగారికి విప్లవ జోహార్లు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## పేదల సంక్షేమమే ధ్యేయం



**ప్రజాపక్షం/నల్గొండ టౌన్ :** సీఎం ఆర్ ఎఫ్ పథకం నిరుపేదలకు చాలా ఉపయోగకరమైన పథకమని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా 40 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన చెక్ లను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి నేతృత్వంలో అమలు అవుతున్నాయని ఆయన చెప్పారు.ఈ పథకం ద్వారా పేదప్రజలకు ఎంతో లబ్ది చేకూరుతుందని అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే అని వారిని జాగ్రత్తగా చూసుకోవాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గాంధీపార్కు నుండి మిని ట్యాంక్ బండ్ వరకు వయోవృద్ధుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. ట్యాంక్‌బండ్ వద్ద వయోవృద్ధుల అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధుల కమిటి మెంబర్స్, వయో వృద్ధుల అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు ఎస్‌డి హామీద్‌ఖాన్, కృష్ణారెడ్డి, రామకృష్ణరెడ్డి, మల్లారెడ్డి, సిడిపిఓలు సుబ్బలక్ష్మి , కిరణ్మయి, శ్రీజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందలేదు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** జిల్లాలో వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ కోరారు. శనివారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. రైతులకు మద్దతు ధర అందించడంతోపాటు బోనస్ కూడా అందించాలన్నారు. సహకార సంఘాలు ఐకెపి సెంటర్ల ద్వారా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలన్నారు. తుఫాన్ వర్షాల వల్ల జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని, ఆ రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి పరిహారం అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, వెంకటేశ్వర్లు, రమణ, యాదగిరి పాల్గొన్నారు.

## ప్రతి పుస్తకం విలువైంది



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గ్రంథాలయంలో ఉన్న ప్రతి పుస్తకం విలువైనదని వాటిని అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హాఫీజ్ ఖాన్ అన్నారు.58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా కలిగే ప్రత్యక్ష అనుభవం ఎంతో అనుభూతిని ఇస్తుందని పాఠకులకు ఏ విధమైన పుస్తకాలు కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. గ్రంథాలయానికి ఇంటర్ నెట్, వైఫై సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు.జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎన్.పద్మ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మన జ్ఞానం పెంపొందుతుందన్నారు.ప్రపంచ చరిత్ర,సాహిత్యం తెలుసుకునేందుకు పుస్తకాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ,సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, సంస్థ రాష్ట్ర నాయకుడు ఎస్.వేణుగోపాలాచార్యులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయి ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగల వెంకటేష్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ అన్నారు. శనివారం ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం జిల్లా అధ్యక్షులు వస్తుపూల అభిలాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజులు నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఫైర్, ల్యాబ్, క్వాలిఫైడ్ లెక్చరర్స్, కనీస మౌలిక సదుపాయాలు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు, బెస్ట్ అవలేబుల్, బకాయిలు, స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. ఆ ప్రభావ యాజమాన్యాల కంటే విద్యార్థులపై ఎక్కువ పడుతుందని ప్రభుత్వం ఆలోచించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు పెరిగిన కాస్మత్ చార్జీలు తక్షణమే చెల్లించాలని న్నారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లు స్వెటర్లు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మారపాక లోకేష్, జానీ, చందు, సాయికుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం

పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద తుఫాన్‌తో దెబ్బతిన్న కాలువలను, రహదారులను కట్ట పరిస్థితి పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షలతో పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద దెబ్బతిన్న పనుల పునరుద్ధరణకు అన్ని చర్యలు తీసుకుంటామని నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టర్ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. కాలి నడకన నడిచి రిజర్వాయర్ కింద దెబ్బ తిన్న కాలువలను, రహదారులను కట్ట పరిస్థితిని పరిశీలించారు. ఎఫ్‌డిఆర్ కింద పనుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రిజర్వాయర్ ఎత్తు పెంచితే ముంపునకు ఏఏ ప్రాంతాలు గురవుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కట్ట సామర్థ్యాన్ని పెంచితే హిర్యతండా, గుడితండా, పత్య తండాలు ముంపుకు గురవుతాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండ్లిపాకుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు రూ. 1204 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని అన్నారు. రిజర్వాయర్‌కు 2771 ఎకరాలు అవసరం అవుతాయని, ఇప్పటి వరకు 1917 ఎకరాలు సేకరించామని అధికారులు తెలిపారు. 854 ఎకరాలకు అవార్డు పాస్ అయినప్పటికి చెల్లింపులు చేయవలసి ఉందని తెలిపారు. ఈ రిజర్వాయర్ పూర్తి అయితే గ్రావిటి ద్వారా నల్గొండ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.



కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బద్రు, ఈఈ నెహ్రూనాయక్, డిఈ రాములు, ఏఈఈ భాస్కర్‌రావు, తహశీల్దార్లు నరేందర్, శ్రవణ్, సతీష్, తదితర శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### నక్కలగండి తండా ఆర్అండ్ఆర్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు, నక్కలగండి తండా ఆర్అండ్ఆర్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరిశీలించారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో వరద పరిస్థితిని ఆమె పరిశీలించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన నక్కలగండి తండా, రిజర్వాయర్ కట్టను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినందున మిగిలిన 5 శాతం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. డిండి ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న రైతులు జిల్లా కలెక్టర్ ను కలిసి ఊట నీటికారణంగా తమకు ఇబ్బంది కలుగుతుందని, తమకు కూడా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ భద్రు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ, డిఈ చక్రపాణి, పవన్ పాల్గొన్నారు.

# పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** పదో తరగతి చదివే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతం పెంచాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆయన శనివారం మోటకొండూరు మండలం లోని ముత్తి రెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజు స్కూల్ వచ్చేలా చూడాలని, స్కూల్ కి రాని విద్యార్థుల తల్లి దండ్రులకు ఫోన్ చేసి పిల్లలను పిలిపించాలని సూచించారు. పదవ తరగతి చెప్పే టీచర్స్ కి వార్షిక పరీక్షల వరకు అత్యవసరమైతే తప్ప సెలవులు ఇవ్వొద్దని హెడ్మాస్టర్ ను ఆదేశించారు. విద్యార్థులకు పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం మేణు ప్రకారం అందిస్తున్నారా అని తనిఖీ చేశారు. విద్యార్థులకి ఇచ్చే ఆహారంలో సరిపడా పప్పు లేదు,కూరగాయలు కూడా ఎక్కువగా లేవు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతిరోజు విద్యార్థులకి మెనూ ప్రకారం ఇవ్వాల్సిన ఆహారాన్ని ఇవ్వాలనిఆదేశించారు. స్కూల్లో విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆట ఆడారు. జిల్లా స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో బాలురు, బాలికల టీమ్ లు 1,2 పతకాలు సాధించిన విషయం తెలుసుకుని వారినిఅభినందించారు. క్రీడలలో మాదిరిగా చదువులో కూడా సత్తా చాటాలని సూచించారు.



**మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు సార్...** మాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు అని కలెక్టర్‌ని ధైర్యంగా కీర్తి కుమార్ అనే విద్యార్థి అడుగగా కలెక్టర్ వెంటనే ఎంపీడీఓతో మాట్లాడి విచారించగా వాళ్లకు స్థలం లేదని ఎల్2 లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని కలెక్టర్‌కు తెలిపారు. అయితే విద్యార్థి ధైర్యాన్ని మెచ్చుకొని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గఫార్, ఉపాధ్యాయ బృందం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ గెలుపు బిఆర్ఎస్, బిజెపిలకు చెంపపెట్టు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుతో బిఆర్ఎస్, బిజెపిలకు చెంపపెట్టు అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన గాదంగి సుజాత, శ్రావణి, ఉమారాణి, మామిడి విజయ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలంలో వీరి కుటుంబాలు నీట మునిగిన పరిస్థితిని తాను స్వయంగా చూసి చలించిపోయానన్నారు. పత్రికల ద్వారా వచ్చిన సమాచారాన్ని చూసి వెంటనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు, ఇండ్లు ఇవ్వలేదన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేషకుమార్, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేగటి రవి, రేగటి వెంకటేష్, దాసరి శ్రీను పాల్గొన్నారు.



## అప్పులు తీర్చే మార్గం లేక.. పురుగుల మందు తాగి పత్తి రైతుఆత్మహత్య



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** పత్తి సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్కట్ పల్లిలో చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం చండూర్ మండలం పుల్లెంలకు చెందిన మందడి సుఖేందర్ రెడ్డి బతుకు దెరువు కోసం కొన్నేళ్ల క్రితం నార్కట్ పల్లికి గ్రామీణ వైద్యం చేస్తూ పుల్లెంలలో తనకున్న ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేశాడు.ఇటీవల అకాల వర్షాలతో పంట మొత్తం నష్ట పోయింది. దీంతో వరుస రెండేళ్లుగా పత్తి పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక గురువారం క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. మృతుడుకి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. వీరిలో ఓ కొడుకు అంగ వైకల్యంతో ఇబ్బంది పడుతున్నాడు.లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర సేకరణ చేశారు.ఈ సందర్భంగా క్లబ్ మెంబర్స్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన జీవితం గడిపి న వీరి మరణానంతరం వీరి నేత్రం దానం చేసి కర్నియ అందత్వంతో బాధపడుతున్న ఇద్దరి నుండి నాల్గురి కి కంటి చూపు ను ప్రసాదించి ఆదర్శముగా నిలిచారాని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులు కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నేత్ర దానం సర్టిఫికెట్ ను అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల వైఫల్యం



**ప్రజాపక్షం/చండూర్/గట్టుప్పల :** సిపిఐ శాతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ నవంబర్ 15 నుండి21 వరకు గద్వాల నుండి ప్రారంభమై కొత్తగూడెం వరకు నిర్వహించే సిపిఐ ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం గట్టుప్పల మండల సిపిఐకౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ స్వాతంత్ర అనంతరం తెలంగాణలో నిజాం నిరంకుశ పాలన అంతం అందించడంలో సిపిఐ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిందని గుర్తు చేశారు. దేశంలో ప్రజల హక్కుల కోసం ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐదని కొనియాడారు. పాలకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రతి రైతు ఎకరాకి 50వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్,కార్యవర్గ సభ్యులు రాపోలు, సత్తయ్య,ధనంజయ, లక్ష్మయ్య ,కారింగు శ్రీను, ముత్యం ధర్మయ్య ,యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.


## విశ్వవిద్యాలయాలు నూతన సృష్టికర్తకు కార్యరూపం దాల్చాలి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** ఉన్నత లక్ష్యాలతో స్పష్టమైన కార్యాచరణతో అందుకునే అక్షర యజ్ఞంగా విశ్వవిద్యాలయాలు వేదికగా మారాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మండలం పరిధిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎంజీయూలో నెలకొన్న విద్యార్థుల సమస్యలు, సదుపాయాలు,ఉన్నత విద్య స్థితిగతులపై విద్యార్థులతో మాట్లాడారు.విద్యార్థులు ప్రస్తావించిన హాస్టల్ సదుపాయాలు లైబ్రరీ,సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు విధానం వంటి అంశాలపై చర్చించి అనంతరం విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ముందుగా విద్యార్థులతో హాస్టల్ మెస్‌లో భోజనం చేసిన అనంతరం, విశ్వవిద్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో విద్యార్థులతో ముచ్చటించారు. విశ్వవిద్యాలయ కేంద్రంగా ఫలవంతమైన కొత్త తరం రూపొందాలని,విద్యార్థులు జ్ఞానం,సమగ్రత తో మెరుగైన సమాజంపై కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్,మత్తు పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉంటూ సామాజిక అంశాలపై జనావళికి చైతన్యం కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి,ఎం జి యు అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రూట్ మార్చిన రియల్టర్లు...!




**ప్రజాపక్షం/సూర్యాపేట :** రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుదేల్ కావడంతో రియాల్టర్లు తమ రూట్‌ను మార్చారు. తమ ప్లాట్లు అమ్ముడు పోకపోవడంతో బంపర్ ఆఫర్ లక్కీ డ్రాలను తెరమీదికి తెచ్చారు. 'రూ.1,000 కొట్టు ప్లాట్ పట్టు'... అంటూ మరికొన్ని ఆకర్షణీయమైన ఆఫర్లను పొందుపర్చి రంగు రంగుల బ్రోచర్లను ప్రింట్ చేసి సోషల్ మీడియా వేదిక ద్వారా జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. దీంతో గజం జాగను కొనుగోలు చేసే స్థోమత లేని అనేక మంది నిరుపేదలు వారి ఆఫర్లకు ఆకర్షితులై తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు. ఈ రియాల్టర్లు చేసే వ్యాపారం అంతా చట్టబద్ధతేనా, మోసాలు ఏమైనా ఉన్నాయా అని కూడా చూడకుండా వారికి డబ్బులు చెల్లిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఈ నయా దందాపై దృష్టిసారించిన దాఖలాలు లేవు.

నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ ప్రాంతంలో ఇటీవల ఓ వ్యక్తి తన ఇల్లు అమ్మకానికి పెట్టగా అది ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో తన అవసరాలరిత్యా దానిని అమ్ముకునేందుకు లక్కీ డ్రాను ఎంచుకున్నాడు. రూ.1,000 కొట్టు ప్లాట్ పట్టు అంటూ రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి అందులో మరికొన్ని ఆకర్షణీయమైన ఆఫర్లను కూడా పొందుపర్చాడు. దీంతో పెద్దఎత్తున స్పందన వచ్చింది. తాను అమ్మాలనుకున్న ధర కన్నా రెట్టింపు వచ్చింది. ఇదే తరహాలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలువురు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ ప్లాట్ల అమ్మకానికి "బంపర్ ఆఫర్ లక్కీ డ్రా" అంటూ రంగు రంగుల బ్రోచర్లు ముద్రించి సోషల్‌మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. గత ఐదు రోజుల క్రితం కొంతమంది 200 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ లక్కీ డ్రా ద్వారా అమ్మకానికి పెట్టారు. వారు ముద్రించిన రంగుల బ్రోచర్‌లో ప్లాట్ కొలతలు, ఏరియాను పొందుపర్చడంతో పాటు మొదటి బహుమతి ఓపెన్ ప్లాట్, రెండవ బహుమతి ఐదు తులాల బంగారం, మూడవ బహుమతి 2.5గ్రాముల బంగారం, నాల్గవ బహుమతి 100 గ్రాముల వెండి డ్రాలో గెలుపొందిన వారికి ఇస్తామంటూ ప్రకటించారు. వివరాల కోసం వారి ఫోన్ నంబర్లు, డబ్బులు చెల్లించాల్సిన ఫోన్ పే, గూగల్ పేల నంబర్లను, లక్కీ డ్రా తేదీలను కూడా అందులో పొందుపర్చారు. ఈ రంగుల బ్రోచర్‌ను చూసిన అనేక మంది పేదలు లక్కీ డ్రాకు చెల్లించేది రూ.1,000లు కదా! వస్తే ప్లాట్ వస్తది... పోతే రూ. 1,000 పోతాయంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎగబడుతున్నారు. అసలు ఆ ప్లాటు ఉందా లేదా.. ఉంటే అది దానికి సంబంధించిన పత్రాలన్ని సరిగ్గా ఉన్నాయా...? మార్కెట్ విలువ ఎంత ఉంటుంది అనేది కూడా చూడకుండా గుడ్డిగా వారికి డబ్బులు చెల్లిస్తున్న పరిస్థితి.

ప్లాట్లు అమ్ముడుపోక లక్కీ డ్రాకు తెర...
ఆకర్షణీయమైన ఆఫర్లతో సామాన్యులకు ఎర...
వీరు చేసే వ్యాపారమంతా చట్టానికి లోబడేనా...?

రియాల్టర్లు లక్కీ డ్రాల ద్వారా చేస్తున్న ప్లాట్ల వ్యాపారమంతా చట్టానికి లోబడే ఉందా... లేక చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారా అన్నదానిపై కూడా ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతుంది. లక్కీ డ్రాలో ఎంతమంది పాల్గొంటారు... వారికి ఎంత ఆదాయం వస్తుంది అనే దానిలో స్పష్టత లేకపోవడంపై పలు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు రియాల్టర్లు ఈ లక్కీ డ్రాలకు తెరలేపి వివిధ కారణాల చేత అమ్ముడు పోని ప్లాట్లను వారికి అంటకట్టి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఇదే తరహాలో నిజామాబాద్ జిల్లాలో భీంగల్‌లో లక్కీ డ్రా ద్వారా ప్లాట్లు అమ్మకాలకు పెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనితో అక్కడి పోలీసు అధికారులు ఇలాంటి లక్కీ డ్రా ప్లాట్ల అమ్మకాలపై దృష్టి సారించి ఈ తరహా వ్యాపారాలకు ప్రజలు మోసపోవద్దని, అవి చట్టబద్ధత కాదని అవగాహన కల్పించారు. సూర్యాపేట పోలీసులు కూడా ఈ లక్కీ డ్రాల వ్యవహారాలపై దృష్టి సారించి నిరుపేద ప్రజలు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం...

**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** మండలంలోని నుండి ఖమ్మం వెళ్లే జాతీయ రహదారిపై పిల్లలమర్రి శివారులో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. అటుగా వెళ్తున్న వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్‌పి కె నరసింహ రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్‌లతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం యొక్క సమాచారాన్ని తెలుసుకోవడానికి స్పెషల్ పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేశారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలను సేకరించారు. వ్యక్తిని హత్య చేసిన తరువాత ఒంటిపై యాసిడ్ పోసి కాల్చినట్లుగా ఉంది. ప్లాస్టిక్ బస్తాలో మృతదేహాన్ని తీసుకవచ్చి అక్కడ వదిలినట్లు స్పష్టమవుతుంది. మృతుని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని రూరల్ సిఐ రాజశేఖర్ తెలిపారు. ఈ వ్యక్తి సమాచారం తెలిసిన వారు సెల్ నంబర్ 8712686006 కు సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.





# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామంలో కోమటి కృష్ణయ్య శెట్టి అనే వ్యక్తికి చెందిన ఇంట్లో అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ ఉంచినందున పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, ధన్వాడ పోలీసులు దాడులు నిర్వహించి 5.2 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి డిటి పంచనామా అనంతరం కోమటి కృష్ణయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ధన్వాడ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ ఉంచిన, రవాణా చేసిన, ఇతరులు అమ్మిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలో శ్రీశైలం అనే రైతు గొర్రెలను మేపడానికి వెళుతుండగా కుక్కలు ఆకస్మాత్తుగా దాడి చేయడంతో 18 గొర్రెలు అక్కడికక్కడే మృతి తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రైతుల శ్రీశైలానికి 25 వేల ఆర్థిక సాయం చేశారు. శనివారం బాలానగర్ కేంద్రంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కుక్కలు దాడిలో 18 గొర్రెలు మృతి చెందిన బాధాకరంగా ఉందని ఇలాంటి సంఘటనలు జరగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుక్కలను రోడ్లపై వదలకుండా ఇంట్లోనే బంధించాలని ఆయన కోరారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



సిపిఐ జిల్లా నాయకులు

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలిని సిపిఐ మాజీ మండల కార్యదర్శి, తెల్ల రాళ్ల పల్లి ఉప సర్పంచ్ కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. శనివారం తెల్లరాల్లపల్లిలో మాట్లాడుతూ.. కొన్ని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి 15 రోజులు అవుతున్న ఇంతవరకు కేంద్రాలే ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పానుగల్ రేమద్దుల మహ్మదాపురం కేతేపల్లి, బండపల్లి తదితర గ్రామాల్లో కేంద్రాలకు ధాన్యం వచ్చిందన్నారు. పానుగల్ సమీపం కొత్తపేట బస్ స్టాప్ కేంద్రానికి అన్నారం, పానుగల్ తదితర ప్రాంతాల నుంచి ధాన్యం తరుగు వచ్చి నష్టపోతామని ఆందోలన చెందుతున్నారన్నారు. మండలం పలు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలకు ఇంతవరకు స్థలాలని కేటాయించలేదని, తెల్లరాల్లపల్లిలో స్థలం కేటాయించక ఇండ్ల ముందే ధాన్యం కుప్పలు పోసుకున్నారన్నారు. సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సహదేవ్ సీనియర్ నేతలె ఎర్రగుంట రాముడు, కాటంరాముడు, కట్టెల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు 100 శాతం న్యాయం



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు 100% న్యాయం జరిగిందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. శనివారం జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలంలో ఆయన పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 50% మాత్రమే చిన్న చేపలు ప్రజా ప్రభుత్వం వచ్చాక 100% నాణ్యమైన చేప పిల్లల పంపిణీ మత్స్యకారుల సమస్యలను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. జానంపల్లి అనిరుధ్‌రెడ్డి మిడ్జిల్ మండల కేంద్రంలో ఉన్న నల్ల చెరువులో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల సంరక్షణ వృద్ధి కోసం చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు గోనెల శ్రీనివాసులు, ఎయంసి మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, అల్వాల్ రెడ్డి, మత్స్యశాఖ అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక మత్స్యకార సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి భవిష్యత్‌కు పునాది

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగ అన్వేషణతో పాటు స్వయం ఉపాధిపై దృష్టి సారిస్తే భవిష్యత్ బాగుంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో దిండు ధర్మేందర్, శ్రీరాములు అనే యువకులు ఏర్పాటు చేసుకున్న పేపర్ ప్లేట్ తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగాల అన్వేషణ చేస్తూనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్న యువకులు ఇద్దరిని ఎమ్మెల్యే అభినందించారు. చేస్తున్న వృత్తిని దైవంగా భావిస్తే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, బాల చంద్రయ్య, వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జూడో నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సబ్ జూనియర్ జూడో నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీసులు ఆదివారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, అధ్యక్షులు కైలాష్ యాదవ్‌లు తెలిపారు. ఎల్‌బిస్టేడియం వేదికగా ప్రారంభం కాబోతున్న ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.ఈ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జూడో క్రీడాకారులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. ఈ పోటీలు ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్పోర్ట్స్ మంత్రి వాకిటి శ్రీహరి ఆవిష్కరించారని వారు తెలిపారు. తెలంగాణ జూడో అసోసియేషన్ సభ్యులు రవీందర్, రాములు క్రీడాకారులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని వారు తెలిపారు.



# ప్రమాదానికి గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రమాదానికి గురైన సాతాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, వైద్య సేవలపై నిరంతరం వైద్యులతో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రమాదానికిగురై సర్జరీ అనంతరం చికిత్సపొందుతున్న నందుచరణ్, తేజ విద్యార్థులను డిఇఓ రమేష్‌కుమార్, డిఎంహెచ్‌ఓ రవినాయక్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శనివారం పరామర్శించి వారికి ధైర్యం కల్పించారు. ఎలాంటి ఇబ్బందులున్న నేరుగా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రమాద వివరాలను విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలు తీసుకురావడానికి ఎవరు పంపారు, ఎవరెవరు వచ్చారు అనే సమాచారాన్ని కలెక్టర్ నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. జిల్లా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి విషయాలను తెలుసుకున్నారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన తర్వాత విద్యార్థులకు ప్రత్యేక బోధనలను అందించాలని డిఇఓ రమేష్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిఇఓ, డిఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఇఓ రమేష్‌కుమార్, డిఎంహెచ్‌ఓ రవినాయక్, జిల్లా ఆస్పత్రి వైద్యులు రోహిత్ ఇతర వైద్యులు ఉన్నారు.

**ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్**

కలెక్టరేట్ సిబ్బంది, కలెక్టరేట్ సందర్శనకు వచ్చే సందర్శకులకు రుచికరమైన, పరిశుభ్రతపాటించి నాణ్యమైన భోజనాన్ని అందించి వారి మన్ననలుపొంది వ్యాపారాన్ని అభివృద్ధిపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ నిర్వాహకులకు సూచించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఇందిరామహిళాశక్తి క్యాంటిన్‌ను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. క్యాంటిన్‌లో సమోసా, కాఫీని కలెక్టర్ స్వీకరించి రుచి చూశారు. క్యాంటిన్ పరిసరాలను, భోజనం, కూరగాయల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. క్యాంటిన్ ఎలా నడుస్తుందని, ఎంతమంది వస్తున్నారని క్యాంటిన్ నిర్వాహకులు అర్చనను అడిగి తెలుసుకున్నారు. బయటి హోటల్స్‌కంటే రుచికరంగా భోజనం అందించాలని సూచించారు. సోమవారం నుండి చికెన్ బిర్యాని, చికెన్ కర్రీ ఇతర రుచికరమైన వంటలు అందుబాటులోకి తెస్తున్నట్లు క్యాంటిన్ నిర్వాహకులు అర్చన కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌వెంట కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, డిఆర్‌డిఎ డిపిఎం కృష్ణ, ఏపిఎం చారి ఉన్నారు.

## నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల
# సమస్యలపై 17న చలో హైదరాబాద్

మహబూబ్‌నగర్ డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కృష్ణకి నేషనల్ హెల్త్ మిషన్ ఆల్ కేడర్ ఉద్యోగుల ఆందోళన నోటీస్ అందజేత



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఆల్ క్యాడర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పెండింగ్ వేతనాలు ఏరియర్స్ సాధన కోసం ఈనెల 17న మహా ధర్నా పేరిట చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. శనివారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు పొరుగు సేవల ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనం, ఏడు నెలల పెండింగ్ ఏరియర్స్ ఉద్యోగ భద్రత డిమాండ్స్‌తో 17న చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త మహాధర్నా నోటీసును ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియూసి అనుబంధం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలోని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్.కృష్ణకి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించకుండా నెలల తరబడి పెండింగులో ఉంచడం చేత ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని విధిలేని పరిస్థితుల్లోనే 17న కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట వారి ఆందోళనకు దిగుతున్నామని అన్నారు. కావున ఎన్‌హెచ్‌ఎం స్కీములో పనిచేస్తున్న ఆల్ క్యాడర్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు, ఉద్యోగులు నవీన్ కుమార్, తిమ్మప్పలు, హరిబాబు, యుగేందర్, గోపాలకృష్ణ, మహేష్, రంజిత్, నాయక్, స్వప్న, రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు

కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లాలోని రహదారులపై ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకితో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బి శాఖల అధికారులతో జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాలానగర్, మూసాపేట బ్రిడ్జి పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులకు సర్వీస్ రోడ్లలో పోవడానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే 44,167 లపై మీడియాన్ ప్లాంటేషన్‌కు రకరకాల పూల మొక్కలను పెట్టాలని అన్నారు. బాలానగర్, మూసాపేట, దివిటిపల్లి వద్ద కొనసాగుతున్న రోడ్డు నిర్మాణపనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పి డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఈఈ, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌టిసి సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

**వృద్ధులను గౌరవించటంలో మనందరం బాధ్యతతో వ్యవహరించాలి**

వృద్ధులను గౌరవించటంలో మనందరం బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక స్టేడియం గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు వృద్ధుల పట్ల వ్యవహరించాల్సిన తీరు పై నిర్వహించిన ' అవగాహన ర్యాలీ' ని కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర, జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, అదనపు ఎస్పీ రత్నం, జడ్.పి.సి. ఈ. ఓ వెంకట రెడ్డి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్, డిఎంహెచ్‌ఓ కృష్ణ, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, రాజసింహుడు, కోటిరెడ్డి, నాగేంద్రస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

# నిర్దేశిత గడువులోగా అనుమతులు మంజూరు

కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మండలి సమావేశం. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి. ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయవలసిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరై ఆమె మాట్లాడారు. ఎస్సీ 12, ఎస్టీ 4, పిహెచ్సీ 1లకు పెట్టుబడి సబ్సిడీ మంజూరు కు డిఐపిసి కమిటీలో ఆమెదం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం లింగేశ్వర్ గౌడ్, ఐ.పి.ఓ. నర్సింగ్ రావు, ఎల్.డిఎం విజయ్ కుమార్ సీటిఓ ప్రవీణ్, యం. నరేశ్ అసిస్టెంట్ హైడ్రాలాజిస్ట్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ విద్యుత్ ఎస్సీ వెంకటరమణ, ఎస్ఆర్ఓ కృష్ణ గౌడ్, సాయ తేజ రెడ్డి , ఇరిగేషన్ ఈ బ్రహ్మానంద, కృష్ణ గౌడ్, డిపిఓ సుధాకర్ రెడ్డి, లేబర్ శాఖ తిలక, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**చదువుల పండగ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి**

నారాయణపేట జిల్లాలో చదువుల పండగ కార్యక్రమం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సంచిత్ గంగ్వార్ తో కలిసి కలెక్టర్ ఛాంబర్ లో విద్యాశాఖ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్సి చదువుతున్న విద్యార్థుల మార్కులు తల్లిదండ్రులను తెలిసేలా చేయడానికి ఎస్ఎంఎస్ ద్వారా ప్రతిభ తెలిసేలా సాఫ్ట్వేర్ డెవలప్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి అపర్ సంఖ్య పెంచాలన్నారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ప్రత్యేక పిటిఎం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎస్సీ తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్ ఎక్కడ చదువుతారో అధికారులు రికార్డు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ పై ప్రజలకు అవగాహన కల్పించి దాని కొరకే ప్రజలను ఎడ్యుకేట్ చేయాలన్నారు. బాల్యవివాహాలను అరకట్టడానికి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే ఎస్ఎస్సీ చదువుతన్న విద్యార్థుల పరీక్షాలకి సంబంధించిన మార్క్స్, హాజరు తదితర వివరాలు పేరెంట్స్ ఎప్పటికప్పుడు తెలుసుకునే ఉదంగత్ అప్ ను డెవలప్ చేసి పేరెంట్స్ కి అందుబాటులో తెచ్చి చూసుకునే విధంగా అవగాహన టీచర్స్, హెడ్మాస్టర్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ ప్రణయ్, ఆర్డీ రాంచందర్, డిప్యూటీ కలెక్టర్ ట్రైని శ్రీరామ్ ప్రణీత్, ఫణిరాజ్ డిప్యూటీ కలెక్టర్ ట్రైని, డిపిఓ సుధాకర్ రెడ్డి, రాజేష్ కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలు లేని సమాజం కోసం పోరాటం : ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** ఆర్థిక అసమానతలు అంతరాలు లేని సమాజం కోసం సిపిఐ పోరాడుతోందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరగనున్న సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల ప్రచార జాత వనపర్తికి చేరుకొంది. సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో సిపిఐ ఆఫీస్ నుంచి పాలిటెక్నిక్ వరకు ఎర్ర బోనాల ప్రదర్శన నిర్వహించి బస్సు జాతకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ చౌక్ లో జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షతన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ..బిజెపి దేశ సంపదను ఆదాని అంబానీలకు కట్టబెడుతూ సమాజంలో ఆర్థిక సమానతలను మరింత పెంచుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ మాట్లాడుతూ..కమ్యూనిష్టు పార్టీ ఏమిచ్చిందని కొందరు ప్రశ్నిస్తుంటారని ప్రజలకు ప్రశ్నించటం, పోరాడటం పరిష్కారం సాధించటం నేర్పింది కమ్యూనిష్టు పార్టీయే అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, జె చంద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా నేత పృథ్వినాదం, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ పట్టణ కన్వీనర్ జయమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి కుతుబ్, సిపిఐ పట్టణ మాజీ సహాయ కార్యదర్శి కురమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, డివిజన్ కార్యదర్శి వంశి, మహిళా నేతలు శిరీష, వెంకటమ్మ, జ్యోతి, అంజనమ్మ, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


# భద్రతామండలి పనితీరులో దాపరికం వద్దు

సభ్యదేశాల సంఖ్య పెంచాలి

భారత దౌత్యవేత్త హరీశ్ పిలుపు

**న్యూయార్క్:** ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలన్నీ ముఖ్యంగా భద్రతా మండలి విస్తారమై బాహాట పద్ధతులలో దాపరికం లేకుండా పనిచేయాలని భారతదేశ శాశ్వత ప్రతినిధి, దౌత్యవేత్త పర్వతనేని హరీశ్ కోరారు. భద్రతా మండలి పని తీరు, పని పద్ధతులపై జరిగిన బహిరంగ చర్చలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ దేశాలకు అంతర్జాతీయ నియమ నిబంధనావళిని నిర్దేశించే ఐక్యరాజ్యసమితిలో భద్రతా మండలే అత్యంత కీలకమైన వ్యవస్థ అనీ, ప్రధానంగా అంతర్జాతీయ శాంతిని కాపాడటంతోపాటు, అంతర్జాతీయ భద్రతను కూడా భద్రతామండలే కాపాడుతుందన్నారు. ''ఐక్యరాజ్యసమితిలో అత్యంత కీలకమైన విభాగంగా ఉన్న భద్రతా మండలికి అనేక అంశాలలో ప్రాధాన్యత ఉంది, కానీ భద్రతా మండలిలో సభ్యత్వం మాత్రం చాలా పరిమితంగా ఉంది, కేవలం 15 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు, దీనివల్ల మండలి పనితీరు, పరిపరిస్థితులను నిర్వహించడం సంక్లిష్టంగా మారింది. గడచిన 80 సంవత్సరాలలో ప్రపంచంలో ఎన్నో మార్పులు సంభవించాయి, దేశాల సంఖ్య పెరిగింది, ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం విస్తరించింది, అవసరాలు పెరిగాయి, పరిస్థితులు మారాయి, భద్రతామండలి విశ్వసనీయత, సామర్థ్యం, దాపరికంలేకుండా ఉండటం వంటి విషయాలూ సంక్లిష్టంగా మారాయి,అనేక సంక్షోభాలు, అసంఖ్యాకమైన సవాళ్ళను ఎదుర్కొంటున్న ప్రపంచంలో ఈ బాహాటత్వ విధానంవల్ల కొంత ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలన్నీ బాహాటత్వ పద్ధతులలో పనిచేయాలన్నారు. దేశాలు చేస్తున్న విజ్ఞప్తులను తిరస్కరిస్తున్నారని, అలా జాబితాలోంచి తీసేసి తిరస్కరించకుండా, అయోమయం,ఆగమ్యగోచరమైన, అర్థంకాని విధంగా ప్రవర్తించకుండా భద్రతామండలి వివరాలను రహస్యంగా ఉంచకూడదన్నారు. భద్రతామండలి కమిటీలు అతిపెద్ద బాధ్యతలతో ముందుకురావాలన్నారు. భద్రతామండలిలో చర్చలు, అధ్యక్షపదవి విభజన కూడా స్వప్రయోజనాలతో సభ్యదేశాలమధ్యనే ఉండకుండా చూడాలన్నారు. భద్రతామండలిలో 15 మంది సభ్యదేశాల సంఖ్యను పెంచాల్సిన విషయాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. భద్రతామండలి సమకాలీన సమస్యలను పరిష్కరించగలస్థాయిలో విస్తృతం కావాలని, అందుకు తగినవిధంగా తీర్చిదిద్దాలని కోరారు. శాశ్వత,అశాశ్వత సభ్యదేశాల సంఖ్యను భద్రతామండలిలో పెంచాలని కోరారు.

## ఎన్నికల నిర్వహణకు లోపరహిత ఓటరు జాబితా కీలకం



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోపరహితంగా ఖచ్చితత్వంతో ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ కార్యక్రమం పురోగతిని శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని ఇఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ జాబితా నవీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిశీలన, ఫీల్డ్ ధృవీకరణ, డేటా ఎంట్రీ ఖచ్చితత్వం వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కట్టుబడి అమలు చేయాలని, ప్రతి దశలోనూ ఖచ్చితత్వం, జాగ్రత్త, సమయపాలన తప్పనిసరి అన్నారు. ఖచ్చితమైన, లోపరహిత ఓటర్ జాబితా ఎన్నికల నిర్వహణలో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఈఓ హరి సింగ్‌తోపాటు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌సిఎ అవినీతిపై చర్య తీసుకోవాలని టిసిఎ ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అవినీతి, నిధుల దుర్వినియోగం, రాష్ట్ర క్రికెట్ జట్టులో సభ్యుల ఎంపికలో అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) అధ్యక్షుడు దారమ్ గురువారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్‌సిఎ తాత్కాలిక అధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ డిజిపి బి.శివధర్‌రెడ్డితో పాటు రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబుకు ఆయన ఫిర్యాదు చేశారు. గతంలో హెచ్‌సిఎపై ఫోర్జరీ కేసులు, అక్రమాలపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయని వాటన్నింటిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టు నియమించిన హెచ్‌సిఎ సింగిల్ మెంబర్ కమిటి జస్టిస్ నవీన్‌రావుకు కూడా గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. అండర్23 రాష్ట్ర జట్టు ఎంపిక కూడా వివాదంలో చిక్కుకుందని, అర్హులైన వారిని జట్టులోకి తీసుకోకుండా అక్రమాలకు పాల్పడి అనర్హులైన వారికి జట్టులో చోటు కల్పించారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కరీంనగర్‌కు చెందిన తల్లిదండ్రులు డి.ఆంజనేయులు దాఖలు చేసిన పిటిషన్‌కు ఆయన జత చేసి ఇచ్చారు. సమాన ప్రాతినిధ్య నిబంధనలను ఉల్లంఘించి జిల్లాల నుండి ఆటగాళ్లను మినహాయించారని ఆయన ఆరోపించారు. ఎంపిక చేసిన హైదరాబాద్ క్లబ్‌లకు సంబంధించిన ఆటగాళ్లను మాత్రమే పరిగణించారన్నారు. ప్లేయర్ల నియామకంపై వారి తల్లిదండ్రులపై ఆర్థిక ఒత్తిడిలు తీసుకువచ్చారన్నారు. మెరిట్‌ను పక్కన పెట్టి జిల్లాలలో ఉన్న క్రీడా ప్రతిభాకారులను అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సిఎ బ్యాంక్ ఆడిట్ స్టేట్‌మెంట్లపై కూడా దృష్టి సారించాలన్నారు. నిధులను పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో హెచ్‌సిఎ విచ్చలవిడిగా కోట్లాది రూపాయలను కాజేశారని ఆయన ఆరోపించారు. వేలాది మంది యువ క్రికెటర్లు, ముఖ్యంగా గ్రామీణ, జిల్లా ప్రాంతాల నుండి, న్యాయమైన అవకాశాలను అందలేకుండా పోయాయన్నారు.

# రీల్

## రెస్పాన్స్ అద్భుతం

### ప్రెస్ మీట్‌లో రానా దగ్గుబాటి



దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ రెట్రో బ్లాక్ బస్టర్ 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. దుల్కర్ సల్మాన్ 'వేఫేర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్', రానా దగ్గుబాటి 'స్పిరిట్ మీడియా' సంయుక్తంగా నిర్మించారు. నవంబర్ 14 విడుదలైన ఈ సినిమా అన్ని చోట్ల అద్భుతమైన రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. కాంత సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్నిచ్చింది. ముఖ్యంగా పెర్ఫార్మెన్స్‌లకు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. దుల్కర్ కెరీర్ ఫైనెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. మ్యూజిక్, విజువల్స్ టెక్నికల్ వాల్యూస్ గురించి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూ వున్నా సినిమా ఇది. జోనర్ బెండింగ్ సినిమాగా వచ్చిన ఫస్ట్ ఫిలిమ్ కాంత. ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. మద్రాస్ నేపథ్యంలో జరిగే కథ కావడం, ఎలాంటి అంచనా లేకుండా చూడటంతో మద్రాస్ ఆడియన్స్ ఇంకా అద్భుతంగా కనెక్ట్ అయ్యారు.

## 'దేవగుడి' టీజర్ విడుదల



పుష్పమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచన, స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవగుడి'. ఈ చిత్రానికి లక్ష్మీ కాంత్ కనికే డీఓపి గా పని చేస్తుండగా షేక్ మదీన్, రఘు కుంచె సంగీతాన్ని అందించారు. నాగిరెడ్డి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తించారు. అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ప్రధాన పాత్రలు పోషించగా పలువురు నటీనటులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. '2013లో రామకృష్ణా రెడ్డి నిర్మాతగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఎంతో ప్యాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చిన ఆయన ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా సినిమాలు నిర్మించి సక్సెస్ అయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న ఈ 'దేవగుడి' చిత్రం మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. 'దేవగుడి' టైటిల్ చాలా బాగుంది. టీజర్ కూడా అద్భుతంగా ఉంది. ఇందులో చిత్రమ్మ పాడిన మెలోడీ సాంగ్ చాలా చాలా బాగుంది. చాలా రోజుల తర్వాత ఆ సాంగ్ నా మదిని తాకింది. ఇది ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రియల్‌గా జరిగిన స్టోరీ అని నేను అనుకుంటున్నాను. కంటెంట్ బాగుంటే.. తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. కచ్చితంగా ఈ సినిమాను కూడా ఆదరిస్తారని, ఆదరించాలని కోరుకుంటున్నాను. మా రామకృష్ణా రెడ్డికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నాను అని అన్నారు.

## సెకండ్ ఇన్నింగ్స్ నా డిక్షనరీలో లేదు

### అఖండ-2 ఈవెంట్‌లో బాలకృష్ణ



యాబై ఏళ్లుగా సినీ పరిశ్రమలో కథానాయకుడిగా ఉన్నారు. సెకండ్ ఇన్నింగ్స్ అనేది నా డిక్షనరీలో లేదు. హిందూ సనాతన ధర్మం శక్తి పరాక్రమం అఖండ-2లో సినిమాలో చూస్తారు. ధర్మంగా బ్రతకండి సత్యం మాట్లాడండి అన్యాయానికి తలవంచకండి..ఇది అఖండ తాండవం. బోయపాటితో మూడు సినిమాలు చేశాం. సింహ, లెజెండ్, అఖండ.. మూడు హ్యాట్రిక్. ఇది నాలుగో సినిమా. బోయపాటి నేను ఒకటే వేవ్ లెంత్‌లో వర్క్ చేస్తాం. తమన్‌తో అఖండ, వీరసింహారెడ్డి, నేలకొండ భగవంత కేసరి, డాకు మహారాజ్, ఇప్పుడు అఖండ2. మాది అద్భుతమైన కాంబినేషన్. కైలాష్ ఖేర్, శంకర్ మహాదేవన్ హిందూ సనాతన ధర్మానికి సంబంధించిన ఈ పాటని ఎంతో అద్భుతంగా ఆలపించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని తీసుకెళ్లి ఈ సినిమాని చూపించాలి. మన హిందూ సనాతన ధర్మం ఏమిటో చెప్పాలి అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ముంబైలో జరిగిన అఖండ 2 టైటిల్ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడారు. నాకు జన్మనిచ్చినటువంటి నా తల్లిదండ్రులకు ముందుగా ప్రణామాలు. వారి ఆశీర్వాదంతోనే నేనుమీ ముందు నిలబడి ఉన్నాను. మా నాన్నగారి అడుగుజాడల్లో ముందుకు వెళుతున్నాను. హిందూపురం ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తున్నాను. ఆచంట రామ్, గోపి నిర్మాణంలో నాకు ఇది రెండో సినిమా. చాలా మంచి సినిమాలు తీయాలి ఇండస్ట్రీకి కాంట్రిబ్యూట్ చేయాలని తపనతో ఉండే ప్రొడ్యూసర్స్. జార్జియా, మధ్యప్రదేశ్ ఇలా చాలా అద్భుతమైన లొకేషన్స్ లో షూట్ చేసిన సినిమా ఇది. సినిమాని ప్రజెంట్ చేస్తున్న నందమూరి తేజస్విని మా అమ్మాయి. నేను హోస్టుగా చేసిన అన్ స్టాపబుల్ ఇండియాలో నెంబర్ వన్ షో. ఆ షోకి మా అమ్మాయి క్రియేటివ్ కన్సల్టెంట్‌గా వర్క్ చేశారు. అఖండ 2 చాలా అద్భుతమైన సినిమా. డిసెంబర్ 5న మీ ముందుకు వస్తుంది. ముంబై ఈవెంట్‌లో ఈ సాంగ్‌ని లాంచ్ చేయడం ఇక్కడి నుంచి ప్రమోషన్స్ మొదలు పెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, సింగర్ కైలాష్ ఖేర్, నిర్మాత గోపి ఆచంట, నటుడు ఆది పినిశెట్టి పాల్గొన్నారు.

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా థియేటర్ రిలీజ్ కు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ సాయిలు కంపాటి మీడియాతో చిట్ చాట్ చేశారు. మాది

## ఇది నిజమైన కథ

### 'చిట్‌చాట్'లో దర్శకుడు సాయిలు కంపాటి



వరంగల్ జిల్లా. చిన్నప్పటి నుంచే సినిమాల మీద ఆసక్తి ఉండేది. అప్పుడు 16 టీవీస్, సంపంగి ఇలాంటి మూవీస్ చూసి సినిమాల పట్ల ఆకర్షితుడిని అయ్యాను. సినిమా డైరెక్టర్ ఎవరు, టెక్నీషియన్స్ ఎవరు, వాళ్లు గతంలో ఏ సినిమాలకు వర్క్ చేశారు. ఇలా ప్రతి విషయం గమనించి గుర్తుపెట్టుకునేవాడిని. మా ఊరికి చెందిన స్నేహితుడు ఒకరు అప్పటికే ఇండస్ట్రీకి వచ్చారు. ఆయన నాగార్జున గ్రీకువీరుడు సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేసేవారు. సినిమాల పట్ల నా ఆసక్తిని గమనించి ఎంకరేజ్ చేశారు. బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఉద్యోగాల ప్రయత్నాలు చేసినా, నా మనసంతా సినిమాల వైపే ఉండేది. కొన్ని స్క్రిప్ట్ రెడీ చేసుకోవడం మొదలుపెట్టా. మొదట్లో కమర్షియల్ స్క్రిప్ట్ గురించి ఆలోచించినా, ఆ తర్వాత మనదైన నేటివిటీ, మన ఆత్మ ఆ మూవీలో కనిపించాలి అనిపించింది. ఆ తరహా స్క్రిప్ట్స్ రాయడం ప్రారంభించా. డైరెక్టర్స్ వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశా. ఒకరోజు వేణు ఊడుగుల అన్నకు 'రాజు వెడ్స్ రాంబాయి' కథ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. ఆ తర్వాత ఒక డెమో షూట్ చేసుకుని రమ్మన్నారు. అది చేశాక సినిమా అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత ఈటీవీ విన్ వాళ్లు కూడా మా ప్రాజెక్ట్‌లో జాయిన్ అయ్యారు. ఇది పరువు హత్యకు సంబంధించిన కథ కాదు.. కానీ అలాంటిదే. రాజు తన ప్రేయసి రాంబాయిని పెళ్లి చేసుకున్నట్లే ఊహించుకుని రాజు వెడ్స్ రాంబాయి అని రాస్తుంటాడు. ఈ కథలో ప్రేమికులకు ఏం జరిగింది అనేది మాత్రం తెరపైనే చూడాలి. మూవీ బాగా వచ్చేందుకు మా టీమ్ బాగా సపోర్ట్ చేశారు. నా తదుపరి సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి, త్వరలోనే ఆ ప్రాజెక్ట్ అనౌన్స్ చేస్తాను అన్నారు.

## హ్యాపీగా ఉంది

### నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ఈ రోజు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సెంటర్స్ నుంచి ఈ సినిమాకు సూపర్ హిట్ టాక్ వస్తోంది. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందించారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న నేపథ్యంలో ఈ మూవీ టీమ్ ప్రెస్ మీట్ ద్వారా తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని




ర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అంటూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. ఒక ఎంటర్ టైనింగ్ మూవీ కోసం ప్రేక్షకులు ఎంతగా ఎదురుచూస్తున్నారో మా సినిమా సక్సెస్‌తో అర్థమైంది. ఆయ్, లిటిల్ హార్ట్స్ తర్వాత అలాంటి హోల్ సమ్ ఎంటర్ టైనర్ మా మూవీ అని అంటున్నారు. అన్ని ఏరియాల నుంచి మంచి టాక్ ఉంది. హీరో విక్రాంత్ మాట్లాడుతూ సినిమా రిలీజ్ కు ముందు రోజు రాత్రి టెన్షన్‌తో నిద్రపట్టలేదు. మార్నింగ్ బుక్ మై షో చూస్తే మేజర్ థియేటర్స్‌లో బుకింగ్స్ బాగా జరగడం చూసి సర్ ప్రైజ్ అయ్యాను. రివ్యూస్ ఒక్కొక్కటిగా పాజిటివ్‌గా రావడం సంతోషంగా అనిపించింది. హీరోయిన్ చాందినీ చౌదరి మాట్లాడుతూ 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అని మేము ప్రమోషన్‌లో చెబుతూ వచ్చాం. ఈ రోజు థియేటర్స్‌లో సినిమా చూస్తున్న ఆడియెన్స్ కూడా అదే ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు. థియేటర్స్‌కు వెళ్లి చూశాను. ఆడియెన్స్ ఎలా రెస్పాండ్ అవుతున్నారో చూశాక హ్యాపీగా అనిపించిన్నారు. డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ ఈ సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు.

## షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ దరఖాస్తు పొడిగింపు



తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19,20,21 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. యువకుల నుంచి వచ్చిన స్పందన చూసి ఈనెల 20 వరకు అనుకున్న లాస్ట్ డేట్‌ను 26వ తేది వరకు పొడిగించినట్టు ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈనెల 26వ తేది వరకు ఔత్సాహికులు తమ షార్ట్ ఫిల్మ్ ను HISFF.INకు పంపాలని దిల్ రాజు కోరారు. ఈ ఫెస్టివల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిలిం స్టడీస్ అధినేత , అంకురం సినిమా దర్శకులు ఉమా మహేశ్వర్ రావు అనిరకాల సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే చాలా షార్ట్ ఫిలిమ్స్ వచ్చాయని అన్నారు. మూడు రోజుల పాటు ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ఐమాక్స్‌లో జరుగుతుందన్నారు

## సంగీత్ శోభన్ హీరోగా కొత్త సినిమా షురూ



మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీస్ తో యూత్ ఆడియెన్స్‌లో తనకుంటూ ఓ స్పెషల్ ఫాలోయింగ్ సంపాదించుకున్న యంగ్ ప్రామిసింగ్ హీరో సంగీత్ శోభన్, ఇటీవల గర్ల్ ఫ్రెండ్‌తో సూపర్ హిట్ అందుకున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని, ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని, డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ కాంబోలో ఓ క్రేజీ మూవీ రాబోతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవంలో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ స్క్రిప్ట్ అందజేయగా, నిర్మాత ఎస్ కేఎన్ క్లాప్ ఇచ్చి మూవీ టీమ్ కు తమ బెస్ట్ విశెస్ అందించారు. ఓ సరికొత్త ట్రెండీ లవ్ స్టోరీతో ఈ సినిమా తెరకెక్కనుంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమా నిర్మాణం కానుంది. ఈ చిత్రాన్ని లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు.

## దిగొచ్చిన ట్రంప్

**(మొదటి పేజీ తరువాయి)**

చర్యను ప్రశంసించింది. గతనెల,ఈనెల పలు సంస్థలు చేసిన సర్వేలలో ట్రంప్‌పై 58నుండి 63 శాతం మేరకు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్లు వెల్లడైంది. ఉద్యోగాల కోత, వలస విధానం, షట్‌డౌన్ పరిస్థితులతో పాటు ఇటీవల ఎన్నికల్లో సోషలిస్టు జోహ్రాన్ మమ్దానీ సహా పలువురు డెమోక్రాట్ల విజయం ఆయనకు శరాఘాతంగా మారింది. పులిమీద పుట్రలా జెఫ్రీ ఎప్సీన్ ఈమెయిల్స్ బహిర్గతం కావడంతో ఆయన పాలనాయంత్రాంగం అన్ని వైపుల నుండీ తీవ్రమైన ఒత్తిళ్ళకు గురవుతూ ఉండటంతో ఆకస్మికంగా ఈ నాటకీయ పరిణామం సంభవించింది. వినియోగదారులకు ధరల నుండి ఉపశమనం కలిగించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ట్రంప్‌కు ఈ పరిస్థితి వస్తుందని తమకు ముందుగానే తెలుసునని డెమోక్రాట్లు విమర్శించారు. 'అధ్యక్షుడు ట్రంప్ చిట్టచివరకు టారిఫ్‌ల పెరుగుదలవల్ల ధరలు మండిపోతున్నాయన్న విషయాన్ని ఒప్పుకుంటారని మాకు తెలుసు'' అని విర్జీనియా డెమోక్రటిక్ ప్రతినిధి డాన్ బేయర్ అన్నారు. గడచిన ఏప్రిల్ నుండి ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాల భారాలు మోపారు. ఈ టారిఫ్‌లవల్ల తమ దేశ వినియోగదారులపై ఎలాంటి ధరల భారం పడదని వాస్తవాలు భిన్నంగా ఉన్నప్పటికీ ఆయనతోపాటు ఆయన యంత్రాంగం ఇప్పటికీ వాదిస్తోంది. ముఖ్యంగా రికార్డుస్థాయిలో పెరిగిన గొడ్డుమాంసం ధర ప్రజలకు ఆందోళనకరంగా మారింది. ఐతే తఈ ధరలు తగ్గించేందుకు ప్రయత్నిస్తామని, ఆ ఉద్దేశం తమకు ఉందని ఆయన అంటూ వచ్చారు. ప్రపంచంలో ఏ దేశంపైనా లేనంతగా బ్రెజిల్‌పై 50శాతం పైగా సుంకాలను ట్రంప్ విధించారు. కానీ బ్రెజిల్ నుండే అమెరికాకు ఎక్కువగా గొడ్డుమాంసం దిగుమతి అవుతుంది. ఆర్థిక వ్యవస్థను బ్రహ్మాండంగా విస్తరించి అమెరికాకు పునర్వైభవం తీసుకురావాలని సంకల్పించుకున్న ట్రంప్, అనేక దిగుమతి వస్తువులపై భారీ ఎత్తున సుంకాలు విధించడం ద్వారా దేశీయ ఉత్పత్తులకు గణనీయంగా ప్రోత్సాహం ఇవ్వగలమని ఊహించుకుని తన రెండో విడత పాలనలో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో వివాదాస్పదంగా మారారు. వ్యతిరేక పరిస్థితుల మధ్య ఆకస్మికంగా ఆయన యూటర్న్ తీసుకున్నారు. ఇటీవల న్యూయార్క్ మేయర్, మరో ఇద్దరు గవర్నర్ల ఎన్నికల సందర్భంగా విర్జీనియా, న్యూజెర్సీ, ఇతర కీలక ప్రాంతాలలో ఆర్థిక సమస్యలే ప్రధానాంశాలుగా ప్రచారంలో చర్చకు వచ్చాయి. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికలు కూడా దూసుకువస్తూ ఉండటంతో డెమోక్రాట్లు తమ దాడి తీవ్రత పెంచడంతో ట్రంప్ ఈ చర్యలకు దిగారు. 'మేం కేవల కాఫీ లాంటి కొన్ని ఆహార వస్తువులపై సుంకాలు తగ్గించాం' అని ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో ఫ్లోరిడాకు వెళ్ళే మార్గంలో మీడియాకు చెప్పారు. మరోవైపు తాను అధికారంలోకి వచ్చినప్పటినుండీ దేశంలో ద్రవ్యోల్బణం అదృశ్యమైపోయిందని ట్రంప్ చెబుతున్నప్పటికీ అది చెక్కుచెదరకపోగా అమెరికా వినియోగదారులపై మరింత ఒత్తిడి పెంచుతున్నది. టారిఫ్‌లు అన్ని విధాలా దిగుమతులపై పెంచడంవల్ల కోశాగారం నిండిపోయిందని, కిరాణా దుకాణాలలో ధరలు పెద్ద సమస్యగా లేదని ఆయన అన్నారు. ట్రంప్ ప్రకటనపై డెమోక్రాట్లు స్పందిస్తూ, దేశంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాలవల్ల జనం జేబులకు చిల్లు పడుతోందని విమర్శించారు.

## సమగ్ర ప్రణాళిక

**(మొదటి పేజీ తరువాయి)**

నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో 'ఏరోస్పేస్ అండ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023–24లో రూ.15,900 కోట్లు కాగా 2024–25లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా–సాఫ్రాన్' ఫెసిలిటీ ఇటీవల అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యూఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. ఈ తరహాలోనే పెట్టుబడులు పెట్టేందుకు మరికొన్ని దిగ్గజ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హీరో ఎంటర్ ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బి డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను సమ్మిట్‌లో ఆవిష్కరించడమే ప్రధాన ఆకర్షణ

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రపంచ వేదికపైన ప్రదర్శించేందుకు డిసెంబర్ 8,9 తేదీల్లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు.'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025'అంశంపైన హైదరాబాద్ సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో రామకృష్ణారావు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ సిటీ, ముచ్చర్లలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణలో చేపట్టనున్న భవిష్యత్‌అభివృద్ధి దిశను చూపే విధంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను సమ్మిట్‌లో ఆవిష్కరించడమే ప్రధాన ఆకర్షణగా ఉండబోతుందన్నారు. రాష్ట్రాన్ని 2035 నాటికి 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. ఇవి సాహసోపేతమైనా సాధ్యమైన లక్ష్యాలని, ఇందుకు అన్ని శాఖల సమన్వయ కృషి అవసరమన్నారు. సమ్మిట్‌ను ప్రతి శాఖ తమ కార్యక్రమాలు, సరికొత్త ఆవిష్కరణలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రదర్శించుకునే వేదికగా తీసుకోవాలని సూచించారు. అన్ని పనులు నిర్ణీత గడువులలో పూర్తి చేయాలని, ఎలాంటి లోపం లేకుండా కార్యక్రమాలు అమలు కావాలని ఆదేశించారు. ఇది రాష్ట్ర సామర్థ్యాన్ని, సమగ్ర సుస్థిర అభివృద్ధి పట్ల ఉన్న కట్టుబాటును ప్రపంచానికి చాటే గొప్ప అవకాశం అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమ ప్రముఖులు, ఐటి నిపుణులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, రాయబారులు, క్రీడా ప్రముఖులు, సినిమా ప్రముఖులు, రియల్ ఎస్టేట్, మౌలిక రంగ ప్రతినిధులు, బహుపక్ష సంస్థల సభ్యులు మొత్తంగా సుమారు 1,300మందికి పైగా విశిష్ట అతిథులు హాజరుకానున్నారని వివరించారు. సిఐఐ, ఎఫ్ఐసిసిఐ, నాస్కామ్, అసోచామ్ వంటి జాతీయ వ్యాపార సంస్థలతో పాటు పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల సిఎండిలు కూడా పాల్గొననున్నారు. కాగా సమ్మిట్ వేదికలో 70థీమ్ ఆధారిత స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఆడియో విజువల్ ప్రజంటేషన్లు, గ్రాఫికల్ డిస్‌ప్లేలు, అనిమేటెడ్ కంటెంట్ ద్వారా తెలంగాణ అభివృద్ధి ప్రయాణం, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, భవిష్యత్ అవకాశాలను సందర్శకులకు ఆకర్షణీయంగా పరిచయం చేయనున్నారు. సమ్మిట్ మొత్తం రాష్ట్ర ఇన్నోవేషన్ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ఉండాలని, శాఖల మధ్య సమన్వయం, పకడ్బందీ ప్రణాళిక, గడువులకు కట్టుబడి పనిచేయడం అత్యంత కీలకమని సిఎంచెప్పిన విషయాన్ని రామకృష్ణారావు వివరించారు. సమావేశంలో వైఐటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రహదారులు, భవనాలు రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచిఘోష్‌తో పాటు వివిధ శాఖ ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.




## ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యూఢిల్లీలోని ప్రగతిమైదాన్‌లో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్(ఐఐటిఎఫ్) ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ను శనివారం తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్2025లో రాష్ట్ర పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చేతివృత్తులకు సంబంధించిన వస్తువులు, చేనేత వస్త్రాలు, గిరిజన ఆభరణాలు, చేతితో తయారు చేసిన గాజులు, హెర్బల్, మెడికల్ ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు, ఫ్యూజన్ బ్యాగ్స్‌ను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించనున్నటు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణ స్టాల్స్ ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. పోచంపల్లికి చెందిన ఇక్కత్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, వాస్‌కోట్స్, దుప్పట్టా, కాటన్ బెడ్‌షీట్స్, షర్టింగ్ ఫ్యాబ్రిక్స్ తదితర వైరైటీలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఈ ట్రేడ్ ఫెయిర్ రెండు వారాలు కొనసాగనుందని, మన దేశ ఐక్యత, వైవిధ్యం, జాతీయ పురోగతిని సూచిస్తూ జరుపుకునే 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' అనే ఇతివృత్తాన్ని ఈ 44వ ఎడిషన్ హైలైట్ చేస్తుందని డా.శశాంక్ గోయెల్ పేర్కొన్నారు.



## ప్రజలకు రక్షణ

**(మొదటి పేజీ తరువాయి)**

పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, సిపిఐ నాయకులు బద్రి సత్యనారాయణ, ఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## తిప్పికొట్టడం సాధ్యం

**(మొదటి పేజీ తరువాయి)**

నెడుతుందని మండపడ్డారు. దేశం సమైక్యంగా ఉండకుండగా మతం పేరుతోటి వర్గాలుగా విభజించి మెజార్టీ వర్గం ఓట్లతోటి చిరకాలంగా అధికారంలో ఉండాలని చూస్తుందని, అందుకు మతవిద్వేషాలను పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. పేద ప్రజలను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేయాలని అనేక పోరాటాలు నిర్వహించి, విజయాలు సాధించిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్మించేందుకు దేశాన్ని సమైక్యంగా నిర్మించేందుకు పార్టీని బలోపేతం చేసేందుకు వందేళ్ళ బస్సు జాత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వందేళ్ళ సిపిఐ ఉత్సవాలలో భాగంగా డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం జిల్లాలో ఐదు లక్షల మంది తో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, సభకు ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు మేధావులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న ఆశన్న, నాగర్ దొడ్డి వెంకట రాములు, ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, ఎఐవైఎఫ్ నాయకులు పరమేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, వీరేశ్, భరత్, గురుస్వామి, భీమేశ్, తిరుమలేశ్ కార్మిక సంఘాల నాయకులు నారాయణ, ప్రభుదాసు, తిమ్మప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com